www.SAKSHYAM.COM

ప్రజాహితమే మా అభిమతం


# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

Telangana

హైదరాబాద్
బుధవారం, 19 ఫిబ్రవరి 2025
Published from Hyderabad, Karim nagar & Nalgonda, Vijayawada.

సంపుటి: 16 | సంచిక: 49
పేజీలు: 08 | వెల: రూ.2:00



## కేంద్ర ఎన్నికల ప్రధానాధికారిగా జ్ఞానేశ్ కుమార్

అర్ధరాత్రి దాటిన తరవాత రాష్ట్రపతి ఉత్తర్వులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి18(సాక్ష్యం): భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియమితులయ్యారు.ఈ మేరకు సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయనతోపాటు ఎన్నికల

మిగతా 2 లో..



## కుంభమేళాకు భారీగా భక్తుల రాక

55కోట్లు దాటినట్లు ప్రభుత్వం ప్రకటన

ప్రయాగరాజ్,ఫిబ్రవరి18(సాక్ష్యం): ప్రయాగ్‌రాజ్‌లో వైభవంగా కొనసాగుతోన్న కుంభమేళాకు ఊహించని రీతిలో భక్తులు తరలివస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి 55 కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. మానవ చరిత్రలో ఏ మతపరమైన, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమంలో ఇంత

మిగతా 2 లో..




# నేరాల శైలీ మారుతోంది

సైబర్ నేరాలల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాలకు పరిష్కారాలను కనుగొనడమే లక్ష్యంగా హెచ్ఐసీసీలో నిర్వహించిన షీల్డ్ 2025 సదస్సులో సీఎం మాట్లాడారు. దేశంలోనే సైబర్ సేఫ్టీలో మన రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడమే మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. డిజిటల్ సేఫ్టీ, ఫ్యూచర్ గురించి చర్చించేందుకు ఇవాళ షీల్డ్ 2025ని నిర్వహించుకుంటుమన్నారు. మొదటిసారి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌కు అభినందనలు తెలిపారు.

## సైబర్ నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యం

- ఎక్కడో ఉండి చేసేనేరాలే సవాల్‌గా మారాయి
- సైబర్ నేరాలను అరికట్టేందుకు 7 కొత్త పోలీసు స్టేషన్లు
- సొమ్ము రికవరీలో సైబరాబాద్ పోలీసుల ముందంజ
- ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు
- 'షీల్డ్ 2025'లో కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): నేరాల శైలీ మారుతోంది, దానికి అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాల్సి ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణలో ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి అన్నారు. సైబర్ నేరాల పరిష్కారం కోసం హెచ్ఐసిసిలో ఏర్పాటు చేసిన 'షీల్డ్ 2025'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సైబర్ నేరాల్లో కోల్పోయిన సొమ్మును తిరిగి తీసుకురావడంలో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు గత ఏడాది 7 కొత్త పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశాం. ఒకప్పుడు ఇంట్లో ఉండే

మిగతా 2 లో..

## స్టార్టప్‌లకు తెలంగాణ ప్రోత్సాహం

గోయాస్ హబ్‌తో అవగాహన ఒప్పందం

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): స్టార్టప్ ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యానికి టీ హబ్, బ్రెజిల్ కు చెందిన గోయాస్ హబ్ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం హెచ్ఐసీసీలో గో యాస్ హబ్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం టీ హబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, బ్రెజిల్లోని గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

మిగతా 2 లో..




# భారత్‌లోకి టెస్లా ఆగమన సంకేతాలు

రిక్రూట్‌మెంట్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి18(సాక్ష్యం): భారత ఈవీ మార్కెట్‌లో ప్రవేశించాలని ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న టెస్లా సంస్థ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో సిబ్బంది నియామకాలను ప్రారంభించింది. ఢిల్లీ, ముంబై నగరాల్లో వివిధ పోస్టుల్లో ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్టు లింక్డ్ఇన్ వేదికగా ప్రకటించింది. దీంతో టెస్లా రాక ఖాయమైంది. ఇటీవలే ప్రధాని మోడీ, ఎలన్ మస్క్ మధ్య చర్చలు సాగాయి. తరవాత ఈ ప్రకటన వెలువడింది. టెస్లా ప్రకటన ప్రకారం, సర్వీస్ టెక్నీషియన్, సలహాదారు పోస్టులు వంటి వాటికి ఢిల్లీ, ముంబై నగరాల్లో నియామకాలు చేపడుతోంది.

మిగతా 3 లో..



## మహిళల క్యాన్సర్లకు విరుగుడుగా టీకా

త్వరాలోనే అందుబాటులోకి తెస్తున్నాం

కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్

ఛత్రపతి శంభాజీనగర్, ఫిబ్రవరి18(సాక్ష్యం): మహిళల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న క్యాన్సర్లను ఎదుర్కొనేందుకు ఐదారు నెలల్లో టీకా అందుబాటులోకి వస్తుందని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ వెల్లడించారు. ఈ టీకా వేసుకొనేందుకు 9 నుంచి 16 ఏళ్ల లోపు వయసు ఉన్న బాలికలు మాత్రమే అర్హులని స్పష్టం

మిగతా 2 లో..

## ఢిల్లీ సిఎం ఎంపికపై నేడు బీజేపీ భేటీ

పర్వేశ్ వర్మవైపూ బీజేపీ నేతల మొగ్గు

రేపటి ప్రమాణ స్వీకారానికి భారీగా ఏర్పాట్లు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి18(సాక్ష్యం): ఈ నెల 20 ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరనుందని సమాచారం. సిఎం అభ్యర్థి ఎంపిక సోమవారమే జరగాల్సి ఉన్నా..దానిని 19కి వాయిదా వేశారు. బుధవారం జరిగే భేటీలో సిఎం ఎంపిక జరగవచ్చు. 27 ఏళ్ల కలను సాకారం చేసుకుంటూ దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది భారతీయ జనతా పార్టీ త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. ఇన్నేళ్ల తర్వాత అధికారంలోకి వస్తుండటంతో నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున సినీ తారలు, పారిశ్రామికవేత్తలను

మిగతా 3 లో..





## త్వరలోనే రష్యా అధినేత పుతిన్‌తో భేటీ అవుతా

ఉక్రెయిన్ శాంతి చర్చలపై ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్,ఫిబ్రవరి18(సాక్ష్యం): త్వరలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అవుతానని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కొన్ని రోజుల్లో అమెరికా-రష్యా మధ్య సౌదీ అరేబియాలో ఉక్రెయిన్‌పై శాంతి చర్చలు జరగనున్నాయి. అయితే ఉక్రెయిన్ లేకుండానే ఈ చర్చలు చేపడతున్నారంటూ వస్తున్న విమర్శలపై ట్రంప్ స్పందించారు. యుద్ధాన్ని ముగించే ఏ చర్చల్లోనైనా

మిగతా 3 లో..



## 17 మంది నిందితులకు జీవిత ఖైదు

హత్య కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు

నల్గొండ,ఫిబ్రవరి18(సాక్ష్యం): ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో 17 మంది నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ నల్గొండలోని ఎస్సీ,ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు అదనపు న్యాయమూర్తి రోజా రమణి తీర్పు వెల్లడించారు. కోర్టు తీర్పుపై మృతుని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే, యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అజీంపేట గ్రామంలో 2017 సంవత్సరంలో బట్ట లింగయ్య హత్య జరిగింది. లింగయ్య గతంలో అదే గ్రామానికి చెందిన యాదవ సామాజిక

మిగతా 2 లో..

## కేసీఆర్ హయాంలో రైతు దర్జాగా బతికాడు

ఇప్పుడేమో బిచ్చమేసినట్లుగా రైతుభరోసా

- రుణమాఫీ పేరుతో రైతులకు టోకరా
- 15వేలు అని చెప్పి అన్నదాతలను మోసంచేశారు
- ఏడాది దాటినా ఎవ్వరికీ ప్రయోజనం లేదు
- ఆమన్‌గల్ రైతు ధర్నాలో కేటీఆర్ విమర్శలు
- ఐఎఎస్‌లను అవమానించేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



రంగారెడ్డి,ఫిబ్రవరి18(సాక్ష్యం): పదేండ్ల పాటు కేసీఆర్ హయాంలో రైతు ఒక రాజులాగా బ్రహ్మాండంగా బతికాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పదిహేను నెలల కాలంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఎవరికీ న్యాయం చేయలేదు. రైతు రుణమాఫీ, రైతుబంధు, తులం బంగారం, మహిళలకు రూ. 2500 రాలేదు. 420 హామీలిచ్చి దొంగమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని విమర్శలు గుప్పించారు. రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్‌లో ఏర్పాటు చేసిన రైతు దీక్షలో కేటీఆర్ ప్రసంగించారు. సొంత నియోజకవర్గం, సొంత తాలుకాలో కూడా ఒక్కపని చేయలేదు. సొంతూరికి, అత్తగారి ఊరికి ఏం చేసిండో అడుగదామని వచ్చానని కేటీఆర్ తెలిపారు. రూ. 2 లక్షల రుణమాఫీ చాలా మందికి కాలేదు. రైతుబంధు కూడా రాలేదు.

మిగతా 3 లో..



## కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగరాదు

ఏపీ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలిస్తోంది

నీటిపారుదలశాఖ మంత్రుల భేటీలో మంత్రి ఉత్తమ్




హైదరాబాద్,బ్రవరి18(సాక్ష్యం): కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగకుండా కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. ఏపీ ప్రభుత్వం కృష్ణాజలాలను అక్రమంగా తరలిస్తోందని, కేంద్రం అడ్డుకోవాలన్నారు. జయపురలో కేంద్ర జలశక్తిశాఖ ఆధ్వర్యంలో జరిగిన నీటిపారుదలశాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఉత్తమ్.. నీటి నిల్వ సదుపాయాలు, నీటి సరఫరా నిర్వహణపై ప్రెజెంటేషన్ ఇచ్చారు. కృష్ణా జలాల వినియోగాన్ని లెక్కించేందుకు

మిగతా 2 లో..

## కుంచించుకు పోయిన బతుకమ్మ కుంట

ఆక్రమనలతో ఆనవాళ్లు మాయం
పునరుద్ధరణ పనులు చేపట్టిన హైడ్రా

హైదరాబాద్,బ్రవరి18(సాక్ష్యం): అంబర్ పేటలోని బతుకమ్మ కుంట పునరుద్ధరణన పనులను హైడ్రా మొదలు పెట్టింది. పునరుద్ధర లో భాగంగా మంగళవారం బతుకమ్మ కుంటలో హైడ్రా పూడిక తీత పనులు చేపట్టింది. ఇందులో భాగంగా కుంటలో జేసీబీతో కొంత మేర మట్టి తీయగానే నీళ్లు బయటకు వచ్చాయి. గతంలో ఇక్కడ చెరువు ఉండటం వల్లనే నీళ్ళు బయటపడ్డాయని హైడ్రా అధికారులు చెబుతున్నారు. అంబర్ పేట మండలం బాగ్ అంబర్ పేట్ లోని సర్వే నంబరు 563 లో 1962- -63 లెక్కల ప్రకారం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట ఉంది. బఫర్ జోన్ తో కలిపి మొత్తం16.13 ఎకరాలు. అయితే తాజా సర్వే ప్రకారం

మిగతా 3 లో..

## తెలంగాణ హైకోర్టులో విషాదం

వాదనలు వినిపిస్తూ చనిపోయిన లాయర్

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): గుండెపోటు మరణాలు ఇటీవలి కాలంలో ఎక్కువైపోయాయి. అప్పటి వరకూ బాగానే ఉంటారు. కానీ హఠాత్తుగా కుప్పకూలిపోతారు. ఇలాంటి మరణం తెలంగాణ హైకోర్టులోనూ చోటు చేసుకుంది. ఓ కేసు సందర్భంగా ధర్మాసనం ముందు వాదనలు వినిపిస్తున్న పసునూరి వేణుగోపాల్ అనే లాయర్ హఠాత్తుగా కుప్పకూలిపోయారు. గుండెపోటు వచ్చిందని ఇతర లాయర్లు, కోర్టు సిబ్బంది సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకపోయింది. వెంటనే ప్రాణాలు కోల్పోయనట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో హైకోర్టు ప్రాంగణంలో విషాదం నెలకొంది. లాయర్ మృతి చెందడంతో కోర్టులోకేసుల విచారణలు బుధవారానికి వాయిదా వేశారు.

# సంపాదకీయం

## నివురుగప్పిన అవినీతి నిప్పు !

మంత్రులు కమిషన్లు లేనిదే పనిచేయడం లేదన్న బిజెపి ఆరోపణలు..ఇప్పుడు కాంగ్రెస్ పనితీరుపై అనుమానాలను రేకెత్తిస్తోంది. ప్రతి పనికి 10 నుంచి 15 శాతం కమిషన్ ముట్టచెప్పుకోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని అంటున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపి ఈటెల రాజేందర్ తదితరులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఇది నిజమా అని ఆలోచించే సమయం ఆసన్నమయ్యింది. కెసిఆర్ ప్రభుత్వ అవినీతి గురించి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. అలాగే కాంగ్రెస్ అధిష్టానం కూడా నిధుల కోసం తెలంగాణపై ఆధారపడుతోందన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలను సంతృప్తి పరిచేందుకు ఇక్కడ కమిషన్ల కక్కుర్తి మొదలయ్యిందన్న ఆరోపణలు నిజంగానే బాధ కలిగించేవిగా ఉన్నాయి. ఓ రకంగా విపక్ష బిఆర్ఎస్‌కు ఇది అందివచ్చిన అస్త్రం. ఏమాత్రం సమాచారం దొరికినా పట్టుకుని ఏకిపారేసేందుకు వారు సిద్దంగా ఉన్నారు. ఇకపోతే బిల్లులు మంజూరుకు ఓ మంత్రి భార్య నేరుగా కమిషన్లు డిమాండ్ చేస్తోందని కూడా అక్కడా ఇక్కడా గ్రామాల్లో కూడా జనం చర్చించు కుంటున్నారు. బిఆర్ఎస్ అవినీతిపై పోరాడుతున్న కాంగ్రెస్ తానే ఈ బురదలో కూరుకుంటే ఇక చేసేదేమీ లేదు. అలాగే కేంద్రానికి కప్పం కట్టేందుకు అవినీతి కూపంలో దిగితే ప్రజలు గమనిస్తూనే ఉంటారు. బిఆర్ఎస్ ఇలా చేసే మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు బిఆర్ఎస్‌ను అవినీతి పార్టీగా ముద్రవేసి పాలన చేస్తున్న కాంగ్రెస్ కూడా మూల్యం చెల్లించుకోక తప్పదు. తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా ..అని సామెత ఉంది. చేసిన తప్పులన్నీ చేసి..ఇప్పుడు కాంగ్రెస్ మీదపడి ఏడుస్తున్నారని ఇంతకాలం బిఆర్ఎస్‌ను విమర్శించి, మనం కూడా అదే ఊబిలో దిగితే కాంగ్రెస్ పార్టీని కూడా ప్రజలు నమ్మరు. ఇంతకాలం బిఆర్ఎస్ పదేళ్ల పాపాల గురించి మాట్లాడారు. ఇప్పుడిక కాంగ్రెస్ అవినీతి గురించి చర్చ మొదలయితే ఆ పార్టీని కాపాడడం కష్టమే. ఎందుకంటే మంత్రులపై సిఎం రేవంత్‌కు పట్టు లేదన్న విమర్శలు వస్తున్నాయి. నిప్పులేనిదే పొగరాదు. బిజెపి చేసిన ఆరోపణలను రేపు బిఆర్ఎస్ చేస్తుంది. అలాగని కాంగ్రెస్ మడిగట్టుకుని కూర్చున్న పార్టీ కాదు. అవినీతిలో ఆరితేరిన చేయి దానిది. ఇంతకాలం తమ పాలనలో అవినీతి వ్యవహారాల గురించి సమాధానం చెప్పడం లేదని ప్రజలు బిఆర్ఎస్‌ను నిందిస్తున్నారు. వారి పాలనలో మల్లన్నసాగర్ రైతులు తిరగబడితే ఎందుకు కేసులు పెట్టారో చెప్పాలని, ఖమ్మం జిల్లాలో రైతులపై ఎందుకు కాల్పులు జరిపారో..ఎందుకు బేడీలు వేశారో చెప్పారని అడుగుతూ వచ్చారు. కాళేశ్వరం అవినీతిపైనా మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలో రైతులను రెచ్చగొట్టిన ఘటనకు సమాధానం చెప్పాలని అన్నారు నిజానికి ఫార్మా కంపెనీల సృష్ట ప్రదాత కెటిఆర్. దానిని ఎవరూ కాదనలేరు. రైతుల భూములను అడ్డంగా లాక్కుని వ్యాపారం చేయడం ఎవరు చేసినా నిలదీయాల్సిందే. కానీ బిఆర్ఎస్ కాదు. అది ప్రజలకు వదిలేయాలి. అవినీతి నేతలు నీతులు వల్లించడం సరికాదు. ఎందుకంటే బిఆర్ఎస్ గురించి చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా అవినీతి కథలు ఉన్నాయి. కానీ ఎదురుదాడి చేయడం, గగ్గోలు పెట్టడం ద్వారా ఎంతోకాలం నమ్మించలేరు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి జరిగిందని అంటున్నారు. నిజంగానే అవినీతి జరిగితే బయటకు లాగాల్సిందే. రేవంత్ అయినా, రాహుల్ అయినా అవినీతి వ్యయహారంఆలపై చర్చ చేయాల్సిందే. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదస్ మున్షీ కూడా వాటాల కోసం డిమాండ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఇప్పటి వరకు ఇవన్నీ ఆరోపణలే కావచ్చు. కానీ నిజం బయటపడితే భగ్గున మండుతుంది. అవినీతిపై చర్చలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి నేతలు ఎవరున్నా వదిలిపెట్టకుండా రచ్చబండ ఏర్పాటు చేస్తే మంచిది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఆ తర్వాత పార్టీలోని కొందరు కీలక నేతలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడం వంటి పరిణామాలతో సహజంగానే బిఆర్ఎస్ పార్టీలో కొంత నీరసం ఆవహించింది. ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెల్చుకోక పోవడం కూడా గులాబీ పార్టీకి రాజకీయంగా భారీ దెబ్బ పడింది. మరోవైపు లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడం కూడా ఆ పార్టీని దెబ్బతీసింది. ప్రతిపక్ష నేతగా చురుకుగా ఉండాల్సిన కెసిఆర్ ఇంటికే పరిమితం కావడం చూస్తున్నాం. అధికారం లేకుంటే అసెంబ్లీలో అడుగు పెట్టమన్న రీతిలో కెసిఆర్, జగన్ తీరు ఉంది. ఈ క్రమంలో తమపై అవినీతి కేసుల దాడి పెరగడంతో ఆత్మరక్షణ కోసం బిఆర్ఎస్ విన్యాసాలు చేస్తోంది. ఎదురుదాడిని ఎంచుకుంది. ఇప్పుడు కాంగ్రెస్‌పై వస్తున్న ఆరోపణల్లో నిజం ఉన్నా లేకున్నా రచ్చ చేసేందుకు బిజెపికి తోడు బిఆర్ఎస్ కూడా ముందుకు రావడం ఖాయం. ఇప్పటికే కాంగ్రెస్ పాలనా వైఫల్యాల ఆధారంగా కెటిఆర్ గత కొద్ది రోజులుగా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావులు ఇద్దరూ అధికార కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. అంశాలవారీగా కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేల చేరిక విషయంలో న్యాయస్థానంలో సవాల్ విసిరారు. బిసి కులగణన,రైతుల రుణ మాఫీ, హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన వంటి అంశాలపై గగ్గోలు చేస్తున్నారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో విదేశీ కంపెనీకి అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రూ.55 కోట్లు నిబంధనలకు విరుద్దంగా ఇచ్చారని, ఈ కేసులో ఏసీబీ విచారణ చేస్తోంది. దీనిపైనా పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. ఇలా తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కిన సమయంలో కాంగ్రెస్ అవినీతి వ్యవహారం అంటూ బిజెపి నేతలు విమర్శలు చేయడం సంచలనానికి దారి తీసింది. బిజెపితో బిఆర్ఎస్‌కు లోపాయకారి ఒప్పందం ఉందని ఆరోపించినంత మాత్రాన ఆరోపణల తీవ్రతను తగ్గించలేం. ఈ క్రమంలో తెలంగాణలో తమపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా మంత్రులు జాగ్రత్తగా ఉండాలి. ప్రజా సమసయలపై శ్రద్ధ పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా మంత్రి కేటీఆర్ ఇప్పటికే అమృత్ టెండర్ల వ్యవహారన్ని తెరపైకి తెచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అమృత్ పథకంలో స్కాంకు తెరలేపారని ఆరోపించారు. అంతే కాకుండా రెవెన్యూ మంత్రి పొంగులేటికి సంబంధించిన స్కాంలను బయటపెడతానని కెటిఆర్ గతంలోనే హెచ్చరించారు. తప్పులేదు. రేవంత్, పొంగులేటిలు తప్పు చేసివుంటే కోర్టుకీడ్చాల్సిందే. అందుకే అందిరి అవినీతిపైనా చర్చ జరగాలి. విచారణ జరగాలి. కేసులు వేయాలి. అందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు మాత్రమే పరిష్కారం చూపగలవు. అందుకు రాజకీయ నేతలు సిద్దమా కాదా అన్నది చెప్పాలి.

### కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగరాదు

మొదటిపేజీ తరువాయి..

టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరారు. 55 కిలోమీటర్ల పొడవునా చేపడుతున్న మూసీ పునరుజ్జీవ, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వాలని.. గంగా, యమునా పునరుద్ధరణ తరహాలో మూసీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రి అన్నారు. మూసీ వెంట ట్రంక్, సీవరేజ్ నెట్ వర్క్ కోసం రూ.4వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు గోదావరి జలాలను తరలించే పనులకు రూ.6వేల కోట్లు ఇవ్వాలని కోరారు. కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా కేంద్రం చొరవ తీసుకొని తెలంగాణకు న్యాయం చేయాలన్న ఉత్తమ్.. పాలమూరు – రంగారెడ్డి, సమ్మక్క–సారక్క, సీతారామసాగర్ ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల పక్రియ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పనులు కొనసాగుతోన్న సాగునీటి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో రుణాలు సమకూర్చాలని, రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడికతీతకు అయ్యే వ్యయాన్ని కేంద్రమే భరించాలని కోరారు. మేడిగడ్డ ఆనకట్టకు సంబంధించి ఎన్డీఎస్ఏ విచారణ నివేదిక త్వరగా ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన కార్యాచరణ సూచించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.




### మహిళల క్యాన్సర్లకు విరుగుడుగా టీకా

మొదటిపేజీ తరువాయి..

చేశారు. ఈ టీకాపై పరిశోధనలు దాదాపు పూర్తి కావొచ్చాయని.. ట్రయల్స్ కొనసాగుతున్నాయన్నారు. మంగళవారం ఆయన ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. 30 ఏళ్లు పైబడిన మహిళలకు ఆసుపత్రులలో స్క్రీనింగ్




నిర్వహిస్తారు. ఈ వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు డేకేర్ క్యాన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. క్యాన్సర్ చికిత్సకు వినియోగించే ఔషధాలపై కస్టమ్స్ సుంకాన్ని రద్దు చేశాం. అందుబాటులోకి రాబోయే ఈ టీకా రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్లను నియంత్రిస్తుంది' అని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను ఆయుష్ సౌకర్యాలుగా మార్చడంపై విలేకర్లు ప్రశ్నించగా.. ఆసుపత్రులలో ఆయుష్ విభాగాలు ఉన్నాయని.. ప్రజలు ఈ సౌకర్యాలను పొందొచ్చన్నారు.

# నేరాల శైలీ మారుతోంది



మొదటిపేజీ తరువాయి..

సొమ్మును దొంగలు దోచుకొనేవారు.. కానీ ఇప్పుడు ఏక్కడి నుంచి దోపిడి చేస్తున్నారో తెలుసు కోవడం కష్టంగా మారిపోయిందన్నారు. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశాం. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో అందరినీ ఇక్కడ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో సైబర్ నేరగాళ్లు గత ఏడాది రూ. 22,812 కోట్లు దోచుకున్నారని ఒక అంచనా. ఇది మన ఆర్థిక వ్యవస్థకు, మన పౌరులకు ముప్పు. ఈరోజుల్లో ఫేక్ న్యూస్ అనేది మరో ప్రధానమైన ముప్పు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో సమాజంలో గందరగోళం ఏర్పడుతుంది. సైబర్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సైబర్ క్రైం ను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉంది. కానీ సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేరం జరిగిన తరువాత పట్టుకోవడం కాదు.. నేరం జరగకుండా నిరోధించేలా చూడాల్సి ఉందన్నారు. కొంతమంది సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ను సైబర్ నేరాల వల్ల రూ.15 వేల కోట్లను భారత్ నష్టపోతోంది' అని మంత్రి అన్నారు. 14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు ఈ కాన్క్లేవ్‌కు హాజరు కావడం ఆనందంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. 'సైబర్ నేరాలు యూనివర్సల్ ఛాలెంజ్‌గా మారాయి. వీటిని అరికట్టేందుకు ఈ కాన్క్లేవ్ ఒక మంచి వేదిక. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతిష్ఠాత్మక




సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారు. అయితే నేరం ఎక్కడి నుంచి ఎవరు చేశారో కనుక్కోవడం పెద్ద సవాలుగా మారింది. నేరాల శైలి మారుతోంది. వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాలని అన్నారు. దేశంలోనే సైబర్ సేఫ్టీలో మన రాష్ట్రాన్ని నంబర్ వన్ గా నిలపడమే మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మొదటిసారి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌ను సిఎం రేవంత్ అభినందించారు. తెలంగాణను నంబర్ వన్ సైబర్–సేఫ్ స్టేట్‌గా మార్చడానికి కలిసి పనిచేస్తున్న మీ సెక్యూరిటీ సొల్యూషన్స్ కోసం ఎకో సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు... మా ప్రభుత్వం నిపుణులు, ఎఐ సంస్థలతో కలిసి పనిచేయడానికి, అన్ని రకాల వనరులు సమకూరుస్తోంది.మనం తెలంగాణను సెక్యూర్ బిజినెస్ హబ్ గా మార్చాల్సి ఉందన్నారు. 1930 నంబర్ ను అందరికీ షేర్ చేయాలని ప్రతీ ఒక్కరినీ కోరుతున్నా.. ఇది 24/7 సైబర్ హెల్ప్‌లైన్ అని అన్నారు. పూర్తిస్థాయిలో పనిచేసే సైబర్ సెక్యూరిటీ బ్యూరో, పౌరులను రక్షించడానికి అంకితమైన సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని సిఎం అన్నారు. ఈక్రమంలో సమాజంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అన్ని రకాల ప్రచారం చేస్తున్నారు. ఫేక్ న్యూస్ తో పాటు ఆర్థిక నేరాలను కూడా నిరోధించాల్సిన అవసరం ఉంది.సైబర్ క్రైమ్ నియంత్రణలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దుదామని అన్నారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. 'సాంకేతికతతో మరిన్ని అవకాశాలు లభిస్తాయి. అయితే దానితో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డీప్‌ఫేక్, ర్యాన్సమ్‌వేర్, మాల్‌వేర్ వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతికత రెండు వైపులా పదును ఉన్న కత్తిలాంటిది. సైబర్ దాడుల వల్ల ఎన్నో వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఎయిమ్స్‌పై సైబర్ దాడి జరిగింది. అమెరికాలో జరిగిన సైబర్ దాడితో విమాన రాకపోకలు స్తంభించాయి. సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితనానికి కేంద్రం అవార్డులు కూడా ఇచ్చింది. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లు సీజ్ చేస్తాం. రూ.183 కోట్లను 18 వేల మంది బాధితులకు అందించాం' అని వివరించారు. ఈ సమావేశంలో 14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం ఇంత విజయవంతం కావడం చాలా సంతోషంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లను సీజ్ చేశామని.. అందులో రూ.183 కోట్లు 18 వేల మంది బాధితులకు అందించామని పేర్కొన్నారు.




### స్టార్టప్‌లకు తెలంగాణ ప్రోత్సాహం

మొదటిపేజీ తరువాయి..

ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు మన రాష్ట్రంలో అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రి–టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారం పంచుకుంటాయి. మార్కెట్ యాక్సెస్ తో పాటు కెపాసిటీ బిల్డింగ్ ఇంక్యుబేషన్, సాంకేతిక భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాల మెరుగుదల వంటి కీలక అంశాలపై రెండు సంస్థలు కలిసి పని చేస్తాయి. మన దేశంతో పాటు బ్రెజిల్ స్టార్టప్ ఎకో సిస్టమ్‌ల మధ్య సంబంధాలను ఈ ఒప్పందం బలోపేతం చేయనుంది.

# పాపులారిటీ ఉందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతారా?

## సభ్య సమాజం అంగీకరిస్తుందని అనుకుంటున్నారా యూ ట్యూబర్ రణ్‌వీర్ అల్హాదియాకు సుప్రీం మొట్టికాయలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి18(సాక్ష్యం): పాపులారిటీ ఉందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతారా ...సభ్య సమాజం అంగీకరిస్తుందని అనుకుంటున్నారా.. అంటూ యూ ట్యూబర్ రణ్‌వీర్ అల్హాదియాకు సుప్రీం మొట్టికాయలు వేసింది. ఇండియాస్ గాట్ లాటెంట్' కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. పాపులారిటీ ఉంటే ఏదైనా మాట్లాడతారా..? ఇలాంటి భాషను ఎవరైనా ఇష్టపడతారా..? అంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. 'ఇదంతా అసభ్యత కాకపోతే ఇంకేంటి..? మీ మెదడులోని చెత్తనంతా ఆ ప్రోగ్రామ్ ద్వారా బయటపెట్టారు. ఇలాంటి ప్రవర్తన ఖండించదగినదని వ్యాఖ్యానించింది. . మీరు పాపులర్ అని చెప్పి, ఏదైనా మాట్లాడతా అంటే సమాజం ఆమోదించదు. ఇలాంటి భాషను ఎవరైనా ఇష్టపడతారా..? ఇలాంటి వ్యక్తులకు కోర్టు ఎందుకు రక్షణ కల్పించాలని సుప్రీం ప్రశ్నించింది. రణ్‌వీర్‌ను తీవ్రంగా మందలించిన కోర్టు.. ఆ తర్వాత ఊరట కల్పించింది. ఇక ఈ వ్యవహారంలో మరో పోలీసు కేసు నమోదు చేయొద్దని ఆదేశాలు ఇచ్చింది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచివెళ్లే ప్రయత్నాలు చేయొద్దని రణ్‌వీర్‌ను హెచ్చరించింది. అలాగే యూట్యూబర్ తన పాస్‌పోర్టును మహారాష్ట్రలోని ఠాణె పోలీసులకు అప్పగించాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి షోలు



చేయకూడదని తేల్చిచెప్పింది. అసలేం జరిగిందంటే.. ఐజీఎల్‌లో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించడంతో ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. అతడి వ్యాఖ్యలపై పలువురు పార్లమెంటు సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సమయ్ రైనా షోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. దాంతో అతడిపై పలు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వాటిపై ఇటీవల యూట్యూబర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు అన్నింటినీ క్లబ్ చేయాలని ఓ పిటిషన్‌లో పేర్కొన్నాడు. దానిపైనే తాజాగా విచారణ జరిగింది. ఇటీవలే సుప్రీంకోర్టు సీజేఐ బాధ్యతల నుంచి రిటైరైన జస్టిస్ డీవై చంద్రచూడ్ కుమారుడు అభినవ్ చంద్రచూడ్.. రణ్‌వీర్ తరఫున వాదనలు వినిపించారు. నైతిక విలువల ప్రకారం తన క్లయింట్ వ్యాఖ్యలు సమర్థించనని, అయితే అతడిని హత్య చేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయని కోర్టుకు వెల్లడించారు. ఆ సమయంలో మహారాష్ట్ర, అస్సాం పోలీసులను ఆశ్రయించవచ్చని కోర్టు సూచించింది. అలాగే సామాజిక మాధ్యమాల్లో అశ్లీల కంటెంట్‌ను నియంత్రించడానికి ఏవైనా చర్యలు తీసుకొనే యోచనలో ఉన్నారా..? అని ఈసందర్భంగా కేంద్రాన్ని ప్రశ్నించింది. దానిపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది.

### కేంద్ర ఎన్నికల ప్రధానాధికారిగా జ్ఞానేశ్ కుమార్

మొదటిపేజీ తరువాయి..

కమిషనర్‌గా వివేక్‌జోషిని నియమించారు. అంతకుముందు నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి సంబంధించి ప్రధాని మోడీ అధ్యక్షతన సమావేశం జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా నూతన కమిటీ నియామకం చేస్తున్నదని, సుప్రీంకోర్టులో తీర్పు వచ్చే వరకు ఓపిక పట్టాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. అయినప్పటికీ నూతన సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియామకానికే కేంద్రం మొగ్గుచూపింది. 2029 జనవరి 26 వరకూ ఆయన సిఇసిగా కొనసాగనున్నారు. ప్రస్తుత సిఇసి రాజీవ్ కుమార్ పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. జ్ఞానేష్‌కుమార్ కేరళ కేడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఐఎఎస్ అధికారి. అంతకుముందు ఆయన హోం మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలోని సహకార, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖల కార్యదర్శిగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌తోసహా అయోధ్య కేసుపై సుప్రీంకోర్టు తీర్పునకు సంబంధించిన విషయాలను చూసేందుకు హోం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగానికి ఆయన నేతృత్వం వహించారు. 26వ ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా నియమితులైన జ్ఞానేశ్‌కుమార్ కేరళ క్యాడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. గతేడాది మార్చిలో ఎన్నికల కమిషనర్ (ఈసీ)గా నియమితులయ్యారు. 2019లో కేంద్ర ప్రభుత్వం అధికరణం 370 రద్దు కోసం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును రూపొందించడంలో జ్ఞానేశ్ కుమార్ కీలక పాత్ర వహించారు. కేంద్ర హెూంశాఖలో అప్పుడు ఆయన సంయుక్త కార్యదర్శి (కశ్మీర్ డివిజన్). ఆ తర్వాత సహకార శాఖ కార్యదర్శిగా 2024 జనవరిలో పదవీ విరమణ చేశారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో సన్నిహిత సంబంధాలు ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. జ్ఞానేశ్ సీఈసీగా 2029 జనవరి 26వ తేదీ వరకు కొనసాగుతారు. ఆయన పర్యవేక్షణలోనే ఈ ఏడాది చివరిలో బిహార్, వచ్చే ఏడాదిలో తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. హరియాణా క్యాడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి వివేక్ జోషి. ప్రస్తుతం హరియాణా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

### కుంభమేళాకు భారీగా భక్తుల రాక

మొదటిపేజీ తరువాయి..

భారీగా జనం పాల్గొనలేదని పేర్కొంది. దేశ విదేశాల నుంచి భారీగా సామాన్యులు, ప్రముఖులు తరలి వచ్చి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. జనవరి 13న మొదలైన ఈ ఆధ్యాత్మిక సంబరం ఫిబ్రవరి 26వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. భారత్‌లోని 110 కోట్ల మంది సనాతనుల్లో దాదాపు సగం మంది పవిత్ర గంగానదిలో స్నానం ఆచరించారని తెలిపింది. ఫిబ్రవరి 26నాటికి ఈ సంఖ్య 60 కోట్లు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తొలుత కుంభమేళాకు 45 కోట్ల మంది మాత్రమే వస్తారని అంచనా వేయగా.. ఊహించని రీతిలో భక్తులు పోటెత్తుతుండటం గమనార్హం. ఫిబ్రవరి 14 నాటికే 50 కోట్ల మార్కును అధిగమించి.. తాజాగా 55 కోట్ల మార్కును చేరుకుంది. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు రాగా.. మకర సంక్రాంతి రోజున 3.5 కోట్ల మంది, జనవరి 30న రెండు కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు ప్రభుత్వం పేర్కొంది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుంభమేళాలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. సంబంధిత ఫొటోను ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. మహా కుంభమేళా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మత, ఆధ్యాత్మిక వేడుక అన్నారు. సనాతన సంప్రదాయం, వారసత్వానికి ఇదో గొప్ప ప్రతీకగా పేర్కొన్నారు. దేశం ఆరోగ్యంగా, సౌభాగ్యంగా ఉండాలని గంగామాతను ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే గడ్కరీ దంపతులు కూడా పుణ్యస్నానాలు ఆచరించారు.

### 17 మంది నిందితులకు జీవిత ఖైదు

మొదటిపేజీ తరువాయి..

వర్గానికి చెందిన ఒక వ్యక్తి మరణానికి కారణమై బెయిలు మీద బయటకు వచ్చాడు. ఈ కారణంతో బట్ట లింగయ్య అతని కుటుంబ సభ్యులు, తోటి కులస్తులు పగ పెంచుకున్నారు. దసరా పండుగ సందర్భంగా జరిగే ఉత్సవాల్లో బట్ట లింగయ్య కుటుంబంతో సహా పాల్గొనడానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గతంలో తన వల్ల చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఎదురుకాగా వారు ఉద్రేకానికి లోనై, దుర్భాషలాడుతూ విచక్షణ రహితంగా, సామూహికంగా భౌతిక దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలైన బట్ట లింగయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ ఎస్టీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.రమేష్ అప్పుడు ఏసీపీ హెూదాలో ఈ కేసు విచారణను చేపట్టారు. కేసు విచారణ అనంతరం హత్య కేసులో అప్పటి సర్పంచ్ లింగయ్యతో పాటు ఓ మహిళ సహా 18 మంది నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. అనంతరం 18 మంది నిందితులను కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో వాయిదాలు నడుస్తున్న సమయంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలు వినిపించారు. సాక్ష్యాదారాల పరిశీలన అనంతరం నల్గొండలోని ఎస్సీ,ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు ఈ కేసులో 17 మంది నిందితులు ఒక్కొక్కరికి జీవిత ఖైదు శిక్ష, రూ.6000/– జరిమానా విధించింది.

## జ్ఞానేశ్ కుమార్ నియామకం సరికాదు

### సుప్రం విచారణకు ముందే హడావిడి నియామకం తప్పుపట్టిన కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి18(సాక్ష్యం): కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. అయితే జ్ఞానేష్ కుమార్ నియామకాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ఆ పార్టీ సీనియర్ నేత కేసీ.వేణుగోపాల్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు పరిశీలనను తప్పించుకోవడానికి.. తొందరపాటు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఇటువంటి చర్యతో ఎన్నికల పక్రియపై సందేహాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ తెలిపింది. ఈ మేరకు కేసీ.వేణుగోపాల్ ఎక్స్ లో పోస్టు పెట్టారు. ‘సీఈసీ నియామకం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. సీఈసీ నియామక ప్యానెల్ నుంచి సీజేఐని తొలగించడంపై ఫిబ్రవరి 19న సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ఈలోపే కొత్త సీఈసీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. సుప్రీంకోర్టు పరిశీలన లేకుండా సీఈసీని నియమించాలనే తొందరపాటు కేంద్ర ప్రభుత్వ చర్యలో భాగంగా కనిపిస్తోందని కాంగ్రెస్ తెలిపింది.

‘ఈ తొందరపాటు చర్యతో ఎన్నికల పక్రియను బీజేపీ ఎంత నాశనం చేస్తోందో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి చర్యల వల్ల నకిలీ ఓటర్ల జాబితా, బీజేపీ అనుకూల ఎన్నికల షెడ్యూల్, ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అనుమానాలు బలపడతాయని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. కొత్త సీఈసీగా జ్ఞానేష్‌కుమార్ సోమవారం నియమితులయ్యారు.

## మహాయుతి కూటమిలో పెరుగుతున్న అగాథం

### షిండే వర్గ ఎమ్మెల్యే భద్రత కుదించిన సిఎం

ముంబై,ఫిబ్రవరి18(సాక్ష్యం): మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమిలో చీలికలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హోంశాఖ మంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు చెందిన 20 మంది ఎమ్మెల్యేలకు ఉన్న వై కేటగిరి సెక్యూరిటీని ఉపసంహరించుకున్నట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తెలిపారు. బీజేపీ, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీకి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలకు భద్రతాను కూడా తగ్గించబడినప్పటికీ, శివసేన నుంచి వచ్చిన వారి కంటే ఈ సంఖ్య చాలా తక్కువ ఉంది.

అయితే, రాష్ట్ర వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి సీఎం ఫడ్నవీస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. మంత్రులు కాకపోయినా, ఈ ఎమ్మెల్యేలకు అదనపు ప్రయోజనంగా వై-భద్రతా మంజూరు చేయబడంతోనే ఈ తొలగింపులు జరిపినట్లు సమచారాం. 2022లో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన నుంచి విడిపోవడంతో మహా వికాస్ అఘాడి ప్రభుత్వం పతనానికి దారితీసింది. దీంతో పార్టీ మారిన ఈ ఎమ్మెల్యేలకు పటిష్ట భద్రతను మహారాష్ట్ర సర్కార్ కేటాయించింది. ఇక, ఈ నిర్ణయంతో ఏక్‌నాథ్ షిండే, బీజేపీ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉంది. తాజా చర్యతో సీఎం ఫడ్నవీస్ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి చేసిన వ్యూహాత్మక ఎత్తుగడగా కమలం పార్టీ నేతలు భావిస్తున్నారు. అయితే, దావోస్ పర్యటనకు ముందు ముఖ్యమంత్రి ఎన్‌సీపీకి చెందిన తత్కరే (శ్రీవర్ధన్)ను రాయ్‌గఢ్ సంరక్షక మంత్రిగా నియమించారు. దీంతో రాయ్‌గఢ్, నాసిక్‌లకు సంరక్షక మంత్రి పదవుల కోసం బీజేపీ, షిండే పార్టీల మధ్య ప్రారంభమైన ప్రతిష్టంభన ? ఇప్పటికీ పరిష్కారం కాలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత కూటమిలో స్పష్టంగా విభేదాలు కనిపిస్తుండటపై శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది తీవ్ర విమర్శలు గుప్పించింది. సీఎం పదవి రాకపోవడంతో షిండే అసంతృప్తిగా ఉన్నారని చెప్పుకొచ్చింది. దీంతో పాటు ఫడ్నవీస్‌తో వేదిక పంచుకోవడానికి ఏక్‌నాథ్ షిండే దూరంగా ఉంటున్నట్లు ప్రియాంక చతుర్వేది పేర్కొన్నారు.

## సంక్లిష్టంగానే పోప్ ఆరోగ్యం

రోమ్,ఫిబ్రవరి18(సాక్ష్యం): పోప్ ఫ్రాన్సిస్ (88) ఆరోగ్యం ఇంకా సంక్లిష్టంగానే ఉన్నట్లుగా వాటికన్ సిటీ తెలిపింది. గత శుక్రవారం శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో రోమ్‌లోని జెమెల్లి ఆస్పత్రిలో చేరారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూనే ఉన్నారు. మరి కొన్ని రోజులు ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం ఉందని వాటికన్ పేర్కొంది. ఇటీవల నిర్వహించిన వైద్య పరీక్షలో శ్వాసకోశంలో పాలీమైక్రోబయల్ ఇన్ఫెక్షన్ సోకినట్లు తెలిపింది. దీన్ని నుంచి ఇంకా కోలుకోలేదని తెలిపింది. తాజాగా నిర్వహిచిన టెస్టులను బట్టి మరిన్ని రోజులు ఆస్పత్రి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాటికన్ తెలిపింది. జ్వరం నుంచి అయితే ఫ్రాన్సిస్ కోలుకున్నారని తెలిపింది. ఇక ఫ్రాన్సిప్ ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు గాజాలోని ఏకైక కాథలిక్ పారిష్ వాకబు చేస్తూనే ఉన్నారు. ఇక సోమవారం పోప్ ఫ్రాన్సిస్ కొంత సేపు పని చేశారని, పత్రాలు కూడా చదివారని వాటికన్ తెలిపింది. ఫ్రాన్సిస్.. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.

## ఎసిబికి చిక్కిన పోలీసులు

నారాయణపేట,ఫిబ్రవరి18(సాక్ష్యం): నారాయణపేట జిల్లా మక్తల్‌లో సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఓ కేసులో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు.. మక్తల్ సీఐ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు శివారెడ్డి, నరసింహాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భద్రాద్రి జిల్లాలో మరో ఘటనలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్లు ఏసీబీకి చిక్కారు. అటవీ భూమి నుంచి మట్టి తవ్వుకునేందుకు రైతు వద్ద రూ.30 వేలు లంచంగా సిబ్బంది అడిగారు. దీనిపై సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు ఇల్లెందు మండల కొమరారం ఫారెస్టు రేంజ్ ఆఫీసులో దాడులు నిర్వహించారు.

## పచ్చకామెర్లవాడికి ఊరంతా పచ్చగే...

### సీఎం వ్యాఖ్యలపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): పచ్చకామెర్లవాడికి ఊరంతా పచ్చగా కనపడుతుందన్న సామెతలా సీఎం రేవంత్‌రెడ్డికి తను మూటాలు తీసుకుంటున్న మాదిరిగా ఐఏఎస్‌లు తీసుకుంటున్నారని అనుకుంటున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అవమానపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పచ్చకామెర్ల వానికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. మీరు బ్యాగులతో దొరికారని అందరూ మీ లాగానే బ్లాక్‌మెయిల్ దందాలు చేస్తారని సెటిల్‌మెంట్లు, దందాలు చేస్తూ బతుకుతున్నారని అనుకోవడం తప్పు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మన దేశ ప్రజాస్వామ్యానికి వెన్నెముకలు అని కేటీఆర్ పేర్కొన్నారు. సివిల్ సర్వెంట్స్ అంటే.. కార్యాచరణ రూపొందించడంలో నిష్ణాతులు.. కానీ ఏసీలో ఉండి యాక్షన్ చేసే వారు కాదు. సీఎం రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అవమానించేలా మాట్లాడారు. ఆ మాటలు అమర్యాదగా ఉన్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అధికార వ్యవస్థ ప్రతిష్టను నాశనం చేసేందుకు సీఎం రేవంత్ నిరంతరం చేస్తున్న ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ తెలిపారు.



## కార్లతో స్టంట్లు చేసిన ఇద్దరు యువకుల అరెస్టు

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): నగరంలోని ఓఆర్‌ఆర్‌పై ఇద్దరు వ్యక్తులు రెండు కార్లతో స్టంట్ చేసిన విషయం తెలిసిందే. లగ్జరీ ఎస్‌యూవీ కారుల్లో ఇద్దరు రింగు రోడ్డుపై స్టంట్ చేశారు. ఫార్చ్యూనర్, బీఎండబ్ల్యూ కార్లతో వాళ్లు చక్కర్లు కొట్టారు. ఆ స్టంట్ అక్కడ ఉన్న సీసీటీవీ కెమెరాలకు చిక్కింది. ఫిబ్రవరి 9వ తేదీన ఈ ఘటన జరిగింది. అయిదు లేన్ల రోడ్డుపై వాళ్లు ఆ స్టంట్ పర్ఫార్మ్ చేశారు. లగ్జరీ కార్లతో స్టంట్ చేసిన విద్యార్థుల్ని పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు పోలీసులు వాళ్లను అరెస్టు చేశారు. రాజేంద్రనగర్‌కు చెందిన 25 ఏళ్ల మొహమ్మద్ అబ్దుల్లా, మలక్‌పేటకు చెందిన 25 ఏళ్ల జోహెయిర్ సిద్ధిక్‌లను అధీనంలోకి తీసుకున్నారు. లగ్జరీ కార్లను కూడా సీజ్ చేశారు.

# భారత్‌లోకి టెస్లా ఆగమన సంకేతాలు

మొదటిపేజీ తరువాయి..

బై నగరాల్లో నియామకాలు చేపడుతోంది. మగిలిన పోస్టులకు నియామకాలు ముంబైలో చేపడుతోంది. ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా అధినేత



మోదీతో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టెస్లా భారత్‌లో నియామకాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. టెస్లా సంస్థ కొన్నేళ్లుగా భారత విపణిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. 40 వేల డాలర్లకు పైబడిన ఖరీదైన కార్లపై భారత్ ఇప్పటివరకూ 110 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీని విధించింది. ఇటీవల దీన్ని 70 శాతానికి తగ్గించింది. భారత ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ చైనాతో పోలిస్తే చిన్నదే అయినా టెస్లాకు ప్రస్తుత పరిస్థితుల్లో కీలకంగా మారింది. భారత్‌లో గతేడాది లక్ష యూనిట్ల విద్యుత్ కార్లు విక్రయం కాగా చైనాలో ఈ సంఖ్య ఏకంగా 11 మిలియన్లు. అయితే, దశాబ్దం తరువాత తొలిసారిగా టెస్లా కార్ల అమ్మకాలు తగ్గాయి. దీనికి చెక్ పెట్టేందుకు భారత మార్కెట్‌లో ఎంట్రీకి టెస్లా ప్రయత్నిస్తోందని సమాచారం. ఇటీవల డోనాల్ట్ ట్రంప్‌తో సమావేశం అనంతరం ప్రధాని మోదీ అమెరికాతో వాణిజ్యలోటుపై దృష్టి పెట్టేందుకు అంగీకరించారు. రక్షణ రంగ కొనుగోళ్ల పెంపు, ఎఫ్-35 యుద్ధ విమానాల డీల్ వంటివి తెరపైకి వచ్చాయి. ఇక ట్రంప్ కేబినెట్‌లో కీలకంగా మారిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. అయితే, మస్క్ వ్యక్తిగత హోదాలో మోదీని కలిశారా లేక అమెరికా ప్రభుత్వం తరుపున సమావేశమయ్యారా అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు, ట్రంప్ ప్రభుత్వంలో మస్క్‌కు ప్రాధాన్యం పెరగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ, ప్రభుత్వ అవసరాల మధ్య సరిహద్దు రేఖ చెరిగిపోతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవలే ఇటలీ ప్రభుత్వ కమ్యూనికేషన్ కోసం స్పేస్‌ఎక్స్ సేవలు వినియోగించుకునేందుకు చర్చలు జరుగుతున్నట్టు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. డొనాల్డ్ ట్రంప్‌తో ఇటలీ ప్రధాని సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడటం గమనార్హం.

### త్వరలోనే రష్యా అధినేత పుతిన్‌తో

# భేటీ అవుతా

మొదటిపేజీ తరువాయి..

జెలెన్‌స్కీ భాగస్వామి అవుతారని ట్రంప్ వివరణ ఇచ్చారు. అంతేకాదు.. చాలా తొందరలో రష్యా అధినేతతో తాను భేటీ ఫోన్లో మాట్లాడారు. ఉక్రెయిన్‌కు అమెరికా సాయం నిలిచిపోవడం వల్ల తలెత్తే పరిణామాలపై ఇప్పుడు ఈయూ



కానున్నట్లు చెప్పారు. ఆయన ఎ÷-లోరెడాలోని డెటోనా రేసులో పాల్గొన్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. ‘కచ్చితమైన సమయం అనుకోలేదు.. కానీ, తొందర్లోనే జరుగుతుంది‘ అని విలేకర్లతో పేర్కొన్నారు.

మరోవైపు అమెరికా-రష్యా చర్చలకు దూరంగా ఉన్న బ్రిటన్ భిన్నమైన ప్రకటన చేసింది. ఆ దేశ ప్రధాని స్టార్మర్ మాట్లాడుతూ అవసరమైతే ఉక్రెయిన్‌లో తమ సేనలు బరిలోకి దిగుతాయని అన్నారు. ఐరోపా దేశాల అత్యవసర సమావేశానికి ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ‘ఇది ఉక్రెయిన్ భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న మాత్రమే కాదు. ఐరోపా ఉనికికి కీలకమైంది. సుదీర్ఘకాలం కాలం పాటు ఉక్రెయిన్‌లో శాంతి, సురక్షితను కాపాడటం చాలా ముఖ్యం‘ అని పేర్కొన్నారు. మూడేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే శాంతిచర్చల దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగడం ఆసక్తి రేపుతోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇప్పటికే ఆయన దేశాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. యుద్ధ విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత తమ భద్రతకు ముప్పు తలెత్తవచ్చన్న ఆందోళన ఐరోపా దేశాల్లో ఉంది. రష్యా కన్ను తమపై పడే అవకాశం ఉందని అవి భావిస్తున్నాయి. చర్చలపై ట్రంప్ దృష్టిసారించగా ఇయు దేశాలు సోమవారం పారిస్‌లో అత్యవసరంగా సమావేశం కాబోతున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పశ్చిమాసియా పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం యుఎఇకి చేరుకొన్నారు. భారీ మానవీయ సహాయ కార్యక్రమం నిమిత్తం తాను ఇక్కడికి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. రష్యాతో చర్చల కోసం సౌదీ అరేబియాకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్ విట్‌కోఫ్, జాతీయ భద్రతా సలహాదారు మైక్‌వాల్‌ట్జ్ కూడా రియాద్‌కు ప్రయాణమయ్యారు. ఈసందర్భంగా రియాద్‌లోని కొందరు అధికారులు మాట్లాడుతూ ఈ చర్చలకు వేదిక కావడంతోపాటు.. మధ్యవర్తిత్వంలోను తమ దేశం కీలకపాత్ర పోషించనుందన్నారు.

# కుంచించుకు పోయిన బతుకమ్మ కుంట



మొదటిపేజీ తరువాయి..

అక్కడ 5.15 ఎకరాలు మాత్రమే మిగిలింది. దీన్ని హైడ్రా పనరుద్ధరిం చేందుకు చర్యలు చేపట్టింది. ఇక్కడ ఉంటున్న వారికి సమస్య లేకుండా చెరువును పునరుద్ధరించనున్నారు అధికారులు. బ్యూటిఫికేషన్?చేపట్టనున్నారు. ఒకప్పటి ఎర్రకుంటనే కాలక్రమంలో బతుకమ్మ కుంటగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. కాలక్రమంలో బతుకమ్మకుంటలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు లేకుండా పోయిందంటున్నారు. అంబర్?పేట పరిధిలోని బతుకమ్మ కుంట స్థలం తమదేనంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 జనవరి 8న హైకోర్టు కొట్టేసింది. హైడ్రాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో హైడ్రా పునరుద్ధరణ చర్యలు చేపట్టింది.

### కేసీఆర్ హయాంలో రైతు దర్జాగా

# బతికాడు

మొదటిపేజీ తరువాయి..

టకీటకీమని పైసలు పడలేదు. గత 6 నెలల నుంచి అన్ని జిల్లాల్లో తిరుగుతున్నాం. గత పదేండ్లలో మోటార్లు కాలలేదు.. ట్రాన్స్‌ఫార్మర్లు పేలలేదు. అప్పుడు అప్పు అడిగే పరిస్థితి లేదు. నాట్లు వేసే నాటికి రైతుబంధు పడుతుండే. రేవంత్ రెడ్డి కొత్త పదం పట్టుకుని టకీ టకీమని పడుతాయ్ అన్నాడు. టకీ లేదు టుక్ లేదు అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతుబంధు కేసీఆర్ బిచ్చమేసినట్లు రూ. 10 వేలు ఇస్తుండు.. నేను రూ. 15 వేలు వేస్తా అన్నాడు. కనీసం 10 శాతం మందికి కూడా రైతుబంధు ఇవ్వలేదు. ఒకేసారి రుణమాఫీ చేస్తా అని అన్నాడు. చారణా కూడా రుణమాఫీ చేయలేదు. 10 శాతం మందికి కూడా బోనస్ పడలేదు అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పాలనతో ఏ వర్గమూ సంతోషంగా లేదని కేటీఆర్‌అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని ఆ పార్టీ నేతలు మళ్లీ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మళ్లీ మోసపోతే ఎవరూ కాపాడలేరన్నారు. ‘కేసీఆర్ హయాంలో రైతు రాజులా బతికాడు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక సోనియాగాంధీ పుట్టినరోజు రెండుసార్లు వచ్చింది.. కానీ రుణమాఫీ 25 శాతం కూడా కాలేదు. 35 సార్లు దిల్లీ విమానం ఎక్కారు.. 35 పైసలూ తీసుకురాలేదు. అప్పులు కట్టలేదని రైతుల తలుపులు ఎత్తుకెళ్లారు.. రేపో మాపో పుస్తెలతాడు కూడా లాక్కెళ్లిపోతారు. ఓట్ల కోసం



ఇంటికి వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయాలి. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అని డ్రామాలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ గురించి తెలియదు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు సొంత ఊరు, అత్తగారి ఊరు కల్వకుర్తిలో ఏమైనా చేశారా? అని అడగడానికి ఇక్కడకు వచ్చాం. కులగణన పేరుతో బీసీలను రేవంత్‌రెడ్డి మోసం చేశారు‘ అని కేటీఆర్ ఆరోపించారు. మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అవమానపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పచ్చకామెర్ల వానికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. మీరు బ్యాగులతో దొరికారని అందరూ మీ లాగానే బ్లాక్‌మెయిల్ దందాలు చేస్తారని సెటిల్‌మెంట్లు, దందాలు చేస్తూ బతుకుతున్నారని అనుకోవడం తప్పు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మన దేశ ప్రజాస్వామ్యానికి వెన్నెముకలు అని కేటీఆర్ పేర్కొన్నారు. సివిల్ సర్వెంట్స్ అంటే.. కార్యాచరణ రూపొందించడంలో నిష్ణాతులు.. కానీ ఏసీలో ఉండి యాక్షన్ చేసే వారు కాదు. సీఎం రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అవమానించేలా మాట్లాడారు. ఆ మాటలు అమర్యాదగా ఉన్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అధికార వ్యవస్థ ప్రతిష్టను నాశనం చేసేందుకు సీఎం రేవంత్ నిరంతరం చేస్తున్న ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

### ఢిల్లీ సిఎం ఎంపికపై నేడు

# బీజేపీ భేటీ

మొదటిపేజీ తరువాయి..



ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 20న గురువారం సాయంత్రం 4.30 గంటలకు కొత్త సీఎం ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఖరారైనట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. ప్రఖ్యాత రామ్‌లీలా మైదాన్‌లో జరిగే ఈ వేడుకకు కమలదళం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రమాణస్వీకారానికి ముందు ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇక, 50 మంది సినీతారలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు ఇతర దేశాల దౌత్యవేత్తలు, 20 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు, కేంద్రమంత్రులు, భాజపా అగ్రనేతలు ఈ కార్యక్రమానికి హాజరవుఉతన్నట్లు సమాచారం. వీరితోపాటు దిల్లీకి చెందిన పలువురు రైతులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను కూడా ఆహ్వానించినట్లు సమాచారం. బాబా రాందేవ్, స్వామి చిదానంద, బాబా బాగేశ్వర్ ధీరేంద్రశాస్త్రి వంటి ఆధ్యాత్మిక గురువులు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నట్లు భాజపా వర్గాలు పేర్కొన్నాయి. ఈనెల 8న వెలువడిన శాసనసభ ఎన్నికల ఫలితాల్లో భాజపా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి 10 రోజులు అవుతున్నా నూతన ముఖ్యమంత్రి ఎవరనేది ఇంకా తేల్చలేదు. మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్‌వర్మ పేరు సీఎం రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. ఈయన తాజా ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజీవ్రాల్‌పై విజయం సాధించారు. బుధవారం భాజపా శాసనసభాపక్ష భేటీ జరగనుంది. అందులో కొత్త సీఎంతో పాటు కేబినెట్ మంత్రులను ఎన్నుకోనున్నారు. దీంతో లాంఛనం పూర్తి కానుంది. ఆ తరవాత సిఎం గురువారం ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది.

# సోలార్ పెన్సింగ్ స్కీం

### తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త
### పంటల రక్షణకు మరో పథకం
### పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ స్కీం పెట్టే యోచన
### డ్రిప్, తుంపర సేద్య పరికరాల అందించేందుకు సిద్ధం
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో శుభవార్త చెప్పనుంది. పంటల రక్షణ కోసం కొత్త స్కీం తీసుకురానుంది. దీంతో పాటు.. రైతుల అవసరాలకు సంబంధించిన పరికరాలను అందించే యోచనలో సర్కార్ ఉన్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. అడవి జంతువులు, కోతుల నుండి పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ స్కీంను ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అంతేకాకుండా.. పామాయిల్‌తో పాటు ఇతర పంటలకు డ్రిప్, తుంపర సేద్య పరికరాలను అవసరం మేరకు రైతులకు అందించాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో పాటు.. రాష్ట్ర అవసరాలు తీర్చే విధంగా కూరగాయల సాగు పెంపునకు పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. జూన్ మొదటి వారంలోపు రాష్ట్రంలో మరో ఆయిల్ పామ్ కర్మాగారం అందుబాటులోకి రానుందని.. మరో రెండు ఫ్యాక్టరీల నిర్మాణ పనులు ఆరంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. అలాగే.. మెకడమియా పంట సాగుకు అవసరమైన పరిస్థితులను.. అనువైన ప్రాంతాలను అధ్యయనం చేయాల్సిందిగా ఉద్యానశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రగతి చూపని ఆయిల్ పామ్ కంపెనీలపై చర్యలు ఆరంభించాలని.. ఇప్పటికే విశ్వతేజ ఆయిల్ పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసినట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. రైతులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం తాజాగా రైతు భరోసా నిధులను విడుదల చేసిన సంగతి తెలిసిందే.. మొత్తం మూడు ఎకరాల వరకు సాగులో ఉన్న భూములకు రైతు భరోసా నిధులు జమ చేశారు. మొదటగా ఒక ఎకరం ఉన్నవారికి, మరోసారి రెండు ఎకరాలు ఉన్నవారికి, ఈనెల 12న మూడు ఎకరాల ఉన్న రైతుల అకౌంట్లో రైతు భరోసా నిధులను జమ చేసింది.

# మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుదాం

మహబూబ్‌నగర్,ఫిబ్రవరి18(సాక్ష్యం): మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని, ఇది ఒక్కరితో సాధ్యం కాదని, ప్రతి ఒక్కరు తమ వంతు సహాయం చేయాలని ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డికోరారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ విద్యానిధిని ఏర్పాటు చేశామని, సామాజిక స్పృహ కలిగిన వారు సహకరించాలన్నారు. పట్టణంలోని బీఈడీ కాలేజీలో నూతనంగా నిర్మించిన శౌచాలయాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలేజీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. మన కళాశాలను, పాఠశాలలను బాగు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ పేద విద్యార్థులు చదువుకుంటారని వారికి వీలైనంతవరకు సౌకర్యాలు కల్పించాలని అది మనందరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కళాశాల అతి పురాతనమైనదని అందుకే త్వరలో కళాశాలలకు పూర్తిస్థాయిలో నూతన భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు అందించమని కళాశాల సిబ్బందికి సూచించారు. మహబూబ్ నగర్ ను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఒక్క వ్యక్తితో అది సాధ్యం కాదు కాబట్టి , ప్రతి ఒక్కరు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన ఆదేశించారు. అందుకే మహబూబ్ నగర్ విద్యానిధి ఏర్పాటు చేశామని బాధ్యత కలిగిన పౌరులు సామాజిక స్పృహ కలిగిన ప్రతి ఒక్కరూ కూడా ఈ యొక్క విద్యానిధికి సహకరించాలని చేయూత అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహబూబ్ నగర్ విద్యా నిధి పారదర్శకంగా అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి నెల తన జీతం నుంచి లక్ష రూపాయలు విద్యానిధిలో జమ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం గోవిందరాజులు, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, రాజు గౌడ్, మోయిజ్, ప్రవీణ్ కుమార్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండలో టిడిపి సభ్యత కార్యక్రమం



**దేవరకొండ; ఫిబ్రవరి 18 (సాక్ష్యం)** ఈరోజు తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ నందు తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదు లో దేవరకొండ నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత నమోదు చేయించిన తెలుగుదేశం పార్టీ మాజీ .దేవరకొండ నియోజక వర్గం ఇంచార్జ్ వస్కుల కృష్ణయ్య . తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మాజీ రాష్ట్ర అధ్యక్షుడు భక్కని నర్సింహులు ఆయనని కలిసి సన్మానం చేసినారు ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలపరాస్తుందని తెలంగాణలో పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయం అన్నారు.

ఆయన వెంట, చింతపల్లి మండల సీని యర్ నాయకుడు పోట బత్తుల విజయ్ కుమార్ (డాక్టర్),చింతపల్లి మండల మాజీ అధ్యక్షుడు దోటీ సంతోష్ , పీ. ఏ.పల్లి మండల మాజీ అధ్యక్షుడు సీత సీతారాములు యాదవ్ , నేరే డుగొమ్ము మండల సీనియర్ నాయకుడు బోడ దనయ్యా యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అధికారులు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,ఫిబ్రవరి 18,( సాక్ష్యం న్యూస్);** లంచం కోసం కక్కుర్తిపడిన ఇద్దరు అధికారులు మంగళవారం ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డారు. వివరాల్లోకెళ్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం కొమరారం అటవీశాఖ రేంజ్ అధికారి ఉదయ్ కిరణ్, బీట్ ఆఫీసర్ హిరాలాల్ రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి నిమిత్తం అటవీ భూమి నుంచి మట్టిని తోలుకునేందుకు గుత్తేదారు నుంచి రు.30 వేలు డిమాండ్ చేశారు. ఇంతకుముందే రూ.20వేలు లంచంగా ఇచ్చినట్లు సమాచారం. మరల గ్రావెల్ తీస్తుండగా అటు విశాఖ సిబ్బందిని పంపించి జేసీబీని, ట్రాక్టర్ను పట్టుకున్నారు. జేసీబీ, ట్రాక్టర్ ను విడిచి పెట్టేందుకు రూ.15000 లంచం తీసుకున్నట్లుగా సమాచారం. అయినప్పటికీ మళ్లీ గ్రావెల్ తోలుకునేందుకు రూ.50 వేలు డిమాండ్ చేయగా రూ.30,000 ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో గుత్తేదారు ఏసీబీని ఆశ్రయించడంతో ఏసీబీ దాడులు నిర్వహించి అధికారులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారని తెలిపారు.


## జనగామ జైలు సందర్శించిన తెలంగాణ జైళ్ళ శాఖ డిజి సౌమ్య మిశ్రా



**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో (సాక్ష్యం న్యూస్ ):** జనగామ సబ్ జైలుని డైరెక్టర్ జనరల్ ఆఫ్ తెలంగాణ ప్రిజన్స్ అండ్ కరక్షనల్ సర్వీసెస్ డా: సౌమ్య మిశ్రా ఐపీఎస్ మంగళవారం సందర్శించారు. జైలు పర్యటన లో భాగంగా ఖైదీల యోగక్షేమాలు,న్యాయ పరమైన సమస్యలని అడిగి తెలుసుకున్నారు.ఖైదీ లకి సరైనా వసతులు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. జైలు యొక్క సెక్యూరిటీని పరిశీలించారు. ఎల్లవేళల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ సందర్శనలో వరం గల్ రేంజ్ ప్రిజెన్స్ డిఐజి సంపత్ జనగామ జిల్లా డీసిపి, రాజమహేంద్ర నాయక్ ,జైలర్ రామకృష్ణ , జనగామ సిఐ దామోదర్ రెడ్డి, సబ్ జైలు సూపరింటెండెంట్ పి. కృష్ణకాంత్ పాల్గొన్నారు.

## ఏపూరి సోమన్నను కలిసినా బీసీ రాష్ట్ర నాయకులు బండారి గంగాధర్ !!



**సాక్ష్యం న్యూస్,శివంపేట.** ప్రజా బహుజన యుద్ధ నౌక ప్రజా గాయకుడు ఏపూరి సోమన్నను కలిసినమెదక్ జిల్లా బహుజన సన్నాహక సమావేశం గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శివంపేట మండల్ బీసీ రాష్ట్ర నాయకులు ప్రముఖ సంఘ సేవకులు సేవా రత్న అవార్డు గ్రహీత బండారి గంగాధర్ మరియు మలల హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మల మైసయ్య బిజిఆర్ అధ్యక్షుడు కుమ్మరి నాగరాజు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొల్లపల్లి పెద్ద నరసన్న గుర్రాల భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన మానిటరింగ్ బృందం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,ఫిబ్రవరి 18 ,(సాక్ష్యం న్యూస్):** సింగరేణి పాఠశాలను మానిటరింగ్ బృందం సందర్శించారు. మంగళవారం సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల, పివి కాలనీ 10వ తరగతి విద్యార్థులు ఫార్మాటివ్ బుక్స్ వెరిఫికేషన్ చేయడానికి మణుగూరు మండల మానిటరింగ్ బృందం నాగలక్ష్మి ఆధ్వర్యంలో సింగరేణి పాఠశాలను సందర్శించి విద్యార్థుల పుస్తకాలను పరిశీలించి పాఠశాల ఉపాధ్యాయుల ప్రతిభను కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల చేతి రాత చాలా చక్కగా ఉందని ఆమె అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ ఎస్. రమేశ్ మానిటరింగ్ బృందానికి ధన్యావదములు తెలియజేసి, ఇదే స్ఫూర్తితో ఉపాధ్యాయులు శ్రద్ధాసక్తులతో పని చేస్తూ ఈ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు 1000 శాతం ఉత్తీర్ణత సాధించేలా శ్రమించాలని సూచించారు.అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ఈ.జి.ఎస్. స్వరూప రాణి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులతో సమీక్షా నిర్వహించి, విద్యార్థుల ప్రతిభను స్వయంగా తెలుసుకొని రాబోయే పబ్లిక్ పరీక్షలకు ఇంకా బాగా సన్నద్ధం కావాలని ఈ 20 రోజులు చాలా కీలకమని, చదువు పట్ల పూర్తి ఏకాగ్రత చూపాలని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని, మంచి ఆహారం తీసుకోవాలని, విద్యార్థులకు సలహాలు సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఆర్. కల్యాణి, వేణు, తరగతి ఉపాధ్యాయులు లలిత, రాజ సింహ్, తదితరులు ,పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా కేంద్రంలో ముఖ్యనాయకులు సమావేశం



**మెదక్ జిల్లా ప్రతినిధి 18 ఫిబ్రవరి సాక్ష్యం:** మెదక్ జిల్లా కేంద్రంలో ముఖ్యనాయకులు సమావేశం నిర్వహించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ .ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యావంతుడైన నరేందర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లా, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిందన్నారు. విద్యావంతులైన పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఒక బూత్ 25 మంది పట్టభద్రులకు ఒక ఇన్చార్జిని నియమించడం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 52, వేల మందికి ఉద్యోగాలు కల్పించడం కాకుండా మరో 72, వేల మందికి ప్రమోషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో నరేందర్ రెడ్డిని గెలుపించుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులపైనే ఉందని గుర్తు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు విషయంలో పట్టభద్రులు ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర నాయకులు సుప్రభాత రావు,అపీష్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, మండల అధ్యక్షులు పవారి శేఖర్, లింగం, వెంకటరమణ, సురేందర్ గౌడ్, క్రిష్ణ గౌడ్, ఆంజనేయులు గౌడ్, మల్లేష్ గౌడ్, మధు సుధాన్ రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భరత్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొనారు.

## వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలి



### నిజిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారుల ఆదేశించారు

**మెదక్ జిల్లా ప్రతినిధి 18 ఫిబ్రవరి సాక్ష్యం:** వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ రూపొందించాలనిజిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారుల ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు వివిధ శాఖల అధికారులతో సాగునీరు, త్రాగునీరు, విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా, రైతు భరోసా, రబీ సీజన్ కు సాగునీటి సరఫరా, సంబంధిత విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగునీటికి, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.రైతు భరోసా పథకం క్రింద అర్హులైన అందరికీ పథకం అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు సూచిం చారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం హైదరాబాద్ నుండి ఇతర ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగునీరు, త్రాగునీరు, విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా, రైతు భరోసా, రబీ సీజన్ కు సాగునీటి సరఫరా, యూరియా కొరత, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మెదక్ కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, డిపిఓ యాదయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,ఫిబ్రవరి 18 ,(సాక్ష్యం న్యూస్ );** అశ్వాపురం మండలం ఆదివాసి గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులన్నారు .మంగళవారం వారి ఆధ్వర్యంలో అశ్వాపురం తహశీల్దార్ బి స్వర్ణ , ఎండిఓ కార్యాలయ సూపర్డెంట్ టీవీ ఆర్కే పిచ్చేశ్వరరావు లకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ అశ్వాపురం మండల పరిధిలోని వలస ఆదివాసి గ్రామాలు కుమ్మరి గుంపు, కొత్త గుంపు, రాంనగర్, రాయన్నపేట, మనుబోతుల గూడెం, మావిళ్ళవాయి, మొండికుంట సమీప గ్రామాలలో నివసిస్తున్న అనేకమంది ఆదివాసీలు , గిరిజనులకు ఆరోగ్యశ్రీ కార్డులు లేని కారణంగా ఏదైనా ప్రమాదం లేదా అనారోగ్యం పాలైన గిరిజనులుమెరుగైన వైద్యం చేయించుకోవాలంటే ఇబ్బంది పడుతున్న పరిస్థితి పడుతుందన్నారు. మండల పరిధిలోని గ్రామాల గిరిజనులకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయాలని కోరారు . వేసవిలో త్రాగునీటి సమస్యను కూడా ఎదురుకుంటున్నారని,మిషన్ భగీరథ పక్కనే ఉండి కూడా కుమ్మరి గుంపు, రాంనగర్ ఆదివాసి ప్రజలకు తాగునీటి అందుబాటులో లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదివాసి గిరిజన గ్రామాలకు త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని మౌలిక సదుపాయాలైన రోడ్లు,విద్యుత్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యస్ డి నా సర్ పాషా, పెద్దగోని ఆదిలక్ష్మి, సిపిఐ పావురాల లాలయ్య, కుంజా నందు, తదితరులు, పాల్గొన్నారు.

## శ్రీ మల్లన్న ఉత్సవాల్లో పాల్గొన్న పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ ఆవుల రాజిరెడ్డి



**మెదక్ జిల్లా ప్రతినిధి 18 ఫిబ్రవరి సాక్ష్యం:** నర్సాపూర్ నియోజకవర్గం శివ్వంపేట మండలం చెన్నాపూర్, కోల్చారం మండలం కిష్టాపూర్ గ్రామాల్లో గత రెండు రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీ మల్లన్న ఉత్సవాల్లో పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి. పాల్గొన్నారు.అనంతరం కొల్చారం మండలం చిన్న ఘనపూర్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి బోనాల ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ శ్రీ మల్లన్న మహాశక్తి ప్రజలందరికీ అండగా ఉండాలని, నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, సమృద్ధిగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

**ములుగు ప్రతినిధి ఫిబ్రవరి 18(సాక్ష్యం)** ములుగు జిల్లా ఏటూరు నాగారం పోలీస్ స్టేషన్ పరిధిలోగల జంపన్న వాగు, ఇసుక లోడింగ్ ప్రాంతాల నుండి ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకొని యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఏటూరు నాగారం ఎస్సై తాజుద్దీన్ వెల్లడించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు స్థానిక ఎస్సై తన సిబ్బందితో జంపన్న వాగు ఇసుక క్వారీ ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో 4 టాక్టర్లతో ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు పొందకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వారిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఎవరైనా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.




## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామారావుకు ఘన సన్మానం




**కోదాడ ఫిబ్రవరి 18 ( సాక్ష్యం)** కోదాడ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా గ్రంధాలయ చైర్మన్ గా ఎన్నికైన వంగవీటి రామారావు కు కొమరబండలోని వారి స్వగృహంలో వాసవి క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించి, బొకే అందజేయడం జరిగింది వాసవి క్లబ్ అధ్యక్షులు సేకు శ్రీనివాసరావు,సెక్రటరీ పత్తి నరేందర్, కోశాధికారి వెంపటి ప్రసాద్, ఆర్ సీ బెలిదే భరత్, IPC పబ్బా గీతా దేవి, వాసవి క్లబ్ సభ్యులు ఇమ్మడి సతీష్ బాబు,వాసవి క్లబ్ గౌరవ సలహాదారులు గుడుగుంట్ల సాయి,బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎలక్షన్ పోలింగ్ బూతు ను పరిశీలించిన ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



**సాక్ష్యం న్యూస్,శివంపేట.** శివంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ పోలింగ్ బూత్ ను మెదక్ ఎస్పి ఉదయ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందికి పలు జాగ్రత్తలు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సిఐ రంగాకృష్ణ, శివంపేట ఎస్సై మధుకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా లేబర్ కమిషనర్ తో ఎంఆర్ఎఫ్ కార్మికులు దేశ్ పాండ భేటీ



**సాక్ష్యం న్యూస్ సదాశివపేట :** సంగారెడ్డి జిల్లా సదాశివాపేట్ లో గల ఎంఆర్ఎఫ్ కర్మాగారంలో పనిచేస్తున్న సుమారు 350 మంది కార్మికులను విధుల నుంచి తొలగించడంతో కార్మికుల పక్షాన సంగారెడ్డి జిల్లా లేబర్ కమిషనర్ తో సమస్యలను పరిష్కరించి విధుల్లోకి వెంబడే తీసుకోవాలని డిమాండ్ చేస్తూ లేదంటే పెద్ద ఎత్తున ఎంఆర్ఎఫ్ కార్మికులు ఉద్యమిస్తాం రాజేశ్వర్ రావు దేశ్ పాండే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## కాశీ కుంభమేళా యాత్రకు బయలుదేరిన శివంపేట శివ స్వాములు!!



**సాక్ష్యంన్యూస్,శివంపేట.** శివంపేట మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో జ్యోతిరు ముడి కట్టుకొని కాశి కుంభమేళా యాత్రకు బయలుదేరారు. అంతకుముందు శివ స్వాముల ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ గురు స్వామి కొడకంచి గణేష్ గౌడ్ స్వామి, ఇసు గారి మల్లేష్ స్వామి, బాసంపల్లి నాగరాజు గౌడ్ స్వామి, ఎరుకలి వెంకటేశం స్వామి, ఈసు గారినర్సింలు స్వామి, తదితర స్వాములు, శివ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ యూనివర్సిటీకి స్థల పరిశీలన చేసిన కలెక్టర్

**సాక్ష్యం న్యూస్ (పాపన్నపేట ఫిబ్రవరి18)పాపన్నపేట:** మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి భూమిని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం పాపన్నపేట మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ముందుగా పాపన్నపేట మండలంలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి భూమికి సంబంధించి వివిధ ప్రదేశాలను సంబంధిత ఆర్డీవో, రమాదేవి, ఇంచార్జ్ తాహసిల్దార్ మహేందర్ గౌడ్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ... మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన 10 నుండి 15 ఎకరాల భూమిని గుర్తించేందుకు పాపన్నపేట మండలంలో తమ్మాయిపల్లి గ్రామంలో, పాపన్నపేట గ్రామంలోని భూమిని చూడడం జరిగిందని తెలిపారు. అనువైన భూమికి సంబంధించిభూ పరిపాలన విభాగం హైదరాబాద్ వారికి ప్రతిపాదనలు పంపించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డిఓ రమాదేవి, ఇన్చార్జి డిప్యూటీ తాసిల్దార్ మహేందర్ గౌడ్, సంబంధిత రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎకోఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం అబ్బురపరిచే అద్భుత లోకం



చెట్లు నరుకుతూ ఉంటే అడవులు అంతరించిపోతాయని ఆయనకు కలత చెందారు. 80 ఎకరాలలో సొంతంగా ఒక అడవిని పెంచారు. ఎకోఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం అబ్బురపరిచే అద్భుత లోకం రామ్‌దేవ్‌రావు తల్లితండ్రులది వరంగల్ జిల్లాలోని నెక్కొండ. తండ్రి నారాయణరావు అటవీ కాంట్రాక్టర్. చెట్లను నరికి అమ్మడం ఆయన పని. కానీ ఆయన ప్రకృతి అంటే మమకారం. చెట్లు నరుకుతూ ఉంటే అడవులు అంతరించిపోతాయని ఆయనకు కలత చెందారు. 80 ఎకరాలలో సొంతంగా ఒక అడవిని పెంచారు. రామ్‌దేవ్ పెరిగింది ఆ అడవిలోనే. ప్రకృతిని కాపాడాలనే ఆలోచన పుట్టింది కూడా ఆ అడవిలోనే! ఆ తర్వాత ప్రపంచంలోని అనేక దేశాలను తిరిగి చెట్లను సేకరించి వాటిని మన దేశానికి తీసుకువచ్చి పెంచటం ప్రారంభించారు. ఎవ్వరి దగ్గర లేని చెట్లను అందించటం ఆయన ప్రత్యేకత. దీనితో అనేక మంది ప్రముఖులు ఆయన దగ్గర నుంచి చెట్లు కొనుగోలు చేయటం మొదలుపెట్టారు. రామ్‌దేవ్ ఆలోచన అక్కడితోనే ఆగిపోలేదు. ప్రపంచంలోనే ఎక్కడా లేనన్ని చెట్లను ఒక చోటకు తీసుకురావాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ ఆలోచనల రూపమే ఎక్స్‌పీరియం. 150 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఇలాంటి పార్కు ప్రపంచంలోనే ఎక్కడా లేదనటం అతిశయోక్తి కాదు. ఒక్కసారి ఈ పార్కులోకి అడుగుపెడితే రకరకాల మొక్కలు సందర్శకులను కళ్లు తిప్పుకోనివ్వవు. అందుకే వెయ్యిరూపాయల ఎంట్రీ టిక్కెట్టు కొని... వేల మంది ఈ ఎక్స్‌పీరియంకు వస్తున్నారు.

**అన్ని వ్యాపారాలూ వదిలేసి...**

మొక్కలపై ఉన్న ఆసక్తితో రామ్‌దేవ్ తన అన్ని వ్యాపారాలనూ వదిలేశారు. ప్రపంచంలో పేరొందిన నర్సరీలను చూసేందుకు ఇప్పటి వరకు 78 దేశాలు తిరిగారు. ఎక్స్‌పీరియంలోని మొక్కల విలువ కోట్లలో ఉంటే.. ఆ భూమి విలువ మాత్రం వెయ్యి కోట్లకు పైనే ఉంటుంది. ''ఇంత విలువైన భూమిలో రియల్‌ఎస్టేట్ చేస్తే ఎక్కువ లాభం వస్తుంది కదా?'' అని ఎవరైనా ఆయన్ని ప్రశ్నిస్తే చిన్నగా నవ్వుతారు. ''ఇది నాకు హాబీ. ఇష్టమైన పని. ఉన్న వ్యాపారాలన్నీ ఎప్పుడో వదిలేశా. ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎందుకు?'' అంటారాయన. ఎక్స్‌పీరియం నిర్వహణకు ప్రతి నెల మూడు కోట్లకు పైనే ఖర్చు అవుతుంది. ''అందుకే సందర్శకులకు టిక్కెట్టు పెడుతున్నాం. ఆదాయం కోసం కాదు'' అంటారాయన.

**మనసు పడితే కొనేస్తారు**

చెట్లు అమ్మడమే కాదు... కొనడం కూడా ఆయనకు హాబీనే. ప్రపంచంలో ఎక్కడైనా అరుదైన మొక్క కానీ, చెట్టు కానీ ఉందని తెలిస్తే అక్కడ వాలిపోతారు. చూసింది మనసుకు నచ్చితే ఎంత ఖర్చైనా దాన్ని కొనేసి ఇక్కడకు తీసుకువచ్చి తన పార్కులో పెట్టుకుంటారు. ఇలా బయట దేశాల నుంచి ఆయన కొనుగోలు చేసిన చెట్ల ఖరీదు వందల కోట్లలో ఉంటుంది. ఎక్స్‌పీరియంలో 150 ఏళ్ల వయసు ఉన్న బోధివృక్షం కనిపిస్తుంది. ఇది ఇండోనేషియాలోని జావా ద్వీపకల్పంలోనిది. దీనిని రూ.60లక్షలకు కొని ఇక్కడకు తరలించారు. ఈ చెట్టు కొమ్మలు, ఆకులను కట్ చేసి 'కమలం' ఆకారం తీసుకువచ్చి మధ్యలో బుద్ధుడి విగ్రహాన్ని పెట్టి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ చెట్టును ఇలా తీర్చిదిద్దటానికి రాందేవ్ 75 లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. 2008 చైనాలో ఒలింపిక్స్ జరిగిన సమయంలో ఓ నర్సరీ యజమాని ఒక చెట్టును ఒలింపిక్స్ చిహ్నాలతో రూపుదిద్దాడు. దీని కోసం అతను 5 ఏళ్లపాటు శ్రమించాడు. ఒలింపిక్స్ సమయంలో చైనాలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తరువాత కాలంలో ఈ చెట్టును కొనేందుకు ఎంతో మంది ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు దాన్ని రామ్‌దేవ్ 50 లక్షలకు కొనుగోలు చేశారు.

**సృజనాత్మకతతో...**

రామ్‌దేవ్ స్వతహాగా చిత్రకారుడు. దీనితో మొక్కలను, చెట్లను ఏఏ డిజైన్లలో పెంచాలనే విషయాన్ని ఆయన నిర్ణయిస్తారు. ఇలా పుట్టిందే ప్రపంచంలో అతి పెద్ద గ్రీన్ డోమ్. అనేక చెట్ల సముదాయాలతో ఉండే ఈ గ్రీన్ డోమ్‌ను పై నుంచి చూస్తే పెద్ద గొడుగులా కనిపిస్తుంది. ఇదే విధంగా సందర్శకులకు మొక్కల వివరాలు తెలియటానికి వీలుగా స్కానింగ్ బోర్డ్‌లను ఏర్పాటు చేశారు. ఈ బోర్డులను స్కాన్ చేస్తే మొక్కల వివరాలన్నీ తెలుస్తాయి. ఆయన దూర దృష్టికి మరో నిదర్శనం- మొక్కల శ్మశానం. ''ఎవరైనా చనిపోయిన తర్వాత ఒక మొక్కగా మారాలనుకుంటే వారికి ఆ అవకాశం కల్పిస్తాం. చనిపోయిన తర్వాత పార్థీవదేహాన్ని ఇక్కడకు తీసుకువచ్చి ఖననం చేసుకోవచ్చు. దానిపై వారికి నచ్చిన మొక్కను పాతి పెంచుతాం. వారి కుటుంబ సభ్యులు వచ్చి ఈ మొక్కను ఎప్పుడైనా చూడవచ్చు. నేను కూడా నా దేహంపై మొక్కను పెంచాలని నా కుటుంబ సభ్యులకు చెప్పా'' అంటారు రామ్‌దేవ్.

హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులో నిర్మించిన అతిపెద్ద ఎకో పార్క్... ఎక్స్‌పీరియంకు ఇప్పటి దాకా అయిన ఖర్చు రూ.450 కోట్లు. అర్జెంటీనా, మెక్సికో, థాయ్‌లాండ్, ఉరుగ్వే, ఇటలీ, స్పెయిన్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా, మెక్సికో మొదలైన 85 దేశాల నుంచి తెప్పించిన 25 వేలకు పైగా మొక్కలు, వృక్షాలు ఇక్కడ కనిపిస్తాయి. వీటి ధర మార్కెట్లో వేల కోట్ల రూపాయలు ఉంటుంది. ఈ పార్క్‌లో రకరకాల కార్యక్రమాలు నిర్వహించు కోవటానికి కూడా అవకాశముంది. దీనిలో 1500 మంది కూర్చోవడానికి వీలైన యాంఫీ థియేటర్ ఉంది. రూ.50 కోట్లతో నిర్మించిన గ్లో గార్డెన్ ప్రపంచంలోనే మొదటిది. సహజమైన రాతితో మలచిన తొలి బార్ కౌంటర్.. అతిపెద్దవైన స్నో పార్క్.. బాక్స్ క్రికెట్ సౌకర్యం ఇక్కడ ఉన్నాయి. అలాగే 10 వేల మంది కూర్చోవడానికి వీలైన కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు.



# పుల్లగా... కమ్మగా

**చింతకాయలు అనగానే చిన్నా, పెద్దా అందరికీ నోట్లో నీళ్లు ఊరుతుంటాయి. వీటితో పచ్చడి, పప్పు, చారు ఇలా ఏ వంటకం చేసినా రుచిగానే ఉంటాయి. పుల్లని చింతకాయలతో చేసే సరికొత్త వంటకాలు మీకోసం...**

పుల్లగా... కమ్మగా చింతకాయ మెంతి పులుసు
కావాల్సిన పదార్థాలు: చింతకాయలు- పావు కేజీ, పచ్చిమిర్చి- పది, మెంతులు- ఒకటిన్నర చెంచా, పచ్చి శనగపప్పు- పావు కప్పు, నూనె- రెండు చెంచాలు, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, పసుపు- అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- అర చెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు, నీళ్లు- రెండు గ్లాసులు, ఉప్పు- తగినంత
తయారీ విధానం: పచ్చిమిర్చిని శుభ్రంగా కడగి,చాకుతో మధ్యలో పొడవుగా గాట్లుపెట్టాలి. చింతకాయలను కూడా నీళ్లతో కడగాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి చింతకాయలు వేసి నీళ్లు పోసి అయిదు నిమిషాలు ఉడికించాలి. చింతకాయలు మెత్తబడిన తరవాత స్టవ్‌మీద నుంచి దించి చల్లారనివ్వాలి. చింతకాయలను చేతితో బాగా పిసికి రసాన్ని వడబోయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి వేడి చేయాలి. మెంతులు, పచ్చి శనగపప్పులను విడివిడిగా దోరగా వేయించాలి. వీటిని విడివిడిగా మిక్సీలో పొడి చేసి చిన్న గిన్నెల్లోకి తీసుకోవాలి. శనగపప్పు పొడిలో కొంచెం నీళ్లు పోసి ఉండ కట్టకుండా మెత్తగా కలపాలి.స్టవ్ మీద గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, పచ్చిమిర్చి వేసి కలపాలి. రెండు నిమిషాలు వేగనివ్వాలి. తరవాత పసుపు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత చింతకాయ రసం పోసి, ఉప్పు వేసి ఉడికించాలి. 8నిమిషాల తరవాత మెంతి పొడి వేసి కలపాలి. చింతకాయ రసం బాగా మరుగుతున్నపుడు గంటెతో వేగంగా కలుపుతూ మరో చేత్తో శనగపప్పు పొడి, నీళ్ల మిశ్రమాన్ని మెల్లగా పోయాలి. ఉండలు రాకుండా కలుపుతూ ఉండాలి. చిన్న మంట మీద రెండు నిమిషాలు ఉడికించాలి. మరోసారి పులుసును బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. దీనిని వేడి అన్నంలో కలుపుకుని తింటే రుచిగా ఉంటుంది.

**జాగ్రత్తలు**

మెంతులను చిన్న మంట మీద గోధుమ రంగులో, మంచి సువాసన వచ్చే వరకూ వేపుకోవాలి. లేదంటే పులుసు పచ్చివాసనతో చేదుగా మారుతుంది.శనగపప్పు పొడిని ఒకసారి జల్లించు కుంటే మంచిది. పప్పు రవ్వలు ఉంటే పులుసు రుచి మారుతుంది.

# ఏసీ సరిగా పని చేయాలంటే...


ఏటా వేసవికాలంలో పెరుగుతున్న వేడిని తట్టు కోవడానికి ప్రతి ఇంట్లో ఏసీ వాడకం అనివార్యమయింది. గది అంతటా చల్లదనాన్ని విస్తరిస్తూ ఏసీ సక్రమంగా పనిచేయాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ఏసీ సరిగా పని చేయాలంటే...**

చాలామంది ఇళ్లలో శీతాకాలమంతా ఏసీని ఉపయోగించకపోవచ్చు. దీనిని అలాగే వాడితే పలు శ్వాసకోశ సమస్యలు వస్తాయి. ఏసీని లోపల, బయట అన్ని భాగాలను జాగ్రత్తగా శుభ్రం చేయాలి.ముందుగా ఏసీకి సంబంధించిన పవర్ సరఫరా ఆపాలి. ఏసీ ఇన్‌డోర్ యూనిట్ ప్యానెల్‌ను తెరచి అందులో ఉండే ఫిల్టర్లను బయటికి తీయాలి. వీటిని పాత టూత్‌బ్రష్‌తో సున్నితంగా రుద్ది దుమ్ము తొలగించాలి. తరవాత మంచినీళ్లతో కడిగి ఆరబెట్టాలి. ఎవాపరేటర్ కాయిల్‌ను పలుచని గుడ్డతో తుడవాలి. అన్నింటినీ సరిగా అమర్చి ఇన్‌డోర్ యూనిట్ ప్యానెల్‌ని మూసివేయాలి.ఏసీ అవుట్‌డోర్ యూనిట్‌ను శుభ్రం చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. కండెన్సర్ ఫిన్‌లను వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి. గాలి ప్రవాహాన్ని అడ్డుకునేలా ఏదైనా చెత్త చేరితే దాన్ని తొలగించాలి. టాప్ గ్రిల్‌ను తెరిచి పొడి గుడ్డతో తుడవాలి. నీళ్లలో ముంచి గట్టిగా పిండిన గుడ్డతో ఫ్యాన్‌ను తుడవాలి. తరవాత గాలికి ఆరనిచ్చి అన్ని భాగాలను యథాస్థానంలో అమర్చాలి.రెండు కప్పుల నీటిలో మూడు చెంచాల డిటర్జెంట్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఏసీ మెష్‌కి రాయాలి. తడి గుడ్డతో రుద్ది తుడిస్తే మెష్ పూర్తిగా శుభ్రపడుతుంది. నెట్ క్లీనింగ్ కోసం వ్యాక్యూమ్ క్లీనర్ ఉపయోగించడం మంచిది.రెండు కప్పుల నీటిలో రెండు చెంచాల వెనిగర్ వేసి బాగా కలిపి ఒక స్ప్రే బాటిల్‌లో పోయాలి. ఏసీ బయటి భాగమంతటా స్ప్రే చేసి పొడి గుడ్డతో తుడవాలి.ఏసీలో కూల్, డ్రై, హాట్, ఫ్యాన్ మోడ్‌లు అందుబాటులో ఉంటున్నాయి. చల్లని గాలి కోసం ఏసీని కూల్ మోడ్‌లో సెట్ చేసుకోవాలి.గది తొందరగా చల్లబడాలంటే ఏసీ ఫిల్టర్లను రెండు వారాలకు ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయాలి.ఏసీ వేసినప్పుడు గదిలో విస్తరించే చల్లని గాలి బయటికి పోకుండా తలుపులు, కిటికీలు మూసివేయాలి.గదిలోకి నేరుగా ఎండ వస్తుంటే ఏసీ చల్లదనాన్ని వ్యాప్తి చేయలేదు. కిటికీలకు మందపాటి కర్టెన్లు వేయాలి.గది విస్తీర్ణానికి తగ్గ సామర్థ్యం ఉన్న ఏసీని ఎంపిక చేసుకోవాలి.ఏసీ అవుట్‌డోర్ యూనిట్‌పై ఎండ పడకుండా జాగ్రత్త వహించాలి. దీని నుంచి గాలి సులువుగా వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలి.ఏసీ కూలింగ్ మెరుగ్గా ఉండేందుకు రెగ్యులర్ సర్వీస్ తప్పనిసరి. రూమ్ టెంపరేచర్ కన్నా తక్కువగా సెట్ చేసినప్పటికీ వేడి గాలి వస్తున్నా, గాలి సరిగా రాకపోయినా, గది మొత్తం ఒకే టెంపరేచర్ లేకపోయినా, ఏసీ నుంచి శబ్దాలు వస్తున్నా, గది మొత్తం చల్లగా అయినప్పటికీ ఆపరేటింగ్ సిస్టమ్ ఆగకపోయినా, ఏసీ నుంచి నీళ్లు కారుతున్నా, దుర్వాసన వస్తున్నా, కరెంట్ బిల్ ఎక్కువగా వస్తున్నా టెక్నీషియన్‌తో సర్వీసింగ్ చేయించాలి.



# చుండ్రు వేధిస్తోందా..!



వాతావరణ మార్పులు, శరీరంలో హార్మోన్ల అసమతౌల్యం వల్ల తలలో చుండ్రు వస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో దురద, శిరోజాలు రాలడం లాంటి పలు సమస్యలు వేధిస్తుంటాయి. ఇంట్లో దొరికేవాటితోనే చుండ్రుని తగ్గించే మార్గాల గురించి తెలుసుకుందాం!

**చుండ్రు వేధిస్తోందా..!**

రెండు అంగుళాల కలబంద ముక్క నుంచి గుజ్జుని తీసుకుని మాడుకు పట్టించాలి. అయిదు నిమిషాలు సన్నితంగా మర్దన చేయాలి. ఇరవై నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే పది రోజుల్లో చుండ్రు తగ్గుతుంది.రాత్రి పడుకునేముందు చిన్న గిన్నెలో మూడు చెంచాల ఆలివ్ నూనె వేసి కొద్దిగా వేడి చేయాలి. దీనిని కొద్దిగా వేళ్లతో తీసుకుంటూ తలకి పట్టించాలి. మాడు మీద గుండ్రంగా రుద్దుతూ మర్దన చేయాలి. ఉదయం లేవగానే మైల్డ్ షాంపూతో తలస్నాం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.చిన్న గిన్నెలో ఒక గరిటె పెరుగు, గుడ్డు తెల్ల సొన వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చుండ్రు ఉన్న ప్రదేశంలో రాయాలి. పావు గంట తరవాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. క్రమంగా చుండ్రు రాలడం ఆగుతుంది.మూడు చెంచాల మెంతులను ఒక గ్లాసు నీటిలో వేసి రాత్రంతా నాననివ్వాలి. ఉదయాన్నే వీటిని మెత్తగా రుబ్బి తలకు పట్టించాలి. అరగంట తరవాత తలస్నానం చేస్తే మాడుమీద చర్మానికి తేమ అంది చుండ్రు తగ్గుతుంది.రెండు గుప్పెళ్ల వేపాకులను మెత్తగా రుబ్బి మాడుకు పట్టించాలి. అరగంట తరవాత మంచినీళ్లతో తలస్నానం చేస్తే ప్రయోజనం కనిపిస్తుంది.యాపిల్ సైడర్ వెనిగర్‌కు చర్మం మీద పీహెచ్ స్థాయిని సమతుల్యం చేసే శక్తి ఉంది. ఒక గిన్నెలో రెండు చెంచాల యాపిల్ సైడర్ వెనిగర్, రెండు చెంచాల నీళ్లు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలంతా రాయాలి. పావు గంట ఆరాక తేలికపాటి షాంపూతో తలస్నానం చేస్తే చుండ్రు సమస్య తీరుతుంది.

# పిల్లల షూ క్లీనింగ్ ఇలా



పిల్లలు పాఠశాలకు వెళ్లేటప్పుడు వేసుకునే షూలను కనీసం రెండు రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని నిపుణులు చెబుతున్నారు. తక్కువ సమయంలో షూలను ఎలా క్లీన్ చేయాలో తెలుసుకుందాం! షూలను ముందుగా పాత టూత్‌బ్రష్‌తో రుద్దుతూ వాటికి అంటిన మట్టిని తొలగించాలి. లోపల ఉండే సోల్‌ని తీసి షూని బాగా దులపాలి.డిటర్జెంట్, సర్ఫ్, షాంపూ కలిపిన నీళ్లలో పలుచని గుడ్డని ముంచి పిండాలి. దీనితో షూ లోపల, బయటా తుడవాలి. ఒక ట్రేలో ఈ నీళ్లు కొన్ని పోసి అందులో షూ అడుగు భాగం మునిగేలా ఉంచాలి. అయిదు నిమిషాల తరవాత మంచినీళ్లతో కడగాలి.టూత్ బ్రష్‌ను కొద్దిగా సర్ఫ్ లేదా షాంపూలో ముంచి దానితో తెలుపు రంగు షూల పై భాగాన్ని రుద్దాలి. మురికి మొత్తం వదిలాక కొన్ని నీళ్లు చిలకరిస్తూ పలుచని గడ్డతో తుడవాలి.షూలను శుభ్రం చేసిన తరవాత వాటి లోపల కాగితం ఉండలను లేదా పలుచని తువాలును గుండ్రంగా మడిచి ఉంచాలి. లోపలి భాగంలోని తడిని ఇవి పీల్చుకుంటాయి. అయిదు నిమిషాల తరవాత వీటిని తీసివేసి షూలకు బాగా గాలి తగిలేలా ఉంచి ఆరనివ్వాలి.షూ లేసులను, సోల్‌ని సబ్బునీటిలో ముంచి పది నిముషాలు నాననివ్వాలి. తరవాత మంచి నీళ్లలో ముంచి తీసి గాలికి ఆరబెట్టాలి.నైలాన్, కాటన్, పాలిస్టర్ పదార్థాలతో తయారైన కాన్వాస్ షూలను ముందుగా పైపైన శుభ్రం చేసి తరవాత పాత తువాలులో చుట్టి వాషింగ్ మెషిన్‌లో వేయవచ్చు.లెదర్, రబ్బర్, వినైల్ షూలను మాత్రం చేతితో క్లీన్ చేసుకోవాలి.షూలను శుభ్రం చేయడానికి గోరువెచ్చని నీటిని ఉపయోగించవచ్చు. బ్లీచ్, ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్‌లను వాడకూడదు.ప్రతిరోజూ పలుచని పొడి గుడ్డతో పైపైన తుడిచి పాలిష్ చేసుకుంటూ ఉంటే షూలు కొత్తవాటిలా మెరుస్తాయి.

# ఝుంకామెరుపుల్


దక్షిణ భారత మూలాలు కలిగిన సంప్రదాయ ఆలయ ఆభరణాలైన ఝుంకాలు గుడి గంట ఆకారంలో తయారవుతూ ఉంటాయి. ఆకారంలో పెద్దవిగా, బరువుగా ఉండే ఈ ఆభరణాలు కాలక్రమేణా కొత్త హంగులు అద్దుకుంటూ వినూత్నమైన డిజైన్లతో రూపొందడం మొదలుపెట్టాయి. చెవులకు చిట్టిపొట్టి పోగులు ధరించే రోజులు పోయాయి. ఇప్పుడంతా భారీ ఝుంకాల ఫ్యాషనే! పెళ్లిళ్ల సీజన్లో ఇలాంటి భారీ ఝుంకాలకు గిరాకీ ఎక్కువ. కాబట్టి తాజాగా మహిళలను ఆకట్టుకుంటున్న ఈ ఫ్యాషన్ గురించి తెలుసుకుందామా? దక్షిణ భారత మూలాలు కలిగిన సంప్రదాయ ఆలయ ఆభరణాలైన ఝుంకాలు గుడి గంట ఆకారంలో తయారవుతూ ఉంటాయి. ఆకారంలో పెద్దవిగా, బరువుగా ఉండే ఈ ఆభరణాలు కాలక్రమేణా కొత్త హంగులు అద్దుకుంటూ వినూత్నమైన డిజైన్లతో రూపొందడం మొదలుపెట్టాయి. ప్రారంభంలో దక్షిణ భారత దేశంలోని భరతనాట్య కళాకారిణులు చంప సరాలతో కలిపి వీటిని ధరించడం మొదలుపెట్టారు. ప్రాంతాన్ని బట్టి భిన్నమైన పేర్లను పొందిన ఈ ఆభరణాలను రాజస్థాన్‌లో మీనాకారి ఝుంకాలుగా పిలుస్తూ ఉంటారు. ఆ ప్రాంతంలో ఇవి పూలు, నెమలి డిజైన్లతో రూపొందుతూ ఉంటాయి. బంగారం, వెండి, వజ్రాలతో రూపొందే ఝుంకాలు వేర్వేరు పరిమా ణాలు, డిజైన్లలో మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

**వేర్వేరు నమూనాల్లో...:** గుండ్రని, గంటాకారపు, చంద్రాకారపు, శంఖాకార ఝుంకాలు తయారవుతూ ఉంటాయి. వీటిలో పెద్దవీ, చిన్నవీ ఉంటాయి. అయితే ఆకారంలో పెద్దవిగా ఉండే వాటిని అన్ని సందర్భాల్లో ధరించడం వీలు కాదు కాబట్టి వాటిని స్టడ్‌గా, ఝుంకాగా వేర్వేరుగా విడదీసే వీలుండే డిటాచబుల్ నమూనాలు కూడా దొరుకుతున్నాయి. వీటికి మ్యాచ్ అయ్యే చంపసరాలు కూడా అందుబాటులో ఉంటున్నాయి. కాబట్టి పెళ్లిళ్లు లాంటి వేడుకల్లో భారీ ఝుంకాలనూ, రోజువారీ వాడుక కోసం తేలికపాటి ఝుంకాలను ఎంచుకోవచ్చు. మరీ ముఖ్యంగా సంప్రదాయ వేడుకల్లో టెంపుల్ జ్యువెలరీ విభాగానికి చెందిన ఝుంకాలు చాలా బాగుంటాయి.

# పెరుగుతో ఫేషియల్...

**ముఖం అందంగా కనిపించాలని మహిళలు ఫేషియల్ చేయించుకుంటూ ఉంటారు. ప్రతిసారీ పార్లర్‌కి వెళ్లకుండా ఇంట్లో వుండే పెరుగుతో స్వయంగా ఫేషియల్ చేసుకుని ముఖాన్ని కాంతివంతంగా మార్చుకోవచ్చు. ఆ వివరాలు తెలుసుకుందాం!**

**పెరుగుతో ఫేషియల్...** ముఖం అందంగా కనిపించాలని మహిళలు ఫేషియల్ చేయించుకుంటూ ఉంటారు. ప్రతిసారీ పార్లర్‌కి వెళ్లకుండా ఇంట్లో వుండే పెరుగుతో స్వయంగా ఫేషియల్ చేసుకుని ముఖాన్ని కాంతివంతంగా మార్చుకోవచ్చు. ఆ వివరాలు తెలుసుకుందాం! ముందుగా ముఖాన్ని సున్నిపిండితో శుభ్రం చేసుకోవాలి. ఒక గిన్నెలో రెండు గంటెల పుల్లని పెరుగును తీసుకుని చెంచాతో బాగా కలిపి చిక్కని మిశ్రమంలా చేయాలి. దీనిని వేళ్లతో కొద్దిగా తీసుకుంటూ ముఖమంతా పట్టించి అయిదు నిమిషాలు సున్నితంగా మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే చర్మానికి తగినంత తేమ అంది ముఖం మెరుపు సంతరించుకుంటుంది. పెరుగులో ఉండే లాక్టిక్ యాసిడ్... నుదుటిపై ముడుతలు, గీతలు రాకుండా కాపాడుతుంది. అంతేకాదు బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి ముఖానికి సహజ కాంతిని అందిస్తుంది.ఒక గిన్నెలో రెండు గంటెల పెరుగు, ఒక చెంచా కాఫీ పొడి, రెండు చెంచాల పంచదార వేసి కలపాలి. పెరుగులో పంచదార కరగడానికి ముందే ఈ మిశ్రమాన్ని వేళ్లతో ముఖమంతా పట్టించాలి. నుదురు, చెంపలు, ముక్కు భాగాల్లో కింది నుంచి పైకి వేళ్లతో సున్నితంగా రుద్దాలి. ఈ మిశ్రమం చక్కని స్క్రబ్‌లా పనిచేసి చర్మ రంధ్రాలను శుభ్రం చేస్తుంది. చర్మం మీద పేరుకున్న మృతకణాలన్నీ తొలగిపోతాయి. తరచూ ఇలా చేస్తూ ఉంటే ముఖం మీద బ్లాక్ హెడ్స్, మొటిమలు రావు. ఎండ వల్ల కలిగే నలుపుదనం కూడా తగ్గిపోతుంది.చిన్న గిన్నెలో ఒక గంటె పెరుగు, ఒక గంటె టమాటా గుజ్జు వేసి బాగా కలపాలి. మెత్తని బ్రష్ సహాయంతో ముఖంపై కింది నుంచి పైకి దిశలో ఈ మిశ్రమాన్ని పట్టించాలి. కళ్ల మీద గుండ్రంగా తరిగిన టమాటా ముక్కలు పెట్టుకోవాలి. కళ్లు మూసుకుని అరగంట విశ్రాంతి తీసుకోవాలి. తరవాత చల్లని నీళ్లతో ముఖం కడుక్కోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే ముఖం మీద చర్మం బిగుతుగా మారి నున్నగా ఆరోగ్యంగా కనిపిస్తుంది.



## నీటితో చేసే గోరువెచ్చని పానీయాలతో బరువు తగ్గుతారా?



గోరు వెచ్చని నీటితో చేసే పలు పానీయాలు తాగితే బరువు సులభంగా తగ్గుతారని అనేక మంది భావిస్తుంటారు. అయితే, ఇది పూర్తిగా నిజంగా కాదని నిపుణులు చెబుతున్నారు. కెలొరీల ఖర్చే బరువు తగ్గేందుకు ప్రధానమైన సూత్రమని చెబుతున్నారు. ఈ మధ్యకాలంలో అనేక మంది బరువు తగ్గడం గురించి మాట్లాడుకుంటున్నారు. జీవనశైలిలో మార్పులు, డైట్‌లు వంటి వాటి గురించి చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో అనేక మంది గోరువెచ్చని నీటితో చేసే పుదీనా వాటర్, లవంగాల వాటర్ తదితరాలు అద్భుతాలు చేస్తాయని కూడా చెబుతున్నారు. మరి ఇందులో నిజమెంత అనే ప్రశ్నకు వైద్యులు సవివరమైన సమాధానమే ఇస్తున్నారు.నిపుణులు చెప్పే దాని ప్రకారం, గోరువెచ్చని నీటితో చేసే రకరకాల డ్రింక్స్‌లో కొవ్వు కరిగించే గుణాలు ఏవీ ఉండవట. అయితే, ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగితే మాత్రం జీర్ణవ్యవస్థ ప్రక్షాళన అవుతుంది. విషతుల్యాలన్నీ తొలగపోయి మరింత ఆరోగ్యవంతంగా మారుతుంది. ఇది బరువు తగ్గాలనుకునే వారికి లాభిస్తుంది

# విద్యార్థీ.. విజయీభవ!

**పండగలు వస్తున్నాయంటే కొత్త దుస్తులు ఎంత మామూలో.. పరీక్షలు వస్తున్నాయంటే భయం, ఒత్తిడి, ఆందోళన అంతే సర్వ సాధారణం. మార్చి వస్తున్నదంటే నూటికి తొంభై మంది విద్యార్థుల్లో బెరుకు బయల్దేరుతుంది. పరీక్ష తేదీ దగ్గర పడుతున్న కొద్దీ వణుకు. నిద్ర పట్టదు, భోజనం సహించదు, బుర్ర నిండా పిచ్చి పిచ్చి ఆలోచనలు,మనసులో ఓటమి భయం. వీటన్నిటికీ ఒకే కారణం.. పరీక్షా సమయం. ఈ ఒత్తిడిని చిత్తు చేయడం ఎలాగో తెలుసుకుంటే విద్యార్థిదే విజయం.**



పరీక్ష అనేది విద్యార్థికి ఓ పాజిటివ్ సవాల్. దాని గురించి నెగెటివ్‌గా ఆలోచిస్తే తీవ్రమైన సమస్య, కత్తి మీద సాము, ఏటికి ఎదురీదినంత కష్టం. పాజిటివ్‌గా ఆలోచిస్తే ఓ నిచ్చెన మెట్టు. చేయి పట్టుకొని ఒక్కొక్క మెట్టు ఎక్కించే మిత్రుడిలా కనిపిస్తుంది. ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి తీసుకెళ్తుంది. అందుకే పరీక్షలను పాజిటివ్‌గానే తీసుకోవాలి, పాజిటివ్‌గానే ఎదుర్కోవాలి. ఆధునిక జీవితంలోని ప్రతి కోణంలో ఏదో ఒక రూపంలో ఎంతో కొంత ఒత్తిడి ఉండే తీరుతుంది. తట్టుకోవడం నేర్చుకోవాలి, పాజిటివ్‌గా మార్చుకునే ప్రయత్నం చేయాలి. మంచి మార్కులు రావేమో అన్న నెగెటివ్ థింకింగ్‌ను, మంచి మార్కులు తెచ్చుకోగలను అనే పాజిటివ్ ఆలోచనగా మార్చాలి.

### కొంచెం ఒత్తిడి మంచిదే..

ఒత్తిడిని దెయ్యం లాగానో, భూతం లాగానో ఊహించుకోకూడదు. టీవీ ప్రకటనలో 'మరక మంచిదే' అన్నట్టు అలాగే ఒత్తిడి కూడా ఓ కోణంలో మంచిదే. విద్యార్థులు పరీక్షలు రాయటానికి, వారి సామర్థ్యాన్ని వెలికి తీయడానికి ఓ మోస్తరు ఒత్తిడి అవసరమే. దీన్ని యూ స్ట్రెస్ అంటారు. ఈ కొద్దిపాటి ఒత్తిడి కూడా లేకపోతే విద్యార్థుల్లో ప్రేరణ కలగదు. దీని మోతాదు మించితేనే సమస్య మొదలవుతుంది.

### రివిజన్ ఇలా..

చదివింది బాగా గుర్తు పెట్టుకోవాలన్నా, పరీక్షల్లో విజయం సాధించాలన్నా రివిజన్ చాలా ముఖ్యం. చాలామంది విద్యార్థులు రివిజన్ అంటే అంతకుముందు చదివిన దాన్ని మళ్లీ చదవడం అనే పొరపాటు అభిప్రాయంతో ఉంటారు. రివిజన్ అంటే అసలు అర్థం, మెదడులో అప్పటికే నిల్వ ఉన్న సమాచారాన్ని దృశ్య రూపంలో గుర్తు తెచ్చుకోవడం. ఓ క్రమపద్ధతిలో రివిజన్ చేయడం ద్వారా పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. మొదటి రివిజన్ గంటలోపు, రెండో రివిజన్ 24 గంటల లోపు, మూడో రివిజన్ ఒక వారం లోపు, నాలుగో రివిజన్ నెల రోజుల లోపు చేస్తే ఆ సమాచారం అంతా లాంగ్ టర్మ్ మెమరీలోకి వెళ్తుంది. రాసేటప్పుడు చక్కగా గుర్తుకొస్తుంది.

### పరీక్ష ముందు రోజు..

పరీక్షల ఒత్తిడి ఎదుర్కోవడానికి కొంత మానసిక సన్నద్ధత అవసరం. విద్యార్థికి ఏ లెక్కలో, ఫిజిక్స్, బయాలజీలో శత్రువులు కాదు. పరీక్షలంటే ఉండే భయమే అసలైన శత్రువు. కొన్ని నియమాలు పాటించడం ద్వారా ఆ భయాన్ని తరిమికొట్టొచ్చు.
శారీరకంగానూ, మానసికంగాను ఉత్సాహంగా ఉండాలంటే రోజూ 10 నిమిషాల వ్యాయామం తప్పనిసరి. జాకబ్‌సన్ రిలాక్సేషన్, డీప్ బ్రీత్ ఎక్సర్‌సైజెస్, విజువలైజేషన్ మొదలైనవి ఒత్తిడిని ఎదుర్కోవడానికి ఉపకరిస్తాయి. వీటిలో ఏదో ఒకటి సాధన చేయటం మంచిది.
పరీక్ష ముందురోజు ప్రశాంతంగా నిద్రపోయి శరీరాన్ని, మనసును రిలాక్స్ చేసుకోండి. రేపటి పరీక్షలు చక్కగా రాసినట్టు ఊహిస్తూ నిద్రలోకి జారుకోండి. మీ సబ్ కాన్షస్ మైండ్ మిమ్మల్ని పరీక్షకు సిద్ధం చేస్తుంది.

### పరీక్ష రోజు..

పరీక్ష సమయంలో మితాహారం మంచిది. పరీక్షకు రెండు గంటల ముందు తక్కువ మోతాదులో తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోండి.పరీక్ష హాల్లోకి వెళ్లే ముందు అరటిపండు తినండి. మెదడుకు కావాల్సిన గ్లూకోజ్ అందుతుంది. పరీక్షకు 15 నిమిషాల ముందు బబుల్ గమ్ నమలండి. దీంతో మెదడు ఉత్తేజితమవుతుంది. హాల్లోకి వెళ్లే ముందు బబుల్ గమ్ ఊసేయండి. పరీక్షా కేంద్రానికి అరగంట ముందు చేరండి. కేంద్రం మొత్తం కలియ తిరగండి. ఇలా చేయడం ద్వారా ఆ ప్రదేశం కొత్తది అనే భావన మీ మనసు నుంచి పోతుంది. ధైర్యం పెరుగుతుంది.

### పరీక్ష హాలులో..

పరీక్ష హాల్లో కూర్చున్న తర్వాత మనసు చలించకుండా స్థిరంగా ఉంచుకోండి. బొడ్డు కింది భాగంలో మీ సెంటర్ ఆఫ్ గ్రావిటీ ఉంటుంది, దానిపై అటెన్షన్ ఉంచండి. దీంతో శరీరానికి స్థిరత్వం వస్తుంది. మనసు కూడా స్థిరంగా ఉంటుంది.
పరీక్ష హాలులో మీ చుట్టుపక్కల ఉన్నవారిని విచిత్ర వేషధారణలో ఊహించండి. వారి ముఖాలను ఫన్నీగా ఊహించుకోండి. మీలో మీరు నవ్వుకోండి. దీంతో మీ బాడీలో ఎండార్ఫిన్స్ రిలీజ్ అవుతాయి, మనసును తేలిక పరుస్తాయి. మెదడును చురుకుగా ఉంచుతాయి.
ప్రశ్నపత్రం ఇచ్చిన వెంటనే సునిశితంగా పరిశీలించండి. ఏ సమాధానం రాయడానికి ఎంత సమయం కావాలో ముందుగానే నిర్ణయించుకోండి. రాసిన సమాధానాలు చెక్ చేసుకోడానికి పది నిమిషాలు మిగిలేటట్టుగా ప్లాన్ చేసుకోండి.
ప్రతి అరగంటకు ఓ నిమిషంపాటు విరామం తీసుకోండి. నెమ్మదిగా, బలంగా గాలి పీల్చి వదలటం ద్వారా మీ మెదడుకు ఆక్సిజన్‌ని అందించండి. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. మధ్య మధ్యలో కొంచెం మంచినీళ్లు తాగుతూ ఉండండి. మీ బాడీ డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది.

### పరీక్ష తర్వాత..

పరీక్ష రాసిన తర్వాత హాల్ నుంచి బయటికి వచ్చి తోటి విద్యార్థులతో చర్చించడం మంచిది కాదు. మీరు రాసిన జవాబు తప్పు అని ఎవరైనా అంటే ఆత్మవిశ్వాసం సన్నగిల్లే అవకాశం ఉంటుంది. దాని ప్రభావం మర్నాటి పరీక్షపై పడే ప్రమాదం ఉంటుంది. ఎవరితోనూ రాసిన పరీక్ష గురించి చర్చించవద్దు. అది ఏ విధంగానూ లాభం చేకూర్చదు. మరుసటి రోజు రాయాల్సిన పరీక్షపై ఫోకస్ చేయడి. ఒక సూర్య కిరణం ఏదీ సాధించలేదు. భూతద్దం వేల, లక్షల కిరణాలు ఏకం చేసి కాగితాన్ని కాల్చేయగలుగుతుంది. అదీ ఫోకస్‌కు ఉన్న శక్తి. ప్రతి విద్యార్థి అంతే ఫోకస్‌తో, తన భయాలను, అపోహలను బుగ్గి చేసి ఆత్మవిశ్వాసంతో పరీక్ష హాల్లో అడుగుపెడితే విజేతగా నిలవడం ఖాయం. విద్యార్థీ.. జయీభవ.. విజయీభవ!

# ఘనం.. పీవీ వనం



తీయని పండ్లు ఎన్నో ఉన్నాయి. ఆ తీయని పండ్లలో సీతాఫలానికి సాటి రాగల ఫలం మరోటి లేదు. సీతాఫలం తీపిలో రారాజు. సీతాఫల చెట్టు తెలంగాణలో అన్నిచోట్లా కనిపిస్తుంది. అత్యల్ప వర్షపాతం ఉండే భూముల్లో సీతాఫల మొక్కలు సహజంగానే పెరుగుతాయి. ఇది చిన్న వృక్షం. వర్షాకాలంలో కాయడం మొదలవుతుంది. దసరా, దీపావళి వరకు కాస్తాయి. సంవత్సరంలో మూడు నెలలు మాత్రమే సీతాఫలాలు దొరుకుతాయి. సీతాఫలం లేత ఆకుపచ్చ రంగులో బొడిపెలతో గుండ్రంగా ఉంటుంది. తెల్లని గుజ్జులో అనేక విత్తనాలుంటాయి. అత్యంత తీయనైన సీతాఫలాన్ని గింజలు మింగకుండా తినడం ఓ కళ. పీవీ వనంలో సీతాఫలం, రామ సీతాఫలం, లక్ష్మణ సీతాఫలంతోపాటు సోర్ ఫ్రూట్ అని పిలిచే ఇంకోరకం ఔషధ సీతాఫల చెట్టు కూడా ఉంది.ఓ క్యాన్సర్ రోగి కోసం తెప్పించిన సోర్‌ఫ్రూట్ గింజల్లో ఒకటి ఇక్కడ మొలిచింది. అది ఈ మధ్యే కాస్తున్నది. తొక్క ముళ్లలా ఉంది. లోపలి గింజలు కూడా సీతాఫలం గింజల్లాగే ఉన్నాయి. వాసన కూడా అలాగే ఉంది. రుచి మాత్రం తీపిలో చింతపులుపు కలిసినట్టుగా ఉంటుంది. రామసీతాఫలం తొక్క బొడిపెలుగా ఉన్నా గరుకుగా ఉండకుండా, గళ్ల గీతలు ఉంటాయి. గింజలు తక్కువగా ఉండి, రుచి అతి మధురంగా ఉంటుంది. సీతాఫల చెట్లు దేశమంతటా ప్రకృతిసిద్ధంగా పెరుగుతాయి. శ్రీకాకుళం ప్రాంతం సీతాఫలాలకు ప్రసిద్ధి. మన దేశంలో సీతాఫలాన్ని వాణిజ్య పంటగా పెంచుతున్నారు. రైతులకు ఇది లాభదాయకమైన పంట.ఈ మధ్య సీతాఫలాలతో స్వీట్లు, జెల్లీలు, ఐస్‌క్రీమ్‌లు, జామ్‌లు మార్కెట్లోకి వస్తున్నాయి.

# చిగురు కొమ్మలు కావివి చిత్రాల జీవులు!



**పువ్వుల్లో దాగున్న పళ్లూ, సీతాకోక ఒళ్లూ నిజంగా అతిశయాలే. అంతకు ఎంత మాత్రమూ తీసిపోని అతిశయాలు ఈ జీవులు. ఎందుకంటే ఒంటి మీద లేలేత చిగుళ్లు మొలిచినట్టు, చిట్టి రెమ్మలు, తీగలూ పారినట్టు కనిపిస్తాయి ఈ ప్రాణులు. వీటిలో సంద్రంలో ఉండే సిత్రం ఒకటైతే చెట్టు కొమ్మల్లో రెమ్మల్లా కలిసిపోయేవి మరో రకం. ఎంత వింత ఇంత జీవులో అని పాడుకునేలా ఎన్నో విశేషాలుఉన్నాయి వీటిలో! తెలుసుకుందాం పదండి..**

### మగవే కంటాయి..


ఈ జీవిని చూడండి ఏదో కొమ్మలు, ఆకుల మధ్య దూరి చూస్తున్నట్టు కనిపిస్తుంది కదూ! కానీ ఆ ఆకులూ, చిగుళ్లలా కనిపిస్తున్నదీ దాని శరీరమే. దీని పేరు 'లీఫీ సీ డ్రాగన్'. బొమ్మల్లో మనకు కనిపించే డ్రాగన్‌లాంటి ఆకారంలో ఉండే సముద్రజీవి అన్నమాట. సీ హార్స్‌గా మనం పిలిచే నీటి గుర్రాల జాతికి చెందినది. ఈ జీవుల రూపమే కాదు, పుట్టుకా విచిత్రమే. ఇందులో మగవే పిల్లల్ని కంటాయి. జట్టుకట్టే ముందు రెండూ కలిసి అందమైన నృత్యం చేస్తాయి. ముఖ్యంగా సాయంత్రాలు ఇలా ఒకదాన్ని మరొకటి అనుకరిస్తూ డ్యాన్స్ చేస్తాయి. రెండిటికీ సమన్వయం కుదిరితే ఆడ సీ డ్రాగన్ గులాబీ రంగులో ఉండే వందా రెండు వందల గుడ్లను మగ దానికి బదిలీ చేస్తుంది.
వీటిలో మగ వాటికి తోక అడుగు భాగంలో 'బ్రూడ్ ప్యాచ్'గా పిలిచే ప్రత్యేక నిర్మాణం ఉంటుంది. ఆడ డ్రాగన్ బదిలీ చేసిన గుడ్లు దీనికి అతుక్కుంటాయి. దాని ద్వారానే వాటికి ఆక్సిజన్ అందుతుంది. ఈ బ్రూడ్ ప్యాచ్‌లాంటి నిర్మాణంలోనే అవి ఫలదీకరణం చెందుతాయి. నాలుగైదు వారాల తర్వాత మగవే గుడ్డు నుంచి పిల్లల్ని బయటికి వచ్చేలా చేస్తాయి. ఇక, వీటి శరీరం చుట్టూ ఉన్న ఆకుల్లాంటి నిర్మాణాలు వాటి రక్షణ కోసమన్నమాట. నీళ్లలోని మొక్కలు, నాచులో కలిసిపోయేలా ఈ చిగుళ్లలాంటి వాటి రంగులను మార్చుకోగలవు కూడా. పెద్దగా ఈత రాని ఇవి అలా శత్రువుల నుంచి తప్పించుకుంటూ జీవిస్తాయి. ఇంతకీ, ఇవి ఆస్ట్రేలియా పడమర, దక్షిణ ప్రాంతాల్లోని సముద్రాల్లో ఉంటాయి. అంతేకాదు, ఈ జీవి దక్షిణ ఆస్ట్రేలియా ప్రాంతానికి సాగర చిహ్నం (మెరైన్ ఎంబ్లమ్) కూడా!

### తీగలో తీగనై..

తాము నివసించే పరిసరాల్లో కలిసిపోయి తమని తాము కాపాడుకుంటూ, ఆహారాన్ని సంపాదించుకునేలా చిత్రమైన రూపాల్లో ఉంటాయి కొన్ని జీవులు. వాటిలో ఒకటే 'లైకేన్ కేటిడిడ్'. మిడతల జాతికి చెందిన ఇవి లేత ముదురు ఆకుపచ్చ రంగుల్లో సన్నటి దారాల్లా ఉండే తీగల గుంపుగా కనిపించే లైకేన్ అనే ఒక రకం మొక్కల్లాంటి వాటి మీద జీవిస్తాయి. లైకేన్ శిలీంధ్రం, శైవలాల కలయిక వల్ల ఏర్పడ్డ మొక్కను పోలిన నిర్మాణం. అయితే దీని ఆధారంగానే బతికే కేటిడిడ్‌లు అందులో కలిసిపోయేలా అచ్చం అవే రంగుల్లో ఉంటాయి. అంతేకాదు ఈ తీగలను పోలి ఉండేలా దీని కాళ్లు శరీరం నుంచి సన్నటి తీగల్లాంటి నిర్మాణాలూ పొడుచుకు వచ్చినట్టు ఉంటాయి. దీంతో లైకేన్ మీద ఇది నిలుచున్నా, నడిచినా అసలక్కడ ఒక కీటకం ఉంది అన్న విషయాన్ని గుర్తించడమే కష్టం. కావాలంటే ఫొటో చూడండి, అందులో మిడతను కనిపెట్టడానికి ఎవరికైనా సమయం పడుతుంది.

### గొల్లభామ చిగురించింది

పచ్చటి, ఎండుటాకుల్లా ఉండే గొల్లభామలను మన దగ్గర చూస్తుంటాం కదా! అదిగో అదే జాతికి చెందింది ఈ చిత్రంలో కనిపిస్తున్న పురుగు. దీన్ని డ్రాగన్ మాంటిస్ అని పిలుస్తారు. స్టెనోఫైలా లాబివర్టెక్స్ దీని శాస్త్రీయ నామం. అచ్చం చిన్న చెట్టు రెమ్మలా ఉండి, అక్కడక్కడా చిగుళ్లు, ఆకులు వచ్చినట్టు కనిపించే శరీరం దీని ప్రత్యేకత. ఒక జీవి తనను తాను కాపాడుకోవడానికి ఎన్ని రకాల పరిణామాలు చెందుతుంది అన్నదానికి దీన్ని చక్కని ఉదాహరణగా చెప్పొచ్చు అంటారు శాస్త్రవేత్తలు. ఇవి ఎక్కువగా పెరు, ఈక్వెడార్‌లాంటి దేశాలతోపాటు ఆగ్నేయ ఆసియా దేశాల్లోని వర్షారణ్యాల్లో, అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో కనిపిస్తాయి. మన గొల్లభామల్లాగే ఇవి కూడా హానికరమైనవి కావు. దీన్ని చూస్తుంటే గొల్లభామ కొత్త చిగుళ్లు వేసినట్టు ఉంది కదూ!





# గోరంత అందం..

అందం అంటే.. ఇందువదనం కనువిందు చేయడం ఒకటే కాదు.. కేశాలు మొదలుకొని కాలి గోళ్ల వరకూ.. అన్నిటి మీదా శ్రద్ధ పెట్టాల్సిందే. ముఖ్యంగా.. చేతిగోళ్లను మకుటాల్లా తీర్చిదిద్దుకుంటే.. కనిపించే తీరే వేరుగా ఉంటుంది. అయితే, బయటినుంచి ఎన్ని నెయిల్ పాలిష్‌లు రాసినా.. కొందరి గోళ్లు మాత్రం పెళుసుగా, విరిగినట్లు కనిపిస్తాయి. శరీరంలో విటమిన్లు, ఖనిజాలు, ఇతర సూక్ష్మపోషకాల లోపం ఉన్నప్పుడే.. ఇలాంటి సమస్యలు ఎదురవుతాయి. సమతుల పోషకాహారాన్ని తీసుకున్నప్పుడే.. గోళ్లు బలంగా, ఆరోగ్యంగా తయారవుతాయి.యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్లు సమృద్ధిగా ఉండే పాలకూర, బ్రొకోలి లాంటి ఆకుపచ్చని ఆహారాన్ని తీసుకుంటే.. గోళ్లు ఆరోగ్యకరంగా పెరుగుతాయి. వీటిలో లభించే ఐరన్, ఫోలేట్, కాల్షియం, విటమిన్ ఎ, విటమిన్ సి.. గోళ్లు విరిగిపోకుండా కాపాడతాయి. ఇక చిలగడదుంపల్లో బీటా కెరోటిన్ పుష్కలంగా లభిస్తుంది. ఇది గోళ్ల ఆరోగ్యంలో కీలకపాత్ర పోషిస్తుంది. సాల్మన్ చేపలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల.. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, ప్రొటీన్, విటమిన్ డి, సెలీనియంతోపాటు అనేక ఇతర సూక్ష్మపోషకాలు శరీరానికి అందుతాయి. ఇవి గోళ్లు విరిగిపోకుండా, పగుళ్లు రాకుండా చూస్తాయి. గోళ్ల పెరుగుదలను ప్రోత్సహిస్తాయి.అవకాడోలో విటమిన్ ఇ, విటమిన్ బి, ఫోలేట్‌తోపాటు అనేక సూపర్ న్యూట్రియెంట్లు ఉంటాయి. ఇవి గోళ్ల ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. అవకాడోలో ఉండే విటమిన్ ఇ.. గోళ్ల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. గోళ్లకు సహజమైన మెరుపును అందిస్తుంది. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు.. గోళ్లను నిరంతరం తేమగా ఉంచడంలో సాయపడతాయి.గోళ్లను బలోపేతం చేసే రాగి, జింక్ వంటి సూక్ష్మపోషకాలు, మాంగనీస్, విటమిన్ బి6, విటమిన్ ఇ, బి-కాంప్లెక్స్ వంటి విటమిన్లు పొద్దుతిరుగుడు విత్తనాల్లో పుష్కలంగా లభిస్తాయి. బలహీనమైన, పెళుసు గోళ్లతో బాధపడేవారు.. వీటిని తరచుగా తీసుకుంటే మంచిది.

## జేఎన్‌టీయూ వీసీగా కిషన్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): తెలంగాణ ప్రభుత్వం జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీకి వీసీని నియమించింది. వైస్ ఛాన్సలర్ గా టీ కిషన్ కుమార్ రెడ్డిని నియమించింది. వీసీ నియామకానికి సంబంధించిన ఫైల్ పై రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకం చేయడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జేఎన్‌టీయూ వీసీగా కిషన్ కుమార్ రెడ్డి.. పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. గతేడాది మే 21న ఖాళీ అయిన వర్సిటీ వీసీ పోస్టును భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా సాంకేతిక కారణాల రీత్యా నియామక ప్రక్రియ వాయిదా పడింది. తాజాగా జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీకి పూర్తిస్థాయి వీసీని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరో వైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం లో పలు యూనివర్సిటీలకు ప్రస్తుతం ఉన్న ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ల స్థానంలో రెగ్యులర్ వీసీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## మూసీపై 17 బ్రిడ్జిలను సర్వే చేయిస్తున్న ప్రభుత్వం

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): మూసీ ప్రక్షాళనకు సంబంధించి తెలంగాణ సర్కాం మరో ముందడుగు వేసింది. మూసీ బ్రిడ్జిల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టిసారించింది. మూసీపై ఉన్న 17 బ్రిడ్జిలను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సర్వే చేయిస్తోంది. నిజాం కాలంలో కట్టిన బ్రిడ్జిల పటిష్టతను ఇంజనీరింగ్ నిపుణులు పరిశీలిస్తున్నారు. రీబౌండ్ హ్యామర్ టెస్ట్, గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్, డైనమిక్ లోడ్ టెస్టింగ్‌ను సంస్థ నిర్వహిస్తోంది. నాగోల్, ఇమ్లి బండ్, ముస్లింజంగ్, నయాపూల్, పురాణాపూల్, టిప్పు ఖాన్, బాపూఘాట్, అత్తాపూర్, చాదర్ఘాట్, గోల్నాక, సాలార్జంగ్ ప్రాంతాల్లో నిర్మించిన బ్రిడ్జిలను సంస్థ ప్రతినిధులు పరిశీస్తున్నారు. బ్రిడ్జిల పటిష్టతపై మరో నెలలో ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనున్నారు. చాదర్ ఘాట్ బ్రిడ్జి హైట్ పెంచాలని నివేదికను సిద్ధం చేసింది సంస్థ. మూసీ పైనున్న బ్రిడ్జిలను వారసత్వ కట్టడాలుగా ప్రభుత్వం గుర్తించింది. అవసరం అయితేనే పూర్తిగా కూల్చి... వాటి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. మూసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మరో మూడు నెలల్లో మూసరాం బాగ్ హై లెవెల్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. దీన్ని 29.5 మీటర్ల పొడవు, 6 లేన్లతో 20 మీటర్ల క్యారేజ్ వే, 3.5 మీటర్ల ఫుట్ పాత్‌తో నిర్మాణం జరుగుతోంది. దాదాపు రూ.65 కోట్లతో ముసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.

## పకడ్బందీగా కొత్త రెవెన్యూ చట్టం అమలు

### భూభారతి విధివిధానాలు రూపొందిస్తున్నాం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): పకడ్బందీగా కొత్త రెవెన్యూ చట్టం అమలుకు భూ భారతి విధివిధానాలు రూపొందిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని ఎంసీహెచ్ఆర్డీలో రెవెన్యూశాఖ అధికారులతో సమీక్ష జరిపిన పొంగులేటి.. గత సర్కార్ హయాంలోని రెవెన్యూ చట్టంలో అన్నీ



లోపాలు,లొసుగులే ఉన్నాయన్నారు. చట్టం తీసుకొచ్చి మూడేళ్ళైనా విధివిధానాలు రూపొందించలేదన్నారు. మేధావులు,నిపుణులతో చర్చించి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టం భూ భారతిని తీసుకొచ్చిందని చెప్పారు పొంగులేటి. భూ భారతి చట్టం తరతరాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తుందన్నారు. వీలైనంత త్వరగా విధివిధానాల రూపొందించి.. భూ భారతి రెవెన్యూ చట్టాన్ని అమలు చేస్తామని తెలిపారు. భూ భారతి చట్టం పెను మార్పులు తీసుకొస్తుందన్నారు. 2024 డిసెంబర్ 20 తెలంగాణ భూ భారతి 2024 బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. జనవరి 9న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు.

## జనార్దన్‌రావు హత్య కేసులో నోరువిప్పిన నిందితుడు

### అలా అనడం వల్లే.. హత్య చేశానని వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): వెల్జాన్ గ్రూపు సంస్థల అధినేత జనార్దన్ రావు హత్య సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత మనమడే ఆయన్ను 72 సార్లు కత్తితో పొడిచి చంపేయడం తీవ్ర కలకలం రేపింది. ఈ కేసులో నిందితుడు కీర్తి తేజను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, కీర్తి తేజను నాలుగు రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. నాలుగు రోజులుగా నిందితుడిని విచారించిన హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. మొదటి రోజు కీర్తి తేజ నోరు విప్పకపోయినప్పటికీ ఆ తర్వాత హత్యకు గల కారణాలను కీర్తి తేజ పోలీసులకు వివరించాడు. పోలీస్ కస్టడీలో భాగంగా మొదటి రోజు పారిశ్రామివేత్త జనార్దన్ రావును ఎందుకు హత్య చేశావంటూ పంజాగుట్ట పోలీసులు కీర్తి తేజను ప్రశ్నించారు. రెండో రోజూ నిందితుడిని హత్య జరిగిన ఘటనా స్థలానికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్‌కు ప్రయత్నించారు. అక్కడా నోరు విప్పలేదు కీర్తి తేజ. కానీ, నిందితుడు పారిపోయిన తర్వాత మంటల్లో కాల్చివేసిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ అనంతరం మాత్రం ఎట్టకేలకు కీర్తి తేజ అసలు విషయాలు వెల్లడించాడు. యూ బెగ్గర్ అంటూ తాత జనార్దన్ రావు ప్రతిరోజూ నన్ను అవమానించేవాడు. ఏ రోజూ నన్ను సొంత మనిషిగా చూడలేదు. కుటుంబసభ్యుడిగా భావించలేదు. అందరి కంటే హీనంగా చూస్తూ దారుణంగా వ్యవహరించేవాడు. ప్రతీరోజూ బెగ్గర్.. బెగ్గర్ అంటూ పిలిచేవాడు. ఆఫీసుకు వెళ్తే అక్కడా అవమానించేవాడు. తాత అలా తిట్టడం వల్ల ఆఫీస్ స్టాఫ్ కూడా చిన్నచూపు చూసేవారు. ఆస్తి పంపకాలు, పదవుల కేటాయింపుల్లోనూ తక్కువ చేశాడు. చివరకు డైరెక్టర్ పదవినీ రెండో కుమార్తె కొడుకుకు ఇచ్చాడు. అప్పట్నుంచి నాకు, తాతకు మధ్య గొడవలు పెరిగాయి. అందుకే అతన్ని చంపేయాలని నిర్ణయించుకున్నా. ఇన్‌స్టామార్ట్ నుంచి కత్తి కొనుగోలు చేసా. బట్టలు తగలబెట్టేందుకు అమెజాన్ బ్యూటేన్ గ్యాస్ కొనుగోలు చేశా. హత్య జరిగిన రోజు నాకు, తాతకు మధ్య పెద్దఎత్తున గొడవ జరిగింది. ఆస్తిలో వాటా కావాలని అడిగితే ఇవ్వను అన్నాడు. కోపంతో కత్తితో కసితీరా పొడిచా. హత్య చేసిన తర్వాత బీఎస్ మక్తా ఎల్లమ్మగూడ పక్కనే ఖాళీ స్థలంలో కత్తి, రక్తంతో ఉన్న నా బట్టలు తగులబెట్టానని" తెలిపాడు.

## ఎస్ఐ వేధింపులు భరించలేకపోతున్నాం..

### ఆత్మహత్యకు అనుమతించండి..? ఫ్లెక్సీతో భార్యాభర్తల నిరసన

భూపాలపల్లి,ఫిబ్రవరి18(సాక్ష్యం): సాధారణంగా అప్పులు చేసి తీర్చలేకనో, లేకపోతే ప్రేమలో విఫలమయ్యాం అనో.. లేక మార్కులు తక్కువొచ్చాయని, ఫెయిల్ అయ్యామనో ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తుంటాం. కానీ ఎస్సై వేధింపులు తట్టుకోలేకపోతున్నాం.. ఆత్మహత్యకు అనుమతించండి సార్ అంటూ దంపతులు ఫ్లెక్సీతో భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే తమపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. తమకు చావే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లికి చెందిన సంది సులోచన, ప్రతాప్ రెడ్డి దంపతులకు 12 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి వెళ్లడానికి ఉన్న దారిని రెండున్నరేళ్లుగా ములుగు జిల్లా కన్నాయిగూడెం ఎస్సైగా పనిచేస్తున్న ఇనిగాల వెంకటేష్, అతడి సోదరుడు, తండ్రి కలిసి మూసివేశారని దంపతులు ఆరోపించారు. తమ సమస్యపై హైదరాబాద్ వెళ్లి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే ఆ ఎస్సై తమపై అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడేళ్ల నుంచి తమ పొలానికి వెళ్లలేక వ్యవసాయం చేయట్లేదని.. తమకు ఆత్మహత్య తప్ప వేరే దారి లేదని వాపోయారు. కనీసం ఆత్మహత్యకు అనుమతించాలని ఫ్లెక్సీతో భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట వృద్ధ దంపతులు నిరసన తెలపడంతో తెలంగాణ వ్యాప్తంగా ఈ ఘటన హాట్ టాపిక్ అవుతోంది.


## వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలి

### ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి 18 ,(సాక్ష్యం న్యూస్ ) రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ



రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగునీరు, త్రాగునీరు, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా, రైతు భరోసా, రబీ సీజన్ కు సాగునీటి సరఫరా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ వచ్చే వేసవికాలం దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని తెలిపారు. రబీ సీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు



సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటీల్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం క్రింద అర్హులైన అందరికీ పథకం అందించే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కొరకు ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన వెంటనే అర్హులైన వారందరికీ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన జడ్పీ సీఈవో నాగలక్ష్మి వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మిషన్ భగీరథ ఈ ఈ లు తిరుమలేష్, నలిని,జిల్లా విద్యుత్ శాఖ అధికారి జి. మహేందర్ , నీటి పారుదల శాఖ ఈ ఈ రాంప్రసాద్, పౌర సరఫరాల శాఖల అధికారులు త్రినాధ్ బాబు, రుక్మిణి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామి, సంబంధిత అధికారులు ,తదితరులు, పాల్గొన్నారు.

## వేసవి నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాలి

### జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్

ములుగు ప్రతినిధి ఫిబ్రవరి 18(సాక్ష్యం) వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా సమగ్ర కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు.మంగళవారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం, హైదరాబాద్ నుండి వేసవిలో త్రాగునీరు, విద్యుత్ సమస్యలు రాకుండా చేపట్టాల్సిన చర్యలు, యాసంగిలో సాగునీరు, రైతు భరోసా, సంక్షేమ వసతి గృహాలు తనిఖీ ప్రజాపాలన కుటుంబ సర్వే దరకాస్తులు ఆన్లైన్ తదితర అంశాలపై ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిపి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వచ్చే వేసవికాలంలో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది రాకుండా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మంచినీటి పైపులైన్స్ లీకేజీ లు లేకుండా అరికట్టాలని అన్నారు. ఆర్ డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు. మంచినీటి కొరత వచ్చిన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని తెలిపారు. యాసంగి పంటలకు సాగునీటి సమస్య రాకుండా ప్రాజెక్టులు, చెరువులల్లో నీటి లభ్యతను పరిశీలించాలని తెలిపారు. నిరంతరం తనికీలు నిర్వహిస్తూ అక్రమ నీటి వాడకాన్ని, నీటి వృధాను అరికట్టాలని స్పష్టం చేశారు. యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం



లేకుండా నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉ న్నట్లు తెలిపారు. క్రమం తప్పక వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మంచినీటి కొరత వచ్చిన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, స్థానిక వనరులను గుర్తించాలని తెలిపారు. లీకేజీ లు అరికట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, ఈ ఈ పి ఆర్, డి సి ఎస్ ఓ, డి ఏ ఓ, డి ఈ ఎలక్ట్రిసిటీ, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు జానపద కళారూపాలలో చిందు భాగోతం ప్రముఖమైనది

- ప్రముఖ చిందు కళాకారులు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య
- తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ, ఇండస్ బుక్ ట్రస్టు ఆధ్వర్యంలో
- ఘనంగా తెలంగాణ చిందు యక్షగాన నాటకోత్సవాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 18 (సాక్ష్యం): తెలుగు జానపద కళారూపాలలో చిందు భాగోతం ప్రముఖమైనదని, అనేకమైన అంశాలతో ప్రత్యేకత కల్గిన జానపద నాటకం శతాబ్దాలుగా ప్రజల్లో జీవిస్తున్న భారతం, భాగవతం, రామాయణం పురాణ గాథాలను సామాన్య ప్రజలకు జన రంజకంగా ప్రదర్శనలు చేస్తున్న పురాతన జానపద కళారూపం చిందు యక్షగానం అని, ప్రాచీనమైన చారిత్రక నేపథ్యం కల్గివుందని ప్రముఖ చిందు కళాకారులు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య అన్నారు. తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ, ఇండస్ బుక్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ ఆరూరి సుధాకర్ ఆధ్వర్యంలో చిందు యక్షగాన నాటకోత్సవాలు మంగళవారం మండల కేంద్రంలోని సుధ స్కూల్ లో కన్నుల పండువగా సాగాయి. చిందు యక్షగానంలో పౌరాణిక కథలతో పాటు పలు సామాజిక అంశాలపై ప్రముఖ చిందు కళాకారులు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, గడ్డం శ్రీనివాస్, గడ్డం సంజీవ, గడ్డం



రఘుపతి, గడ్డం సోమరాజు బృందాలు ప్రదర్శనలిచ్చారు. పౌరాణిక పాత్రల్లో కళాకారులు ఒదిగిపోయారు. అనంతరం పద్మశ్రీ గడ్డం సమ్మయ్య తో కలిసి డాక్టర్ సుధాకర్ కళాకారులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశంలో నిచ్చెన మెట్ల అసమానతలతో నిర్మాణమైన కుల వ్యవస్థ పైన దిక్కార స్వరం వినిపించిన ఏకైక జానపద కళారూపం చిందు భాగోతమని అన్నారు. ఈ కళారూపం తెలంగాణలో ఎంతో ప్రసిద్ధి పొందిందని, తెలంగాణ ప్రాంతంలోనే కాక మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో కూడా చిందు భాగోతం ప్రదర్శిస్తున్నారని అన్నారు. యక్ష గాన కళారూపాలను ప్రదర్శిస్తూ చిందు కళాకారులు నేటికీ ఈ కళకు జీవం పోస్తున్నారని తెలిపారు. యక్షగాన కళారూపాలు ఎంతోమందికి జీవనోపాధిని అందించడంతోపాటు ప్రజలకు విజ్ఞాన వినోదాలను అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమాల ప్రారంభానికి ముందు తెలంగాణ తల్లీ, వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిందు నాటక ప్రదర్శనాలు, కళాకారులకు సన్మానం చేసి గౌరవించుకున్నారు. వారి కళ విశిష్టత, సంప్రదాయం, సంస్కృతిని కాపాడుకోవాడానికే ప్రముఖ పరిశోధకులతో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఆచార్య భట్టు రమేష్, తాడి ప్రకాశ్ రావు, డాక్టర్ గడ్డం వెంకన్న, డాక్టర్ మార్గం లక్ష్మినారాయణ, గుడిపల్లి రవి, ఆనంద్ అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. ప్రముఖ చిందు కళాకారులు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, గడ్డం శ్రీనివాస్, గడ్డం సంజీవ, గడ్డం రఘుపతి, గడ్డం సోమరాజు బృందాలు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 18 సాక్ష్యం న్యూస్

రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఇతర ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగునీరు, త్రాగునీరు, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా, రైతు భరోసా, రబీ సీజన్ కు సాగునీటి సరఫరా, కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వచ్చే వేసవికాలం దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని తెలిపారు. రబీ సీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులలో



అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.మొదటి అంతస్తు లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. వీర బ్రహ్మచారి, జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ హాజరయ్యారు, వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని , విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు, రైతు భరోసా పథకం క్రింద అర్హులైన అందరికీ పథకం అందించే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కొరకు ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన వెంటనే అర్హులైన వారందరికీ అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ ప్రణాళిక ప్రకారం అన్ని చర్యలు చేపట్టాలని, సంబంధిత అధికారులకు సూచించారు, ఈ వీడియో కాన్ఫరెన్స్లో జెడ్పి సీఈవో పురుషోత్తం, ఎలక్ట్రిసిటీ ఎస్సిఈ నరేష్ కుమార్, డిఎస్ఓ ప్రేమ్ కుమార్, డీఈవో విజయనిర్మల, డిపిఓ హరిప్రసాద్, నీటి పారుదల, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ కవర్ల నిషేధం కోసం కఠిన చర్యలు

మమబూబ్‌నగర్,ఫిబ్రవరి18(సాక్ష్యం): 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు వాడితే రూ. 500 నుంచి రూ. 5 వేల వరకు జరిమానా విధిస్తామని కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాతు లావణ్య హెచ్చరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఆధ్వర్యంలో కొత్తూరు పాత మున్సిపల్ చైర్‌పర్సన్ తడి, పొడి చెత్త, సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ చెత్త వాహనాలకు ఇవ్వాలని సూచించారు. చెత్తను వేరుచేసి ఇవ్వడం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ 120 మైక్రాన్లు కన్నా ఎక్కువ మందం ఉన్న ఎ÷-లాస్టిక్ కవర్లను వాడాలన్నారు. ముఖ్యంగా వీధి వ్యాపారులు, దుకాణ యజమానులు ఈ విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్ సోమ్లా నాయక్, నాయకులు వీధి వ్యాపారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జైలులో ఉన్న వంశీని పరామర్శించిన వైఎస్ జగన్

అమరావతి,ఫిబ్రవరి18(సాక్ష్యం): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం ఉదయం విజయవాడ జైలు వద్దకు వెళ్లారు. రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీతో జగన్ ములాఖత్ అయ్యారు. గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో సాక్షులను బెదిరించారన్న కేసులో వంశీ అరెస్ట్ అయి జైలులో ఉన్న విషయం తెలిసిందే. జైలులో వంశీని జగన్ పరామర్శించారు. జగన్‌తో పాటు వంశీని కలిసిన వారిలో తలశిల రఘురాం, వంశీ సతీమణి పంకజశ్రీ ఉన్నారు. అయితే మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్నినానికి విజయవాడ జిల్లా జైలలోకి వెళ్లేందుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ములాఖత్‌లో వంశీని పరామర్శించేందుకు జగన్‌తో కలిసి కొడాలి నాని, పేర్ని నాని పేర్లు ఇచ్చారు వైసీపీ నేతలు. అయితే వీరిద్దరు వంశీని పరామర్శించేందుకు అనుమతి నిరాకరించారు. భద్రతా కారణాలతో పేర్ని నాని, కొడాలి నానికి అనుమతి ఇవ్వలేమన్న జైల్ అధికారులు స్పష్టం చేశారు. జగన్‌తో పాటు వంశీని కలిసేందుకు సింహాద్రి రమేష్‌ను మాత్రమే జైల్లోకి వెళ్లేందుకు అనుమతించారు పోలీసులు. వంశీని పరామర్శించేందుకు జగన్ జిల్లా జైలుకు వచ్చిన నేపథ్యంలో ఆ మార్గంలో ఎవరూ రాకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. అనప్పటికీ వైసీపీ కార్యకర్తలు మాత్రం బారికేడ్లను తోసుకుని మరీ జైలు గేటు వద్దకు చేరుకున్నారు.

## లిటిల్ లైట్స్ అనాథాశ్రమంలో అగ్ని ప్రమాదం

అమరావతి,ఫిబ్రవరి18(సాక్ష్యం): ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గన్నవరంలోని లిటిల్ లైట్స్ అనాథాశ్రమంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు చిన్నారులు గాయపడ్డారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో విద్యార్థులు నిద్రిస్తుండగా ఆశ్రమంలోని ఓ గదిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా అవి మొత్తం ఎగసి పడటంతో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. అప్రమత్తమైన సిబ్బంది పిల్లలను బటకు తీసుకొచ్చారు. విద్యార్థులు బటకు పరుగులు తీశారు. అయితే ఓ గదిలో ఆరుగురు విద్యార్థులు చిక్కుకు పోయారు. ఈ నేపథ్యంలో తలుపులు పగులగొట్టిన సిబ్బంది వారిని బయటకు తీసుకొచ్చారు. హుటాహుటిన వారిని 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు. వారికి కాలినగాయాలవడంతో వైద్యులు చికిత్స నందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు ఎలా చెలరేగాయనే విషయం ఇంకా తెలియలేదని అధికారులు వెల్లడించారు. ప్రమాద సమయంలో ఆశ్రమంలో 140 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తారకరత్న వర్ధంతి సందర్భంగా అలేఖ్య ఎమోషనల్ పోస్టు

అమరావతి,ఫిబ్రవరి18(సాక్ష్యం): నటుడు, టీడీపీ నాయకుడు నందమూరి తారకరత్న మరణించి రెండేళ్లు పూర్తయింది. 2023 జనవరి 27న యువగళం పాదయాత్రలో పాల్గొన్న ఆయన తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. గుండెపోటు రావడంతో ఆయన్ను తొలుత కుప్పంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక అంబులెన్స్‌లో బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ రెండు వారాలకు పైగా మృత్యువుతో పోరాడుతూ ఫిబ్రవరి 18న మృతి చెందారు. ఆయన ఆయన వర్ధంది. ఈ సందర్భంగా ఆయన భార్య అలేఖ్య భావోద్వేగానికి లోనయ్యారు. భర్త జ్ఞాపకాలను తలచుకుంటూ పోస్ట్ పెట్టారు. "విధి వక్రించి నిన్ను మాకు దూరం చేసింది. నువ్వు లేని లోటును ఈ లోకంలో ఏదీ పూరించదు. నిన్ను కోల్పోయిన బాధ, మనసుకి తగిలిన గాయం ఎప్పటికీ తగ్గదు. మనం ఇలా దూరం అవుతాయని ఎప్పుడూ అనుకోలేదు. నువ్వు ఇక్కడ మాతో లేకపోవచ్చు కానీ ప్రజెన్స్ మాతో అలాగే ఉంది. నువ్వు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, కలల,మా చుట్టూనే తిరుగుతున్నాయి. నీ మీద ఎప్పటికీ తగ్గని ప్రేమతో, మాటలకు మించి, కాలాన్ని దాటి, జీవితానికి మించి మిమ్మల్ని మిస్ అవుతున్నాం" అని అలేఖ్య భావోద్వేగ పోస్ట్ పెట్టారు.

## ఎపికి తోడ్పాటు ఇస్తున్న కేంద్రం: కేంద్రమంత్రి

గుంటూరు,ఫిబ్రవరి18(సాక్ష్యం): ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కారు నడుస్తోందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నడూ లేనివిధంగా గత ఏడునెలల్లో ఏపీకి కేంద్రం సహకారం అందించిందని చెప్పారు. సీఎం చంద్రబాబు కృషితోనే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు పెరిగాయన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులతో జల్‌జీవన్ మిషన్‌లో రూ.15వేల కోట్ల నష్టం వచ్చిందన్నారు. చంద్రబాబు విజ్ఞప్తితో ఆ పథకాన్ని కేంద్రం మరో ఏడాది పొడిగించిందని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు ఇప్పుడు నిధుల సమీకరణకు అడ్డంకులుగా మారాయన్నారు.

## కల్తీ నెయ్యి సరఫరాలో నలుగురి విచారణ పూర్తి

తిరుపతి,ఫిబ్రవరి18(సాక్ష్యం): శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగానికి సంబంధించిన కేసులో నలుగురు నిందితుల విచారణకు కోర్టు విధించిన కస్టడీ గడువు ముగిసింది. సిట్ తాత్కాలిక కార్యాలయంలో విచారణ అనంతరం నిందితులను రుయా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత తిరుపతి రెండవ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. ఉత్తరాఖండ్‌కు చెందిన బోలేబాబా డెయిరీ మాజీ డైరెక్టర్లు పోమిల్ జైన్, విపిన్ జైన్, వైష్ణవి డెయిరీ సీఈఓ అపూర్వ వినయకాంత్ చావడా, తమిళనాడులోని ఏఆర్ డైయిరీ ఎండీ రాజశేఖరన్‌ను 5 రోజులుగా నెయ్యి కల్తీ ఘటనకు సంబంధించి సిట్ అధికారులు విచారించారు. నిందితులు విచారణకు సహకరించలేదని, మరి కొన్ని రోజులు కస్టడీ పొడిగించాలని సిట్ కోరినట్లు తెలుస్తోంది. సోమవారం జరగాల్సిన నిందితుల బెయిల్ పిటిషన్‌పై విచారణ బుధవారం జరగనుంది.

## సజీవంగా వందల ఏళ్ల వయసున్న వ్యక్తులు

### డోజ్ డోర్ తెరిచి ఆశ్చర్యం వ్యక్తంచేసిన మస్క్

న్యూయార్క్,ఫిబ్రవరి18(సాక్ష్యం): అమెరికాలో వందల ఏళ్ల వయసున్న వ్యక్తులు ఇప్పటికీ సజీవంగా ఉన్నారన్న వార్తలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. వారిలో 200 ఏళ్ల వయసు దాటినవారు రెండు వేల మందికిపైగా ఉన్నారన్న సమాచారం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇక 360-369 ఏళ్ల వయసున్న వ్యక్తి ఒకరున్నారు. ఈ విషయాన్ని అక్కడి సోషల్ సెక్యూరిటీ డేటా విభాగం చెబుతోంది. ఈవిషయాన్ని డోజ్ అంటే డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ బృందం ధ్రువీకరించింది. తాజాగా దాని అధిపతి ఎలాన్ మస్క్ దీనిని ఎక్స్‌లో వెల్లడించారు. వందేళ్లు దాటిన దాదాపు 2 కోట్ల మంది ఇప్పటికీ సోషల్ సెక్యూరిటీ లబ్ధికి అర్హుల జాబితాలో ఉన్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి సోషల్ సెక్యూరిటీ అర్హుల జాబితా సంఖ్య అమెరికాలో ప్రస్తుత పౌరుల సంఖ్య కంటే అధికంగా ఉందని వెల్లడించారు. చరిత్రలోనే ఇది అతిపెద్ద మోసమని పేర్కొన్నారు. వాస్తవానికి 2023లో సోషల్ సెక్యూరిటీ ఆడిట్‌లో దాదాపు 18.9 మిలియన్ల మంది వందేళ్లు దాటిన వారున్నట్లు గుర్తించారు. వారు ఆదాయం పొందడం లేదా.. లబ్ధిలను స్వీకరించడం కానీ, చేయడం లేదు. అయినా ఆ జాబితాను సవరించలేదు. 112 ఏళ్ల వయసున్నవారు 65 లక్షల మంది సోషల్ సెక్యూరిటీ నెంబర్లను కలిగిఉన్నారు. కాని, వారికి సంబంధించి ఎటువంటి డెత్ ఇన్ఫర్మేషన్ నమోదు చేయలేదు. వీరంతా ఎలక్ట్రానిక్ డెత్ ఇన్ఫర్మేషన్ నమోదు వ్యవస్థ రాకముందే ప్రాణాలు కోల్పోయారు. వాస్తవానికి భూమ్మీద కేవలం 35 మంది మాత్రమే ఈ వయస్సును దాటినవారున్నారు. ఇక జనాభా లెక్కల ప్రకారం అమెరికాలో 100 ఏళ్లు దాటిన వృద్ధుల సంఖ్య కేవలం 86,000 మాత్రమే. ఇక అమెరికాలోని సోషల్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ ప్రజలకు చెందిన రిటైర్మెంట్, వైకల్యంతో బాధపడేవారికి సంబంధించిన ఆదాయమార్గాలను సమకూరుస్తుంది. అమెరికాలో ట్రెజరీ డిపార్ట్‌మెంట్ నుంచి చెల్లించిన 4.7 ట్రిలియన్ డాలర్ల (రూ.4 కోట్ల కోట్లు)కు, టాస్ (ట్రెజరీ అకౌంట్ సింబల్) లేదని డోజ్ అధిపతి ఎలాన్ మస్క్ పేర్కొన్నారు.

# రంజాన్ మాసంలో ప్రత్యేక ఏర్పాట్లు

### అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): మార్చి 2వ తేదీ నుండి ప్రారంభమయ్యే రంజాన్ మాసంలో చేయాల్సిన ఏర్పాట్ల పై డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు దిశా నిర్దేశర చేశారు. ఈ సందర్భంగా.. జీహెచ్ఎంసీ రంజాన్ నెలలో నగరంలో పరిశుభ్రత విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు.

మసీదు, ఈద్గాల వద్ద ప్రత్యేక శానిటేషన్ బృందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీధి దీపాలు మరమత్తులు, తాత్కాలిక లైట్లు ఏర్పాటు చేస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ చెప్పారు. అలాగే.. రోడ్ల మరమత్తులు పూర్తి చేస్తామని వెల్లడించారు.

మక్కా మసీద్, రాయల్ మాస్క్, మిరాలం ఈద్గా వద్ద ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. రాత్రి సమయంలో దోమల నివారణకు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ టీం ద్వారా ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని డిపా÷-టం÷-మెంట్స్ కలిపి ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించి సమన్వయం



చేస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ తెలిపారు. మసీదులు, ఈద్గాల వద్ద వాటర్ ప్యాకెట్స్ ఏర్పాటు, తాగునీటి అవసరాల దృష్ట్యా ప్రత్యేక ట్యాంకర్లు ఏర్పాటు.. మసీదులకు వెళ్లే దారిలో డ్రైనేజీల రిపేర్ పూర్తి చేస్తున్నామని వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. వేసవికాలం దృష్ట్యా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రంజాన్ నెలలో మొబైల్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ తగ్గ సప్లై ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మసీదుల వద్ద ఈద్గాల వద్ద విద్యుత్ ఎమ్మ్జ్గ÷న్సీ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మసీదుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు క్యూలైన్ల కోసం బారికేట్లు ఏర్పాటు చేయడానికి ఆర్అండ్‌బీ విభాగం సిద్ధంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. రంజాన్ నెల నేపథ్యంలో ప్రజలకు పాల ఇబ్బందులు లేకుండా ఉండడానికి అవసరాలకు తగిన పాలను సరఫరా చేస్తామని డైరీ అధికారులు తెలిపారు. ముస్లిం ఉద్యోగులకు సాయంత్రం నాలుగు గంటలకే విధులు ముగించేలా ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని జేఏడీ అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలిపారు. రంజాన్ పండగ దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా షాపింగ్ చేసుకోవడానికి ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ అర్ధరాత్రి వరకు వీధి వ్యాపారాలు కొనసాగించడానికి అనుమతించాలని పోలీస్ అధికారులను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. రంజాన్ పండుగ దృష్ట్యా ట్రాఫిక్ పేరుతో ఇబ్బందులు కలిగించకూడదని కోరారు. పండగ రోజు ట్రాఫిక్ మళ్లింపులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పండగ దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వైద్య అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని.. ఈద్గాలు, మసీదుల వద్ద హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని.. నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రంజాన్ నెలలో ముస్లిం సోదరులకు పండగ నిర్వహించుకోవడానికి సమయానికి రేషన్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## అమెరికా ఫస్ట్ విధానంతో.. పట్టు బిగించే యత్నం

### ప్రపంచం మీద పెద్దన్న పెత్తనం కోసం ట్రంప్ వెంపర్లాట

వాషింగ్టన్,ఫిబ్రవరి18 : రెండోసారి ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాక ప్రపంచం మీద అమెరికా ఆధిపత్యం సాధించాలన్న పట్టుదల కనిపిస్తోంది. అక్రమ వలసదారులను నిర్దాక్షిణ్యంగా ఏరిపారేయడం,



సుంకాలు పెంచడం, వివిధ దేశాల్లో జోక్యం చేసుకోవడం వంటివన్నీ ఆయన దూకుడు వ్యవహారాన్ని కనబరుస్తున్నారు. వీసా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని చూస్తున్నాడు. తమగడ్డపై పిల్లను కంటే అమెరికా పౌరసత్వం రాకుండా ఆదేశాలు ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రకాలుగా నిర్ణయాలు తీసుకుంటున్నాడు. మాటల్లో, చేతల్లో తన లక్ష్యం ఆధిపత్యం అన్నది స్పష్టంగా కనిపిస్తున్నది. ఎక్కడా కూడా అయన రాజీ ధోరణి వ్యక్తం చేయడం లేదు. సుంకాల తగ్గింపు కుదరదని మోడీకి మొహం మీదే చెప్పేశాడు. తన దేశ హితమే ముందు అన్న విధంగా అమెరికా ఫస్ట్ సిద్ధాంతాన్ని ప్రకటించుకున్నాడు. అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింతగా బలోపేతం చేసేందుకు వాణిజ్యం మీద దృష్టి సారించినట్లుగా కనిపిస్తున్నది. ప్రధానంగా సుంకాల మీద దృష్టి కేంద్రీకరించాడు. ఒకవైపు ఉక్రెయిన్, రష్యా యుద్ధం ఆపాలని కోరుతూనే, గాజాపై కబ్జాకు ఉపక్రమించే పరిస్థితి చూస్తున్నాం. దశాబ్దాలుగా భారతదేశంలో ఇతర దేశాల జోక్యం అంగీకరించని ఇండియాకు చైనాతో ఉన్న వివాదం పరిష్కరిస్తామని కూడా పేర్కొన్నాడు.

గతంలో ఒబామా కాలంలో ఇదే విషయం ప్రస్తావనకు వస్తే, అప్పటి పీఎం మన్మోహన్ సింగ్ సున్నితంగా తిరస్కరించారు. ఏ దేశంతోనైనా నేరుగా చర్చించి తన సమస్యను తాను పరిష్కరించుకునే సత్తా ఇండియాకు ఉందని తెలిపారు.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'గాజా' మీద ఇజ్రాయెల్ యుద్ధాన్ని అక్కడి ప్రధాని నెతన్యాహును ఒప్పించి ఆపించానని చెప్పాడు. షరతుల ప్రకారం హమాస్ వద్ద, అటు ఇజ్రాయెల్ వద్ద ఉన్న ఇరుపక్షాల ఖైదీలను విడతలవారీగా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గాజా మీద యాజమాన్య హక్కు తనకు ఉంటుందని అక్కడ సముద్రపు ఒడ్డున రిసార్టులు, ఇతర ఏర్పాట్లు చేస్తామని, అందుకు గాజాను ఖాళీ చేయాలని ట్రంప్ తెలిపాడు. ట్రంప్ ప్రకటన నెతన్యాహుకు ఆమోదమే. ఎందుకంటే గాజా నుంచి జనాన్ని ఖాళీ చేయించడమే ఆయన లక్ష్యం. ఇక్కడ వీరిద్దరి ఉద్దేశం ఒక్కటే అని తేలిపోయింది. క్రమంలో హమాస్ తమ వద్ద ఉన్న, అఖరి ఆయుధమైన ఖైదీల విడుదల విషయంలో కొంత ఆలస్యం చేయడమేకాక యుద్ధం, దాడులు మళ్ళీ గాజా ఖాళీ చేయించే విషయంలో నెతన్యాహు, ట్రంప్ కలిసి దాడి చేసే అవకాశం ఉందని అప్రమత్తం అవుతున్నట్టు కనిపిస్తోంది. మరోవైపు తాము గాజా విడిచి ఎటు పోతామని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి 15న హమాస్ నిర్బంధంలో ఉన్న ఇజ్రాయెల్ ఖైదీలను విడుదల చేయాలని ట్రంప్ వార్నింగ్ జారీ చేశాడు. దీంతో మళ్ళీ గాజా మీద దాడి తప్పదా అనే పరిస్థితి నెలకొన్నది.కొన్నిచోట్ల దాడులు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే గాజాలో పాలస్తీనీయులు వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. 92 శాతం గృహాలు, 70 శాతం పెద్ద భవనాలు, ఆసుపత్రులు నేలమట్టం అయ్యాయి. నిరాశ్రయులు ఉండడానికి షెల్టర్ లేదు. గాజా పునర్‌నిర్మాణానికి పదిహేను ఏండ్లకు పైగా పడుతుంది. అయితే, యుద్ధం, బాంబుల వల్ల భూమి పనికి రాకుండా అయ్యిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో గాజాను కబ్జా చేసే పనిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నాడు. అయితే, తాజాగా ట్రంప్ మాటలను చైనా ఖండిస్తూ ముమ్మాటికీ గాజా పాలస్తీనా ప్రజలదే అని పేర్కొంది. ట్రంప్ ఆలోచన ప్రపంచ దేశాలలోని మెజారిటీ ప్రజలు విమర్శిస్తున్నారు. మొత్తానికి ట్రంప్ వ్యవహారం ప్రపంచంపైన ఆధిపత్యం సాధించే దిశగా కొనసాగుతోంది. వాణిజ్యంలోనూ అమెరికా నవంబర్ వన్?గా రాణించాలని తహతహలాడుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు ఏం చేస్తాయో వేచిచూడాలి.

## పార్టీలు చెబితే రైతులు ధర్నాలు చేయరు

### బిసి కులగణన గతంలో ఎప్పుడూ చేయలేదు
### రాష్ట్రంలో వందశాతం సక్రమంగా కులగణన
### మీడియాతో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): రాజకీయ పార్టీలు చెబితే రైతులు ధర్నాలు చేయరని శాసనమండలిలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మరోవైపు రాష్ట్రంలో ప్రభుత్వం 100 శాతం కులగణన సర్వే పర్ఫెక్ట్ చేసిందని తెలిపారు. అసలు కులగణన మీద బీసీల జనాభాపై లెక్క ఎక్కడ ఉంది.. దేశంలోనే ఇదే మొదటిసారి బీసీ కులగణ చేసిందని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గుత్తా సుఖేందర్ రెడ్డి చిట్ చాట్ నిర్వహించారు. కేటీఆర్ రైతు దీక్షపై కౌంటర్ ఎటాక్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతు దీక్షలు చేస్తున్నారని ఆరోపించారు. కరెంట్ కట్ అయినా.. ట్రాన్స్ఫార్మర్ కాలిపోయిన రైతులే రోడ్డెక్కుతారు.. సమగ్ర కుటుంబ సర్వే ఆఫిషియల్ రికార్డు లేదు.. బీసీ కులగణన సర్వే సరైనదని తెలిపారు. నాయకుడికి కులం, మతంతో సంబంధం ఉండదు.. ప్రజలతో మమేకమైన వాడే నాయకుడు అవుతాడని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మరోవైపు.. బీజేపీ బీసీ కులగణకు వ్యతిరేకమని అందరికి తెలిసిందే.. వ్యవస్థలపై గౌరవం తగ్గుతున్న మాట వాస్తవమే.. రాజకీయం, ప్రభుత్వ సంస్థలు ఇతర వ్యవస్థలపై సైతం నమ్మకం తగ్గుతుందని ఆయన ఆరోపించారు. కాగా.. ఉచితాలపై ఒక కఠినమైన చట్టం రావాల్సిందేనని అన్నారు. కేసీఆర్ త్యాగాలు చేసింది నిజమే.. తెలంగాణ ఉద్యమం నడిపించింది వాస్తవమే.. కానీ 4 కోట్ల ప్రజలు హీరో అంటే.. మరి ఎన్నికల్లో 4 కోట్ల ప్రజలు ఓట్లు వేయలేదు కదా?! అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నువ్వు నేను కోరుకుంటే ఎన్నికలు రావు.. ప్రభుత్వం పడిపోతుంది అంటే అది అధికారం కోల్పోయిన బాధలో మాట్లాడుతున్నారని ప్రజలు అనుకుంటారు.. ఈ ప్రభుత్వ పాలన పర్వాలేదని గుత్తా తెలిపారు. జమిలి ఎన్నికలపై గుత్తా సుఖేందర్ రెడ్డి స్పందిస్తూ.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు కలిసి వస్తే పార్టీలపై, ప్రభుత్వంపై, అభ్యర్థులపై భారం తగ్గుతుందని అన్నారు. ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో ఒక గ్రాడ్యుయేట్, రెండు టీచర్స్ ఎమ్మెల్సీకి ఎన్నిక జరుగుతుందని చెప్పారు. ఉన్న ఓటర్లే తక్కువ.. ఎన్నికల కోడ్, ప్రభుత్వ పరిపాలనపై ప్రభావం చూపిస్తోందని తెలిపారు. కోడ్ ప్రభావం చూపకుండా చర్యలు తీసుకోవాలని ఈసీకి లేఖ రాశానని చెప్పారు.

## అర్థంపర్థంలేని హామీలతో సీఎం గందరగోళం

### వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు
### ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): అర్థంలేని హామీలతో సీఎంరేవంత్ ఆయన గందరగోళానికి గురికావడమే కాకుండా, ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ అభ్యర్థి సరోత్తం రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఈటెల రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బీజేపీకి మద్దతు పలుకుతున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీలు ఏమయ్యాయని




ప్రశ్నించారు. పీఆర్సీ ఏమైంది... డీఏలు ఏమయ్యాయని నిలదీశారు. సీపీఎస్ విధానంపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నారని అడిగారు. గతంలో యూటీఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తే ఓరిగింది ఏమీ లేదని విమర్శించారు. బీజేపీ పాలనలో దేశం సుభిక్షమని.. అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందన్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీకి ఓటు వేస్తామని ఉపాధ్యాయులు చెబుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయలకు అండగా ఉంటామని.. సమస్యల పరిష్కారానికి కొట్లాడతామని స్పష్టం చేశారు. కులాన్ని విస్మరించలేమని.. కుల గణన జరగాలన్నారు. కాంగ్రెస్‌కు నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే అధికారికంగా లెక్కలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రతి నిర్ణయం బూమరాంగ్ అవుతోందన్నారు. 2011 జనాభా లెక్కలకు ఇప్పటి లెక్కలకు పొంతన లేకుండా చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని.. డ్రామా కంపెనీలా చేయవద్దని హితవుపలికారు. ఈ దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఈ దేశంలో ఎన్నడైనా ఎక్కడైనా కాంగ్రెస్ బలహీన వర్గాలకు పదవులు కట్టబెట్టిందా అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో లేదా ఇప్పుడు బలహీన వర్గాలకు చెందిన నేతలు ముఖ్య మంత్రులయ్యారా అని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకుకి సిద్ధంగా ఉందని వెల్లడించారు. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, లగచర్ల భూములు ఇలా ప్రతి విషయంలోనూ రేవంత్ ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. రాబోయే రోజులలలో కాంగ్రెస్ ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, కొట్లాడతామని ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.

## ఢిల్లీని వెనక్కి నెట్టిన హైదరాబాద్

### పెరుగుతున్న అంతర్జాతీయ పెట్టుబడులు
### గ్రామీణ ప్రాంత ప్రజలూ నగరబాట..

హైదరాబాద్,ఫిబ్రవరి18(సాక్ష్యం): హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెడుతున్నాయి. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు హైదరాబాద్‌లో సెటిల్ అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూడా నగరబాట పడుతున్నారు. నగరంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉండంటతో సిటీలో సెటిల్ అయ్యేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. దీంతో హైదరాబాద్ నగర జన సాంద్రత పెరిగుతోంది. జన సాంద్రత విషయంలో తాజాగా దేశ రాజధాని ఢిల్లీని హైదరాబాద్ వెనక్కి నెట్టింది. తెలంగాణ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్-2024 నివేదిక గణంకాలు వెల్లడించింది. నగరంలో చదరపు కిలోమీటరుకు 18,161 మంది జనాభా సాంద్రత ఉన్నట్లు వెల్లడించింది. ఈ సంఖ్య రాజధాని ఢిల్లీలో చదరపు కిలోమీటరుకు 11,313 మాత్రమే ఉన్నట్లు పేర్కొంది. జన సాంద్రత విషయంలో ఇండియాలో ముంబై తొలి స్థానంలో ఉంది. అక్కడ చదరపు కిలోమీటరుకు 28,508 ఉన్నట్లు గణాంకాల ద్వారా వెల్లడైంది. ప్రపంచంలో అత్యంత జనసాంద్రత కలిగిన నగరంగా ఫిలిప్పీన్స్‌లోని మనీలా నిలిచింది. అక్కడ ఒక చదరపు కిలోమీటరులో 43,079 మంది నివసిస్తున్నారు. అయితే వేగవంతమైన



పట్టణీకరణ ఓ సవాల్ లాంటిదేనని నిపుణులు అంటున్నారు. అది రెండు వైపులా పదును ఉన్న కత్తి లాంటిందని చెబుతున్నారు. జనాభా పెరుగుదలతో ఓ వైపు హైదరాబాద్ నగరం వృద్ధి పథంలోకి వెళ్తున్నా.. అదే సమయంలో అందుకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించటం ప్రభుత్వానికి శక్తికి మించిన పని అంటున్నారు. పెరగుతున్న జనాభా మౌళిక సదుపాయాలు, ప్రజా సేవలు, ఇండ్ల నిర్మాణంపై ఒత్తిడిని పెంచుతాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. ఓ వైపు హైదరాబాద్ నగరంలో జన సాంద్రత పెరుగుతుండగా.. తెలంగాణలో మాత్రం పరిస్థితి వేరుగా ఉంది. 2011 జనాభా లెక్కల డేటా ప్రకారం.. రాష్ట్ర జనాభా 3.5 కోట్లుగా ఉంది. తెలంగాణ మొత్తం 1,12,077 చదరపు కిలోమీటర్ల భౌగోళిక విస్తీర్ణాన్ని కలిగి ఉంది. చదరపు కిలోమీటరుకు 312 మంది జనాభా సాంద్రతను కలిగి ఉంది. 2031 నాటికి ఇది మరింత తగ్గే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో యువ జనాభా కూడా తగ్గుతున్నట్లు అంచనా వేస్తున్నారు. 2031 నాటికి 39 ఏళ్ల వయస్సు లోపు ఉన్నవారి జనాభా 0.23 శాతం తగ్గే ఛాన్స్ ఉందని అంటున్నారు. అదే సమయంలో 40 ఏళ్లు పైబడిన వారి సంఖ్య పెరుగుతుందని.. దీని కారణంగా రాష్ట్రంలో వృద్ధ జనాభా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ అంశం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది.

## గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులోకి ..

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,ఫిబ్రవరి 18,( సాక్ష్యం న్యూస్)
గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులోకి వస్తాయని విద్యానగర్ కాలనీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు, కార్యదర్శి సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం నూతన గ్రంథాలయ భవనాన్ని సందర్శించి అందుబాటులోనికి తెచ్చిన సదుపాయాలు సౌకర్యాలపై స్పందించారు. ఈ సందర్భంగా వారు





మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా కార్పొరేట్ స్థాయిలో చక్కటి వాతావరణం ఆహ్లాదకరమైన పరిస్థితుల నడుమ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కూర్చుని చదువుకునేందుకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తేవడం గమనార్హం అన్నారు. గ్రంథ పాలకురాలుగా పనిచేస్తున్న మణి మృదుల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి అనునిత్యం అందుబాటులో ఉంటూ సహకారం అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ మధ్యకాలంలో గ్రంథాలయం పై ఆధారపడి చదివిన అనేకమంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం వెనుక గ్రంథ పాలకురాలి కృషి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని తెలిపారు. గతంలో మాదిరిగానే నూతన గ్రంథాలయానికి కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని, పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి విశ్రాంత ఉద్యోగుల తరఫున సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి కేశవరావు, రాములు, శివరామకృష్ణ, గురుమూర్తి, సాంబయ్య, కామేశ్వరరావు ,తదితరులు , పాల్గొన్నారు.

## పదోన్నతి బాధ్యతను పెంచుతుంది

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**
**జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి**

మెదక్ జిల్లా ప్రతినిధి 18 ఫిబ్రవరి సాక్ష్యం:
పదోన్నతి పొందిన ఉద్యోగులు జిల్లా కలెక్టర్కు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరిని కలెక్టర్ అభినందించారు. కలెక్టర్



రెవిన్యూ ఉద్యోగులను ఉద్దేశించి పలు సూచన చేస్తూ పదోన్నతి బాధ్యతను పెంచుతుందని వృత్తినే దైవంగా భావించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని చెప్పారు. కలెక్టరేట్ కార్యాలయంలో 04 జిల్లాలో వివిధ కార్యాలయంలో పనిచేస్తున్న 11 మందికి జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించగా, కామారెడ్డి సిద్దిపేట జిల్లాలకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ పదోన్నతి పొందిన ఉద్యోగులు ఉన్నారు.

## అడ్డగోలుగా వాహనాల పార్క్

నారాయణఖేడ్ ఫిబ్రవరి 18 (సాక్ష్యం న్యూస్ ):
నారాయణఖేడ్ మున్సిపాలిటీలోని శివాజీ చౌక్ సమీపంలో ఎస్బీఐ బ్యాంక్ వద్ద రోడ్డుపై వాహనాలను అడ్డగోలుగా పార్క్ చేయడం వల్ల






ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంక్ వద్ద అనుమతించని విధంగా వాహనాలను నిలిపేయడం సమస్యగా మారింది. ఈ సమస్యను ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి, సంబంధిత అధికారులు దీనిపై తక్షణమే స్పందించి సరైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో ( సాక్ష్యం న్యూస్ ):
రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఇతర ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు , అదనపు కలెక్టర్లు , జిల్లా అధికారులతో సాగునీరు, త్రాగునీర్లు, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా , రైతు భరోసా , రబీ సీజన్ కు సాగునీటి సరఫరా , యూరియా కొరత , రేషన్ కార్డుల జారీ , రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వచ్చే వేసవికాలం దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని తెలిపారు. రబీ సీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా




ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. మొదటి అంతస్తు లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. వీర బ్రహ్మచారి, జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ హాజరయ్యారు, వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని , విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు, రైతు భరోసా పథకం క్రింద అర్హులైన అందరికీ పథకం అందించే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కొరకు ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన వెంటనే అర్హులైన వారందరికీ అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ ప్రణాళిక ప్రకారం అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వివిద జిల్లాల జెడ్పి సీఈవో , ఎలక్ట్రిసిటీ ఎస్సిఈ , డిఎస్ఓ ప్రేమ్ కుమార్, డీఈవో , డిపిఓ, నీటి పారుదల, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహాశివరాత్రి ఆహ్వాన పత్రిక

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 18, (సాక్ష్యం):
వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి 27 వరకు ఎంతో వైభవోపేతంగా నిర్వహించే మహా



శివరాత్రి జాతర వేడుకలకు రావాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రులు శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్,కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ఎమ్మెల్సీ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ,ఎమ్మెల్యే లకు రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్,ఆలయ అర్చకులు,అధికారులు మహాశివరాత్రి ఆహ్వాన పత్రికను మంగళవారం అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాజన్న ప్రసాదం అందజేసి వేదో ఆశీర్వచనం అందజేశారు.

### ఆలయ విస్తరణ పనులపై సీఎం ఆరా

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీయగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో లాగా పనుల్లో జాప్యం చేయకుండా ఆలయం విస్తరణ పనులను వేగవంతం చేయాలని, రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేములవాడ ప్రజలు రాజన్న భక్తులు ఎంత కాలం నుంచి ఎదురు చూస్తున్నా రోడ్డు వెడల్పుకు సంబంధించి భూ సేకరణ కోసం నిధులు విడుదల చేయాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

### మహాశివరాత్రికి ఘనంగా ఏర్పాట్లు చేయాలి

మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. భక్తులకు శీఘ్ర దర్శనం, క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తాగునీటి వసతి, చలువ పందిళ్ళు తదితర ఏర్పాట్లు ముమ్మరం చేసి రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పించి మహాశివరాత్రి జాతర ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో కే వినోద్, ఏఈఓ బ్రహ్మన్న గారి శ్రీనివాస్,అర్చకులు చంద్రగిరి శరత్, గోపన్న గారి చందు, మామిడిపల్లి శరత్,వెంకన్న తదితరులు ఉన్నారు.

## ముగిసిన జర్నలిస్టు సత్యం అంత్యక్రియలు

**-అంతిమ యాత్రలో పాల్గొన్న జర్నలిస్టులు**
**-నివాళులర్పించిన టీబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నేతలు మామిడి సోమయ్య,బండి విజయ్ కుమార్**

వేములవాడ,ఫిబ్రవరి 18(సాక్ష్యం):
గుండె పోటుతో మృతి చెందిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వేములవాడ కమిటీ ఉపాధ్యక్షుడు గోగికార్ సత్యం అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం వేములవాడలో ముగిశాయి. హైదరాబాద్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందిన సత్యం భౌతిక కాయాన్ని ఆయన స్వగ్రామం వేములవాడకు తరలించారు. సత్యం అంతిమ యాత్ర





మధ్యాహ్నం వేములవాడలోని ఆయన నివాసం నుంచి స్మశాన వాటిక వరకు జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ సత్యం భౌతిక కాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సత్యం అంతిమ యాత్రలో వేములవాడ కు చెందిన పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య,ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు ఎండీ యూసుఫ్, రాజన్న-సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పరుక రవి,నాయకులు ఎండీ షరీఫ్, తౌగరి కరుణాకర్, నడిగట్ల బిక్షపతి తదితరులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

## సింగరేణి సేవా సమితి స్టాల్ కు ద్వితీయ బహుమతి

### అభినందనలు తెలిపిన సీఎండీ

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి 18, సాక్ష్యం న్యూస్)
నుమాయిష్ లో సింగరేణి సేవా సమితి స్టాల్ కు బహుమతి లభించిందని సింగరేణి సంస్థ చైర్మన్ సిఎండి ఎన్ బలరాం అభినందనలు తెలిపారు.మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నాంపల్లిలో జరిగిన 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) లో సింగరేణి సేవా సమితి ఏర్పాటు చేసిన మహిళా శక్తి మార్కెట్ స్వయం ఉపాధి ఉత్పత్తుల స్టాల్కు ద్వితీయ బహుమతి లభించిందన్నారు. నుమాయిష్ లో మొత్తం 2200కు పైగా స్టాల్స్ను ఏర్పాటు చేయగా ప్రభుత్వ విభాగంలో సింగరేణి సేవా సమితి స్టాల్కు బహుమతి లభించింది. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. స్టాల్ డెకరేషన్, వస్తు విక్రయాలు జరుగుతున్న తీరు, సందర్శకుల అభిప్రాయాలు తదితర అంశాలను పరిశీలించిన న్యాయ నిర్ణేతలు ఉత్తమ స్టాల్స్ను ఎంపిక చేసినట్లు సొసైటీ నిర్వాహకులు వెల్లడించారు. నుమాయిష్ లో ప్రదానం చేసిన బహుమతిని ఈడీ మార్కెటింగ్,జీఎం కో ఆర్డినేషన్,సింగరేణి సేవా సమితి ఉపాధ్యక్షులు ఎస్డి.ఎం.సుభానీ, పీఆర్వో , సేవా సమితి కో ఆర్డినేటింగ్ అధికారి శ్రీకాంత్ , సీఎండీ ఎన్.బలరామ్ కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ. సింగరేణి స్టాల్కు బహుమతి ద్వారా గుర్తింపు రావడం అభినందనీయమన్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లోనూ మహిళల స్వయం ఉపాధి కోసం సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణలు అందజేస్తున్నామన్నారు. స్వయంగా యూనిట్లు ఏర్పాటు చేసుకున్న మహిళల వస్తువులను విక్రయించేందుకు వీలుగా హైదరాబాద్ నుమాయిష్ లో ప్రతీ





ఏటా స్టాల్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇదే కాకుండా ఉప్పల్ శిల్పారామంలోనూ సేవా సమితి స్టాల్ ద్వారా సేవా ఉత్పత్తులను విక్రయించేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నిరుద్యోగ యువతీ యువకులకు కూడా సంస్థ తరఫున వృత్తి శిక్షణలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. 45 రోజుల పాటు సాగిన నుమాయిష్ లో సింగరేణిని లోని 10 ఏరియాలకు చెందిన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దాదాపు 6 లక్షలకు పైగా విలువ చేసే క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగ్లు, మగ్గంపై తయారీ చేసిన ఉత్పత్తులను విక్రయించారు. తమకు గత 20 ఏళ్లుగా నుమాయిష్ లో స్టాల్స్, హైదరాబాద్ లో వసతి ఏర్పాటు చేస్తున్న సింగరేణి యాజమాన్యానికి సేవా సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఈటెల రాజేందర్ కు ఘన స్వాగతం పలికిన బిజెపి రాష్ట్ర నాయకులు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 18 సాక్ష్యం న్యూస్:
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ లో ఈటెల రాజేందర్ కు ఘన స్వాగతం పలికిన బిజెపి రాష్ట్ర నాయకులు కార్గిల్ రాంబాబు ,మహేష్ గౌడ్ అనంతరం ఈటెల రాజేందర్. జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని మల్కాజిగిరి ఎంపీ





ఈటల రాజేందర్ కోరారు. మరిపెడలోని ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులను ఆయన కలిశారు. రానున్న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, రాంచందర్రావు, కార్గిల్ రాంబాబు, యాప సీతయ్య, చీకటిమహేశ్ గౌడ్, ప్రవీణ్, మరిపెడ మండల బిజెపి అధ్యక్షుడు గంగాధర్, మరిపెడ మున్సిపాలిటీ అధ్యక్షురాలు మంగమ్మ, లింగం, బింగి రమేష్, పెంటయ్య, హుస్సేన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## టోరంటో విమానాశ్రయంలో బలమైన గాలులు

### తలకిందులైన విమానం: 18మందికి గాయాలు

టోరంటో,ఫిబ్రవరి18(సాక్ష్యం):
కెనడాలో మరో విమాన ప్రమాదం చోటు చేసుకుంది. టొరంటోలోని పియర్సన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డెల్టా ఎయిర్లైన్స్కు చెందిన విమానం.. ల్యాండ్ అయిన తర్వాత అదుపు తప్పి బోల్తా పడింది. బలమైన గాలుల కారణంగా ఫ్లైట్ ల్యాండింగ్లో సమస్యలు ఏర్పడి ఏకంగా తలకిందులైపోయింది. ఈ ప్రమాదంలో 18 మంది వరకు గాయపడగా.. ఇందులో మరో ముగ్గురు ప్రయాణికుల పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. సోమవారం నాడు ఈ ఘటన జరిగింది. మిగతా 12 మందికి స్వల్ప గాయాలయ్యాయని పీల్ రీజినల్ పారామెడిక్స్ సర్వీసెస్ వెల్లడించింది. అయితే, ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని హెలికాప్టర్ అంబులెన్స్లో తక్షణమే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ప్రమాదం జరిగినపుడు విమానంలో సుమారు 80 మంది ప్యాసింజర్లు ఉన్నారు. మిన్నియాపోలిస్ నుంచి వచ్చిన డెల్టా ఎయిర్లైన్స్ విమానం ప్రమాదానికి గురైందని పియర్సన్ ఎయిర్పోర్టు ఎక్స్ వేదికగా చేసిన ఒక పోస్టులో ఈ విషయాన్ని ధృవీకరించింది. ఫ్లైట్ తిరగబడి ఎయిర్పోర్టులో పడి ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

## రెడ్‌క్రాస్ సేవలు మరింతగా విస్తరించాలి

### నూతన కార్యవర్గానికి గవర్నర్ అభినందనలు

విజయవాడ,బ్రవరి18(సాక్ష్యం): రాష్ట్రంలో రెడ్ క్రాస్ సేవలు మరింత బలోపేతం చేయాలని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖకు నూతన చైర్మన్‌గా ఎన్నికైన వై.డి రామారావు, కోశాధికారిగా ఎన్నికైన పి.రామచంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఏకే పరిడాతో కలిసి మర్యాదపూర్వకంగా రాజ్ భవన్‌లో గవర్నర్‌ని కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... ఏపీలో 20 రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతున్నాయని, రాబోయే రోజుల్లో అన్ని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లను ఆధునికీకరించి ఇంకా మెరుగైన సేవలను అందించాలని సూచించారు.
దేశంలోనే తొలిసారి సింగల్ యుజ్ ఎ÷–లాస్టిక్ రహిత సమాజం ఏర్పాటే ధ్యేయంగా రెడ్ క్రాస్ గుంటూరు శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 'వార్ ఆన్ సింగిల్ యుజ్ ఎ÷–లాస్టిక్' పైలట్ పాజెక్ట్‌ను మార్చి నెలలో తాను గుంటూరులో ప్రారంభిస్తానని గవర్నర్ తెలిపారు. విజయవాడలో రెడ్ క్రాస్ భవన నిర్మాణం వెంటనే చేపట్టాలని ఆదేశించారు. చైర్మన్ గా ఎన్నికైన రామారావు, కోశాధికారిగా ఎన్నికైన రామచంద్రరాజును ఈ సందర్భంగా గవర్నర్ అభినందించారు. వారి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ చేపట్టబోయే అన్ని సేవా కార్యక్రమాలకు తన సహాయ, సహకారాలు అందజేస్తానని గవర్నర్ తెలిపారు.

## విభజన సమస్యల పరిష్కారానికి ఇదే సమయం

### గట్టిగా పట్టుబడితే కేంద్రం ఇచ్చి తీరుతుంది
### ఇది పవన్ కళ్యాణ్‌కు మాత్రమే సాధ్యం
### మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్

రాజమండ్రి,ఫిబ్రవరి18(సాక్ష్యం): ఏపీకి పవన్ కల్యాణ్ ఆశాజ్యోతిగా కనిపిస్తున్నారని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడిన ఉండవల్లి.. . ఇప్పుడు రాష్ట్ర అవసరాలు, విభజన హామీలు సాధించుకోవడానికి మంచి అవకాశాలు ఉన్నాయి.. మన రాష్ట్రం మీద ఆధారపడి కేంద్రం వుంది. ఇదే అదును.. ఇప్పుడే డిమాండ్స్ సాధించుకోవాలి.. కాంగ్రెస్ ప్రభుత్వం అయితే లా ప్రకారం వెళ్తుందనే నమ్మకం నాకుంది.. కానీ, విభజన సమయంలో కాంగ్రెస్ తప్పు చేసిందన్నారు.. ఇక, మంచి ఐడియల్ సమయం ఇది.. చంద్రబాబు టాక్టిక్స్ ఏ వ్యక్తికి ఎవ్వరికీ ఉండరు.. ముక్కుసూటిగా వెళ్లే వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఆయన తలచుకుంటే విభజన సమస్యలు పరిష్కారం అవుతాదనే నమ్మకం నాకుంది.. దీనిపై పవన్ కు లేఖ కూడా రాశాను అని వెల్లడించారు.. విభజన హామీలో 75 వేల 50 కోట్లు రాష్ట్రానికి రావాలి.. దీనిపై పార్లమెంటులో ప్రస్తావించమని కోరాను అన్నారు ఉండవల్లి.. కేంద్రంతో పవన్ కల్యాణ్ మాట్లాడితే పరిష్కారం వుంటుందన్న ఆయన.. పవన్ కల్యాణ్ సాధిస్తారనే నమ్మకం ఉంది.. ఇందులో సాధించడానికి లోక్‌సభకు నోటీసు ఇవ్వాలి.. నోటీసు ఎలా ఇవ్వాలో కూడా లేఖలో పేర్కొన్నాను.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దీనిపై చర్చించదానికి సిద్ధం అని చాలా సార్లు చెప్పారు .. రాష్ట్ర ప్రభుత్వం తరపున పార్లమెంటులో చర్చించే నిర్ణయం తీసుకోవాలి.. విభజన బిల్లు పార్లమెంటులో ఆమోదం చేసిన రోజు ఇదే.. 1 లక్ష 42 వేల 600 కోట్లు ఇంకా పంచలేదు. 42 శాతం వాటా తెలంగాణకు వెళ్తుందన్నారు.. ప్రభుత్వ రంగ సంస్థలు విభజించ లేదు.. ఎందుకో ఆశ పవన్ కల్యాణ్ మీద వుంది.. గతంలో విభజన హామీలు పై పవన్ ఫాక్ట్ ÷రైడింగ్ కమిటీలో 2 గంటలు చర్చించాం.. పవన్ స్పందిస్తే దీని మీద సుప్రీం కోర్టు లో వున్న విభజన కేసులకు తాను తిరగడం తగ్గుతుందన్నారు.. ఇక, తాను పవన్ కల్యాణ్ గురించే మీడియా సమావేశం ఏర్పాటు చేశానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్..

## విద్యారంగంలో సమూల మార్పులకు యోచన

### స్కిల్స్ పెంచేలా పాఠ్యాంశాల్లో మార్పులు
### సింఘానియా స్కూల్స్‌తో ఒప్పందంలో మంత్రి లోకేశ్

అమరావతి,ఫిబ్రవరి18(సాక్ష్యం): విద్యార్థుల్లో స్కిల్స్ పెంచేలా విద్యావిధానంలో మార్పులకు కృషి చేస్తున్నామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్



శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అందుకు అనుగుణంగా మార్పులు చేస్తున్నామని అన్నారు. ఏపీలో విద్యారంగాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అమలు చేస్తోన్న మూస పద్ధతులకు స్వస్తి చెప్పి సృజనాత్మకత పెంపొందించేలా కేజీ టు పీజీ విద్య కరిక్యులమ్‌లో సమూల మార్పులు తెస్తున్నామన్నారు. కళాశాల నుంచి బయటకు వచ్చే విద్యార్థికి వెనువెంటనే ఉద్యోగం లభించేలా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. జాతీయ విద్యావిధానం లక్ష్యసాధనలో భాగంగా రాష్ట్రంలో విద్యానైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్ట్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఏపీ ప్రభుత్వంతో సింఘానియా గ్రూప్, ఏపీ ప్రభుత్వ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, నాణ్యత, ఉపాధ్యాయ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణతో పాటు జాతీయ విద్యావిధానంతో సమాంతరంగా సాంకేతికత అనుసంధానం వంటి అంశాల్లో విద్యా నైపుణ్యాన్ని తీసుకురావడం ద్వారా పాఠశాలల నిర్వహణలో మార్పులు తేవాలని నిర్ణయించారు. ఐదేళ్ల వ్యవధిలో అమలుచేసే ఈ కార్యక్రమం ద్వారా లక్ష మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందనుంది. ఆ తర్వాత అమరావతి, విశాఖపట్నం, కాకినాడకు కూడా ట్రస్ట్ సేవలను విస్తరించ నున్నారు. విద్యార్థులను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యవంతంగా తయారు చేయడమే లక్ష్యమని సింఘానియా గ్రూప్ చైర్మన్ తెలిపారు. విద్యార్థులకు మరింత ప్రభావవంతమైన, ఆకర్షణీయమైన అభ్యసన విధానాల్లో బోధన చేసేందుకు వీలుగా ఉపాధ్యాయుల సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు విజయవాడ, వైజాగ్, అమరావతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పాఠ్యాంశాల్లో సాంకేతికతను మెరుగుపరచడం, ఆంగ్లంలో విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలను బలోపేతం చేయడం ద్వారా విద్య నాణ్యతను పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# అబద్ధాలు చెప్పడంలో జగన్‌కు డాక్టరేట్

### టిడిపి కార్యాలయంపై దాడి చేసి అబద్దాలా?
### కౌంటర్ అటాక్ చేస్తూ ఎక్స్ వేదికగా లోకేశ్ పోస్ట్

అమరావతి,ఫిబ్రవరి18(సాక్ష్యం): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అబద్దాలు చెప్పడంలో పిహెచ్‌డి చేసినట్లు ఉన్నారని మంత్రి నారా లోకేష్ ఎదురుదాడితో వ్యాఖ్యలు చేశారు. అబద్దాలకు కూడా ఓ హద్దు ఉందని ఎక్స్ వేదికగా ఖండించారు. విజయవాడ జైలులో ఉన్న వల్లభనేని వంశీని పరామర్శించిన తర్వాత జగన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం, టీడీపీపై విమర్శలు చేశారు.. వంశీపై తప్పుడు కేసులు పెట్టారని జగన్ వ్యాఖ్యానించారు.. ఇక, జగన్ వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా.. స్పందించారు నారా లోకేష్.. జగన్ వ్యాఖ్యలు.. గతంలో గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై దాడి దృశ్యాలను కలిపి వీడియో షేర్ చేసిన లోకేష్.. 'నిజం చెబితే తల వెయ్యి ముక్కలు అవుతుందనే శాపం మీకేమైనా ఉందా జగన్ రెడ్డి గారు' అంటూ ఎద్దేవా చేశారు.. పచ్చి అబద్దాలను కాన్ఫిడెంట్ గా చెప్పడంలో మీరు పీహెచ్‌డీ చేసినట్టు ఉన్నారు అంటూ దుయ్యబట్టారు.. మీరు ఏం చెప్పినా ప్రజలు నమ్ముతారు అనే భ్రమలోంచి ఇకనైనా బయటకు రండి అని సూచించారు.. 100 మందికిపైగా వైసీపీ రౌడీలు తెలుగుదేశం పార్టీ కార్యాలయం పై దాడి చేయడం కోట్లాది ప్రజలు కళ్లారా చూశారని గుర్తుచేశారు.. కక్ష సాధింపు, కుట్రలు, కుతంత్రాలు మీ బ్రాండ్ జగన్ రెడ్డి గారు. అధికారం ఉన్నప్పుడు యథేచ్ఛగా చట్టాలను తుంగలో తొక్కి ఇప్పుడు ప్రజాస్వామ్యం, పద్ధతులు అంటూ మీరు లెక్చర్ ఇవ్వడం వింతగా ఉంది అంటూ మండిపడ్డారు మంత్రి నారా లోకేష్..

## తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక మరోసారి వాయిదా

### కోరం లేక ఎన్నిక రద్దు

అమరావతి,ఫిబ్రవరి18(సాక్ష్యం): తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. కోరం లేకపోవడంతో నాలుగోసారి ఎన్నికను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మళ్లీ ఎన్నిక ఎప్పుడనేది త్వరలో నిర్ణయం ఉంటుందని తెలిపారు.
ఎన్నికల కమిషన్‌కు పరిస్థితి వివరించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. అయితే వైస్ చైర్మన్ ఎన్నికకు టీడీపీ కౌన్సిలర్లు ప్రతీ సారీ హాజరవుతున్నప్పటికీ ఓటమి భయంతో వైసీపీ కౌన్సిలర్లను రహస్య ప్రాంతాల్లో దాచిపెట్టారనే ప్రచారం జరుగుతోంది. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కనుసన్నుల్లోనే 17 మంది వైసీపీ కౌన్సిలర్లను నిర్బంధించి ఎన్నికకు రాకుండా చేస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు కనీసం 15 మంది కౌన్సిలర్లు ఉండాల్సి ఉండగా.. 10 మంది కౌన్సిలర్లు మాత్రమే ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నికను రద్దు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రకటించారు. అయితే తిరిగి ఎన్నిక ఎప్పుడు నిర్వాహిస్తామనే విషయాన్ని త్వరలోనే చెబుతామని తెలిపారు. రెండు సార్లు కోరం లేకపోతే కోరంతో సంబంధం లేకుండా ఎన్నిక నిర్వహించే నిబంధన ఉన్న నేపథ్యంలో తదుపరి ఏం చేయాలనే దానిపై ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని బట్టి ముందుకు వెళ్తామని అధికారులు చెబుతున్నారు. కాగా.. వైఎస్ చైర్మన్ ఎన్నిక వేళ తునిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మున్సిపల్ ఎన్నిక కోసం ఈరోజు ఉదయం 10 మంది టీడీపీ కౌన్సిలర్లు సమావేశానికి వచ్చారు. అయితే వైసీపీ కౌన్సిలర్లను మాత్రం రానీయకుండా నిర్బంధించారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నికకు సిద్ధంగా ఉంటే వైసీపీ కౌన్సిలర్లను ఎందుకు దాచేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ కౌన్సిలర్లు దాచిన ప్రదేశానికి వెళ్లేందుకు టీడీపీ శ్రేణులు యత్నించగా.. పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను టీడీపీ కౌన్సిలర్లు తోసేశారు. అయితే టీడీపీ కౌన్సిలర్లు వెళితే ఘర్షణ జరిగే అవకాశం ఉండటంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై తెలుగు దేశం శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుసగా నాలుగు సార్లు ఎన్నికకు హాజరైనప్పటికీ వైసీపీ కౌన్సిలర్లు రాకపోవడంతో ఎన్నిక జరగడం లేదని టీడీపీ కౌన్సిలర్లు చెబుతున్నారు.

# అసెంబ్లీ సమావేశాల్లో అప్రమత్తం అవసరం

### విపక్షం లేకున్నా అప్రమత్తంగా ఉండాల్సిందే
### మంత్రులు, ఎమ్మెల్యేలకు బాబు సూచనలు

అమరావతి,ఫిబ్రవరి18(సాక్ష్యం): విపక్షం లేదుకదా అని ఎట్టి పరిస్థితుల్లో అసెంబ్లీ సమావేశాలను లైట్ గా తీసుకోవద్దని సీఎం చంద్రబాబు అన్నారు.. ఎమ్మెల్యేలు, మంత్రులు సబ్జెక్టు పై పట్టుతో అసెంబ్లీ సమావేశాలను నడపాలని సూచించారు.
అసెంబ్లీ జరిగినపుడు ప్రతిపక్షం సాధారణంగా అడ్డు పడుతూ ఉంటుంది.. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు కావచ్చు. చర్చలు కావచ్చు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఇలాంటి ఉదాహరణలు ఎన్నో.. కానీ, ప్రస్తుతం ఏపీ అసెంబ్లీకి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు రావడం లేదు.. బడ్జెట్ సమావేశాలకు వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు.. అయితే, ఇక్కడే అలెర్ట్ అవుతున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. అసెంబ్లీకి రాకపోయినా బయట వైసీపీకి మాట్లాడే అవకాశం ఉంది.. దీంతో, వైసీపీ కౌంటర్ లకు వెంటనే రెస్పాండ్ అవ్వాలని చెబుతున్నారు. ప్రస్తుతం.. ప్రభుత్వం ముందు సంక్షేమ పథకాలకు సంబంధించి సవాళ్లు ఉన్నాయి.. ఇప్పటి వరకు 8 నెలలు పూర్తి అయ్యాయి.. ఇప్పుడు కేవలం 2 పథకాలు మాత్రమే. అమలులో ఉన్నాయి..
మరి కొన్ని త్వరలోనే ప్రారంభం అంటున్నారు.. ఇది వైసీపీకి కొంత అనుకూలంగా మారే అవకాశం ఉంది.. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ విషయంలో కానీ.. అమరావతి విషయంలో కానీ.. తగిన



సమాధానం చెప్పాలంటున్నారు.అయితే, వైసీపీ చేసే విమర్శలకు వెంటనే కౌంటర్ ఉండలంటున్నారు. ప్రభుత్వం 8 నెలల పాలనా తీరు.. తీసుకున్న నిర్ణయాలు ప్రతిపక్షం అడగకపోయినా కూడా. చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందని ఎమ్మెల్యేలు, మంత్రులకు సీఎం చంద్రబాబు.. సూచించారు. మంత్రులు.. ఎమ్మెల్యేలతో ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యాక ఒక సమావేశం ఏర్పాటు చేయనున్నారు సీఎం చంద్రబాబు.. కూటమిలో ఉన్న జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు కూడా అసెంబ్లీ సమావేశాలపై దృష్టి పెట్టేవిధంగా త్వరలో కార్యాచరణ సిద్ధం అవుతోంది.. జనసేన శాసన సభ పక్ష సమావేశం కూడా త్వరలో జరుగుతోంది.. ఎమ్మెల్యేలకు కొన్ని సూచనలు ఇవ్వనున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

# ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

### మంత్రి తనిఖీల్లో బయటపడ్డ వైనం
### మంత్రి ఆదేశాలతో 9మంది సస్పెన్షన్

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి18(సాక్ష్యం): నగరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన సిబ్బందిపై రాష్ట్ర బీమా వైద్య సేవల సంచాలకులు చర్యలు చేపట్టారు. కొందరు వైద్యులు, సిబ్బంది విధులు నిర్వహించకుండా సంతకాలు చేసి వెళ్లిపోవడాన్ని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఆకస్మిక తనిఖీ సమయంలో గుర్తించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో మంగళవారం ఐదుగురు వైద్యులు, నలుగురు కార్యాలయ సిబ్బందిని సస్పెండ్ చేశారు. మంత్రి సుభాష్ సోమవారం ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌తోపాటు మరో ముగ్గురు డ్యూటీ డాక్టర్లు విధుల్లో లేరు. వెంటనే ఈఎస్ఐ ఆసుపత్రి నుంచే బీమా వైద్య సేవల సంచాలకులు ఆంజనేయులుతో ఫోన్‌లో మాట్లాడి అక్కడి పరిస్థితిని వివరించారు. ఆసుపత్రి వైద్యులు కొందరు విధులకు డుమ్మాకొట్టి ప్రైవేటు ప్రాక్టీసులు చేసుకుంటున్నారనే ఫిర్యాదులు వస్తుండటంతో మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడి వైద్య సేవల తీరుపై నవంబరులో కార్మిక సంఘాల నాయకులు, ఈఎస్ఐ చందాదారులు ఆందోళన చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈఎస్ఐ బీమా చందాదారులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని, రోగుల సంరక్షణలో ఏదైనా నిర్లక్ష్యం లేదా క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించబోమని ఈ సందర్భంగా బీమా వైద్య సేవల డైరెక్టరు ఓ ప్రకటనలో హెచ్చరించారు. రాజమహేంద్రవరం వైద్యులు, సిబ్బందిపై విధి నిర్వహణ విషయంలో విచారణ జరుగుతోందని, సమగ్ర నివేదిక ఆధారంగా మరిన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# తునిలో వైకాపా, టిడిపి వర్గాల మధ్య ఘర్షణ

కాకినాడ,ఫిబ్రవరి18(సాక్ష్యం): కాకినాడ జిల్లా తుని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో అక్కడికి చేరుకున్న వైకాపా కౌన్సిలర్లను తెదేపా శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో ఇరువర్గాలు మళ్లీ గొడవకు దారితీసింది. దీంతో వారు వెనుదిరిగి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంటికి వెళ్లారు. మరోవైపు 'చలో తుని'కి దాడిశెట్టి రాజా పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమానికి అనుమతి లేదని హెచ్చరించారు. తుని మున్సిపాలిటీ పరిధిలో సెక్షన్ 163 (2) అమలు చేస్తున్నారు. సభలు, సమావేశాలు, ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడటంపై నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో అనుచరులతో కారులో తుని వెళున్న వైకాపా నేత ముద్రగడ పద్మనాభరెడ్డి, మాజీ ఎంపీ వంగా గీతను పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపారు. సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి.సోమవారం కోరం లేకపోవడంతో వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన నేపథ్యంలో నేడు మరోసారి నిర్వహించనున్నారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అక్కడికి చేరుకున్నారు. తెదేపా శ్రేణులు భారీగా తరలి రావడంతో మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. వైకాపా కౌన్సిలర్లను మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కిడ్నాప్ చేశారని తెదేపా నేతలు ఆరోపిస్తున్నారు. కౌన్సిలర్లకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం లేదన్నారు. వైకాపా కౌన్సిలర్లలో ఎక్కువ మంది తమకే మద్దతిస్తారని చెబుతున్నారు.

## కుంభమేళాలో పవన్ దంపతుల పుణ్యస్నానం

### తర్పణాలు వదిలి వస్త్రదానం చేసిన పవన్
### కుంభమేళాకు రావడం అదృష్టమని వ్యాఖ్య

ప్రయాగ్‌రాజ్,ఫిబ్రవరి18(సాక్ష్యం): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సమేతంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో పర్యటించారు. మహా కుంభమేళాలో పాల్గొన్న ఆయన కుటుంబ సభ్యులతో కలిసి త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరించి గంగాదేవికి పూజలు చేసి, హారతులిచ్చారు. ప్రయాగ్‌రాజ్‌లో



కొనసాగుతున్న కుంభమేళాకు సామాన్యభక్తులతో పాటు ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కుమారుడు అకీర నందన్ కూడా తండ్రి వెంటే ఉన్నాడు. ప్రయాగ్ రాజ్ మహకుంభమేళాలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దంపతులు పుణ్యస్నానం చేశారు. ఈ సందర్భంగా గంగానదికి పవన్ కళ్యాణ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు కుంకుమ, పువ్వులు సమర్పించి పవన్ కళ్యాణ్ దంపతులు హారతి ఇచ్చారు. పితృదేవతలకు తర్పణాలు వదిలి, బ్రాహ్మణులకు వస్త్ర దానం చేశారు. ఇది మనందరికీ గొప్ప అవకాశం అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. మనం భాష లేదా సంస్కృతి విషయంలో భిన్నంగా ఉండవచ్చు, కానీ ఒక మతంగా, మనం అంతా ఒక్కటే. మహా కుంభమేళాను నిర్వహించినందుకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. ఇక్కడికి రావాలనేది చాలా దశాబ్దాలుగా నాకున్న అతిపెద్ద కోరిక. ఈరోజు, నాకు ఇక్కడికి వచ్చే అవకాశం వచ్చిందని ఆయన అన్నారు.మహా కుంభమేళాలో భక్తుల ప్రవాహం ఏమాత్రం తగ్గడం లేదు. సోమవారం నాడు కూడా దాదాపు 1.35 కోట్ల మంది స్నానాలు చేశారు. ఇప్పటివరకు 54.31 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహా కుంభమేళా నుండి భక్తులను వారి గమ్యస్థానాలకు చేర్చడానికి రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. మరోవైపు, మహా కుంభమేళా మీదుగా ప్రతి గంటకు 8 కి పైగా విమానాలు ఎగురుతున్నాయి. ఈ క్రమంలో విమానయాన సంస్థలు తమ ప్రయాణీకులకు ఏరియల్ వ్యూ ఎక్స్ పీరియన్స్ ఇస్తున్నాయి.

## ఆంధ్రా వర్సిటీ విసిగా ప్రొఫెసర్ రాజశేఖర్

విశాఖపట్నం,ఫిబ్రవరి18(సాక్ష్యం): ఆంధ్ర విశ్వవిద్యాలయానికి కొత్త వైస్–చాన్సలర్‌గా ప్రొఫెసర్ గంగవంశం పైడి రాజశేఖర్ నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదేశాలు జారీ చేశారు.. ఈ ఉత్తర్వులను ప్రభుత్వ కార్యదర్శి కోనా శ్రీధర్ మంగళవారం ఉదయం జారీ చేశారు. ప్రొఫెసర్ జి.పీ. రాజశేఖర్ ప్రస్తుతం ఐఐటీ ఖరగ్‌పూర్‌లో గణితశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ నియామకం ద్వారా ఆయన 3 సంవత్సరాలు ఎయుకి వైస్ చాన్సలర్‌గా పనిచేయనున్నారు. అయన స్వస్థలం విశాఖపట్నం జిల్లా సింహాచలం గ్రామం. విద్యా రంగంలో అనుభవజ్ఞుడైన ప్రొఫెసర్ రాజశేఖర్ నియామకం విశ్వవిద్యాలయానికి ప్రయోజన కరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలోనే కొత్త వైస్–చాన్సలర్ గా జి.పీ. రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి వి జి డి ప్రసాద్ రెడ్డి 2024 జూన్ 28 న రాజీనామా చేయటం తో 2024 జూలై 18 నుండి ఇంచార్జ్ వైస్ చాన్సలర్ జి. శశిభూషణ్‌రావు విధులు నిర్వహిస్తున్నారు.

## పోలీసులపై జగన్ వ్యాఖ్యలు సరికాదు

### పోలీస్ అధికారుల సంఘం నేతల ఆగ్రహం

విజయవాడ,ఫిబ్రవరి18(సాక్ష్యం): మాజీ సీఎం జగన్ పోలీసులపై బెదిరింపు వ్యాఖ్యలు మానుకోవాలని ఏపీ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు హితవు పలికారు. పోలీసులనుద్దేశించి జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారిపోయాయని, పోలీసు అధికారులు రిటైర్ అయిన తర్వాత కూడా వారిని తీసుకొచ్చి బట్టలూడదీసి నిలబెడతామని మాట్లాడటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల మనోభావాలు, ఆత్మస్థైర్యం దెబ్బతినే విధంగా బెదిరింపుగా వ్యాఖ్యలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు గత ఎనిమిది నెలల కిందట తమ ప్రభుత్వంలో పని చేసిన వారేననే విషయాన్ని జగన్ గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయాలకు, వర్గాలకు, రాగద్వేషాలకు అతీతంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. రాజకీయ లబ్ది కోసం రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దిగజారి పోయిందని వ్యాఖ్యానించడం అత్యంత దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పోలీసులు ఎప్పుడూ చట్టానికి, ధర్మానికి, న్యాయానికి, సత్యానికి సంకేతాలైన ఆ నాలుగు సింహాలకే సెల్యూట్ చేస్తారని స్పష్టం చేసారు. చట్టాలను ప్రజాస్వామ్యాన్ని గౌరవించని వారికి సెల్యూట్ చేయరన్నారు. జగన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని జిల్లా జైలులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ములాఖత్‌లో మంగళవారం.. జగన్ కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... వంశీని తప్పుడు కేసుల్లో అన్యాయంగా ఇరికించారని ఆరోపించారు. ఈ క్రమంలో పోలీసులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## పిడిఎఫ్ అభ్యర్ధి గెలుపు కోసం ప్రచారం

ఏలూరు,ఫిబ్రవరి18(సాక్ష్యం): ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రులు ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులను గెలిపించాలని కోరుతూ సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు అండగా వుండే అభ్యర్థి, నిరుద్యోగ యువతి యువకుల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం స్వార్థపరుడు నిజాయితీపరులు పోరాట యోధులు దిడ్ల వీర రాఘవులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జన విద్యానవేదిక జిల్లా నాయకులు ప్రత్తి వీరాస్వామి, ప్రతివాడ నాగేంద్ర, శివాజీ, నర్మాల నారాయణ రావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మిర్చిరైతుల సమస్యలపై జగన్ ఆరా

### నేడు గుంటూరులో పర్యటించనున్న వైకాపా అధినేత

గుటూరు,ఫిబ్రవరి18(సాక్ష్యం): మిర్చి రైతుల సమస్యలను తెలుసుకోవడానికి బుధవారం గుంటూరు మిర్చి యార్డ్‌లో వైసిపి అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్



పర్యటించనున్నారు. వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు.. మిర్చికు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతుల్ని కలుసుకోవడానికి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుంటూరు మిర్చి యార్డ్‌కి వస్తున్నారని తెలిపారు. మిర్చి ధరలు తగ్గిపోవడంతో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని.. కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలైన రైతుల పంటలకు గిట్టుబాటు ధర లేదని.. ధాన్యాన్ని రూ.1300 రూపాయలకే అమ్ముకున్నారని.. పత్తి నాలుగు వేల రూపాయలకు కొనే దిక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఛాంపియన్స్ ట్రోఫీకి రంగం సిద్ధం

## నేటినుండి ప్రతిష్టాత్మక టోర్నీ షురూ



**పాకిస్థాన్ వేదికగా ప్రారంభం కానున్న మెగా టోర్నీ**

**నెట్స్ లో తీవ్రంగా శ్రమిస్తూ ప్రాక్టీస్ చేస్తోన్న ఇండియా**

**రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లకు ఆఖరు ఐసీసీ టోర్నీ!!**

**గంభీర్‌కు కీలకం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీ**

ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీకి రంగం సిద్ధమైంది. పాకిస్థాన్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే క్రికెట్‌ను మరింత ఆసక్తికరంగా మార్చనుంది. పాకిస్తాన్ ఈ మెగా టోర్నమెంట్‌ను నిర్వహిస్తుండగా, భారతదేశం తన మ్యాచ్‌లను యుఎఇలో ఆడనుంది. ఎనిమిది జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి సెమీ–ఫైనల్ బెర్త్ కోసం పోటీపడతాయి. టై బ్రేకింగ్ నిబంధనలతో పాటు, ఆసక్తికరమైన మ్యాచ్‌ల కారణంగా ఈ టోర్నమెంట్ క్రికెట్ అభిమానులకు గొప్ప అనుభూతిని అందించనుంది. 017 తర్వాత తిరిగి 2025లో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ కోసం క్రికెట్ ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. ఈ వన్డే ఫార్మాట్ టోర్నమెంట్‌లో ఎనిమిది అత్యుత్తమ జట్లు పోటీపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్స్ పాకిస్తాన్ ఈసారి ఈ మెగా ఈవెంట్‌ను ఆతిథ్యం ఇస్తోంది. ఈ టోర్నమెంట్ 2025 ఫిబ్రవరి 19న కరాచీలో పాకిస్తాన్ %జు% న్యూజిలాండ్ మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. భారత జట్టు తన మొదటి మ్యాచ్ ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో దుబాయ్‌లో ఆడనుంది. భారతదేశం తన అన్ని మ్యాచ్‌లను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లో ఆడుతుండటం విశేషం. మరోవైపు ఇటీవల కాలంలో ఏ టోర్నీకి లేనన్ని వివాదాలు ఈ టోర్నీని చుట్టుముట్టాయి. ముఖ్యంగా భారత జట్టు పాక్ లో పర్యటించడంపై పీటముడి బిగుసుకుంది. ఎట్టకేలకు ఐసీసీ జోక్యం చేసుకుని, హైబ్రీడ్ మోడల్లో ఈ టోర్నీని నిర్వహిస్తోంది. అంటే భారత్ ఆడే మ్యాచ్ లు మాత్రం దుబాయ్ లో మిగతా జట్ల మ్యాచ్ లు పాక్ లోనే జరుగుతాయి. ఇక ఈ ఫార్మాట్ విజయవంతమైతే మరికొంతకాలం వన్డే క్రికెట్ మనుగడ సాగిస్తోంది. ఇప్పటికే చిన్న చితకా జట్లు తప్ప పెద్ద జట్లు వన్డేలను ఎక్కువగా ఆడటం లేదు. గతేడాది భారత్ కేవలం 3 వన్డేలు మాత్రమే ఆడటం గమనార్హం. కాసులు కురిపించే పొట్టి క్రికెట్ తోపాటు క్రేజ్ ఏమాత్రం తగ్గని టెస్టుల నిర్వహణకే బీసీసీఐ, క్రికెట్ ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డులు మొగ్గు చూపుతున్నాయి. ఐదేసి మ్యాచ్ ల చొప్పున టీ20లు, టెస్టు సిరీస్ లను నిర్వహిస్తున్న ఈ బోర్డులు.. వన్డేలను మాత్రం తూతూమంత్రంగా మూడు మ్యాచ్ లతో సిరీస్ లను నిర్వహిస్తున్నాయి. మెగాటోర్నీ విఫలమైతే వన్డేలను కూడా రెగ్యులర్ గా చూసే అవకాశముంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అభిమానులు వన్డేల పట్ల అంత ఆసక్తితో లేరు. ఈ మెగాటోర్నీ ద్వారా ఏదైనా అద్భుతాలు జరుగుతాయో చూడాలి. కాగా టీమిండియా మ్యాచులు దుబాయ్ లో జరగనున్నాయి. ఈ ట్రోఫీని ఎలాగైనా నెగ్గాలని పట్టుదలతో దుబాయ్ లో అడుగుపెట్టిన భారత జట్టు సాధన ప్రారంభించేసింది. గత రెండు రోజుల నుంచి నెట్స్ లో తీవ్రంగా శ్రమిస్తూ ప్రాక్టీస్ చేస్తోంది. అయితే కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, మహ్మద్ షమి, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, శ్రేయస్ అయ్యర్ వంటి స్టార్ ప్లేయర్స్ ఈ ఛాంపియన్స్ ట్రోఫీ బరిలో దిగనున్నారు. కానీ గత కొంత కాలంగా వీరంతా నిలకడగా రాణించలేకపోతున్నారు. రీసెంట్ గానే ఇంగ్లాండ్ పై వన్డే సిరీస్ తో పాటు రంజీ ట్రోఫీతో కాస్త ఫామ్ లోకి వచ్చారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ కోసం జట్టులోని ప్రతీ ఆటగాడు సాధనలో తీవ్రంగా చెమటోడ్చుతున్నారు. వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ కేఎల్ రాహుల్ భారీ షాట్లు బాదడంపై ఫోకస్ పెట్టాడు. ప్రతీ బంతినీ సిక్స్ బాదేందుకు ప్రయత్నించాడు. 5 లేదా 6వ స్థానంలో అతడు బరిలోకి దిగే అవకాశం ఉంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు పేసర్ మహ్మద్ షమి, అర్ష్‌దీప్ సింగ్ బంతులు సంధించారు. ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య ఆడారు. శ్రేయస్ పవర్ హిట్టింగ్‌పై బాగా ఫోకస్ పెట్టాడు. ఆదివారం ప్రాక్టీస్ సెషన్ లో హార్దిక్ పాండ్య బాదిన బంతి తగిలి గాయపడిన పంత్.. సోమవారం నెట్ సెషన్ లో అసౌకర్యంగా కనిపించాడు. వికెట్‌కీపింగ్, ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేయలేదు. బ్యాటింగ్ కూడా అంతగా చేయలేకపోయాడు.

మరోవైపు రోకోగా పేరు గాంచిన భారత వన్డే, టెస్టు కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లకు ఇదే ఆఖరు ఐసీసీ టోర్నీగా నిలవనుంది. ఇప్పటికే వీళ్ల ఫామ్, ఆటతీరు అంతంతమాత్రంగా ఉండటంతో మరో ఐసీసీ టోర్నీలో బరిలోకి దిగే అవకాశం లేదని తెలుస్తోంది. వచ్చే ఏడాది 2026 టీ20 ప్రపంచకప్ ఉన్నా, ఆ ఫార్మాట్ కు వీరిద్దరూ ఇప్పటికే గుడ్ బై చెప్పారు. ఇక వన్డే ప్రపంచకప్ 2027లో ఉన్నా, అప్పటివరకు ఫామ్ కాపాడుకుని, ఇదే ఉత్సాహంతో వీరిద్దరూ బరిలోకి దిగేది డౌటే. అప్పటికి రోహిత్ 40వ పడిలోకి చేరుకోగా, కోహ్లీ 39వ పడిలోకి ప్రవేశిస్తాడు. దీంతో ఈ టోర్నీలో సత్తా చాటి, మరో ఐసీసీ టోర్నీని ముద్దాడాలని ఈ ద్వయం భావిస్తోంది. ఒకవేళ ఈ టోర్నీని భారత్ నెగ్గితే, వీరిద్దరి నుంచి ఆశ్చర్యకరమైన నిర్ణయాలు (రిటైర్మెంట్)లాంటివి కూడా రావచ్చు. గతేగాది న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్ల చేతిలో చావుదెబ్బ తిన్న భారత్.. ఈ ఏడాది ఇంగ్లాండ్ పై లిమిటెడ్ ఓవర్ల క్రికెట్ సిరీస్ ల్లో సత్తా చాటింది. ప్రస్తుతానికి గంభీర్ పరిస్థితి బాగానే ఉన్నా, మెగాటోర్నీలో టీమ్ విఫలమైతే మాత్రం అతని భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. గతేడాది ప్రదర్శనపై ఇప్పటికే గంభీర్ పై వ్యతిరేకత రాగా, ఈ మెగాటోర్నీలో స్థాయికి తగ్గ ఆటతీరు ప్రదర్శించడం తప్పనిసరి. లేకపోతే అతనిపై వేటు తప్పకపోవచ్చు. ఈ టోర్నీలో జట్ల విషయానికొస్తే, బలహీన జట్టుతో ఆస్ట్రేలియా బరిలోకి దిగుతోంది. ఐసీసీ టోర్నీ అంటే రెచ్చిపోయే ఈ జట్టును ఏమాత్రం తక్కువ అంచనా వేయకూడదు. గత కొంతకాలంగా ఆటతీరుతో విమర్శల పాలవుతున్న ఇంగ్లాండ్.. వన్డేల్లో ప్రమాదకరమైన జట్టు. హిట్టర్లతో నిండిన ఈ జట్టు తమదైన రోజున ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తుంది. సౌతాఫ్రికా బలంగానే ఉన్నా, బ్యాడ్ లక్కును జేబులో పెట్టుకుని తిరుగుతుంది. ఈ సారైన ఐసీసీ టోర్నీని దక్కించుకోవాలని భావిస్తోంది. ఆఫ్ఘనిస్థాన్ మ్యాగ్జిమం నాకౌట్ వరకు చేరవచ్చు. ఆతిథ్య పాక్.. బలహీనంగానే కనిపిస్తున్నా.. సొంతగడ్డ అనుకూలత కలిసి రావచ్చు. అస్థిరమైన ఆటతీరుకు కేరాఫ్ అడ్రస్ అయిన పాక్.. ఎప్పుడెలా ఆడుతుందో చెప్పడం కష్టం. న్యూజిలాండ్ ఇటీవల మంచి ఆటతీరును కనబరుస్తున్న ఫైనల్లో తడబడే అలవాటుంది. ఈ బలహీనతకు చెక్ పెట్టాలని భావిస్తోంది. ఆఫ్ఘన్ లాగే ఆటలో అరటిపండులా ఈ జట్టును పేర్కొనవచ్చు. మ్యాగ్జిమం నాకౌట్ కు చేరే అవకాశముంది, కానీ కష్టమే. ఇక టైటిల్ ను దక్కించుకోడానికి అన్ని రకాలుగా భారత్ కు అవకాశాలున్నాయి. పటిష్టమైన బ్యాటింగ్, బౌలింగ్ లైనప్, జట్టు నిండా ఆల్ రౌండర్లు, ఒకే వేదిక పై టోర్నీ అంతా ఆడటం, జట్టంతా సూపర్ ఫామ్ లో ఉ ఒడటం సానుకూలాంశాలు. అయితే స్థాయికి తగ్గ ఆటతీరు ప్రదర్శిస్తే టోర్నీని ఈజీగా కైవసం చేసుకుంటుంది.

### కొత్త జెర్సీలను ఆవిష్కరించిన బీసీసీఐ

ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమిండియా సిద్ధమైంది. తమ తొలి మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో ఈనెల 20న దుబాయ్ వేదికగా పోటీ పడనుంది. ఈ సందర్భంగా తమ కొత్త జెర్సీలను ఆవిష్కరించింది బీసీసీఐ. భారత ఆటగాళ్లు మెగా సమరానికి సిద్ధమంటూ తమ కొత్త జెర్సీలు ధరించి ఫొటోషూట్ కు పోజులిచ్చారు. కెప్టెన్ రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, మహమ్మద్ షమీ తదితరులు కొత్త జెర్సీలతో సందడి చేశారు. ఈ నేపథ్యంలో ఫొటోషూట్ కు ముందు కెప్టెన్ రోహిత్ శర్మ



– రవీంద్ర జడేజా సరదాగా చిట్ చాట్ సెషన్ నిర్వహించారు. ఇద్దరు ఫొటోషూట్ కోసం వెళ్లేముందు కారులో ప్రయాణిస్తూ.. కాసేపు తమ వరల్డ్ కప్ జర్నీని గుర్తుచేసుకున్నారు. 'ఇప్పుడు మేం ఫొటోషూట్ కోసం వెళ్తున్నాం. ఎంతో ఎక్సైటింగ్ గా ఉంది. ఫొటోస్ మంచిగా వచ్చాయి. ఎక్ దమ్ ఫొటోజెనిక్ గా వచ్చాయి.' అని జడేజా అనగా... ఆ తర్వాత రోహిత్ తాను ఎన్ని ఐసీసీ టోర్నీల్లో ఆడాడో తెలిపాడు. "ఇది నాది 15వది అనుకుంటా. 9 టీ20 వరల్డ్ కప్, 3 వన్డే వరల్డ్ కప్, 2 ఛాంపియన్స్ ట్రోఫీ, ఇంకా 2 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్, ఇక ఇప్పుడు మరో ఛాంపియన్స్ ట్రోఫీ. మొత్తం 15 కాదు.. 17 సార్లు నన్ను ఈ టోర్నీ కోసం ఆహ్వానించారు." అంటూ సరదాగా నవ్వించాడు. ఇంకా జడేజా ఎన్ని సార్లు ఐసీసీ టోర్నీల్లో పాల్గొన్నాడో కూడా తెలిపాడు హిట్ మ్యాన్. 'నువ్వు 9 టీ20 వరల్డ్ కప్ లు ఆడావు కదా' అని అన్నాడు. దానికి జడ్డూ.. తాను 2007, 2012 టీ20 ప్రపంచకప్ ఆడలేదని స్పష్టత ఇచ్చాడు. అనంతరం ఫొటోషూట్ లో టీమిండియా ఆటగాళ్లంతా ఫొటోలకు పోజులిస్తూ.. బ్యాట్లపై తమ ఆటోగ్రఫ్ లను ఇచ్చారు.

## రజత్‌ను కెప్టెన్‌గా నియమించడం సమర్ధనీయమే

**మాజీ క్రికెటర్ కమ్ కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్**



రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తాజాగా తమ కెప్టెన్ ను ప్రకటించిన సంగతి తెలిసిందే. 2024 మెగావేలానికి ముందు ఆటగాళ్లను విడిచి పెట్టి విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్, యశ్ దయాల్ లను రిటైన్ చేసుకుంది. ఇప్పుడు రిటైన్ చేసుకున్న ఆటగాళ్లలో రజత్ ను కెప్టెన్ గా ప్రకటించి, అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. నిజానికి గతేడాది కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ ను రిలీజ్ చేసినప్పుడే కోహ్లీని కెప్టెన్ గా ప్రకటిస్తారని అందరూ గెస్ చేశారు. అందరి అంచనాలను తల కిందులు చేస్తూ, రజత్ ను కెప్టెన్ గా ప్రకటించింది టీమ్ యాజమాన్యం. ఇక ఆర్సీబీ తీసుకున్న నిర్ణయాన్ని మాజీ క్రికెటర్ కమ్ కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ సమర్థిస్తున్నాడు. ఈ నిర్ణయం కోహ్లీకి మేలు చేస్తుందని వ్యాఖ్యానించాడు. తనపై ఎలాంటి ఒత్తిడి లేకుండా క్రికెట్ ఆడగలడని తెలిపాడు. గతేడాది టీ20ఐలకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ ఆసక్తికరంగ ఉండబోతుంది వ్యాఖ్యానించాడు. భారత టెస్టు, వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ, కోహ్లీలు భారత క్రికెట్ కు బ్రాండ్ల వాంటివారని, వచ్చే ఐపీఎల్ సీజన్లో ఇద్దరిపై కెప్టెన్సీ భారం లేకపోవడంతో స్వేచ్ఛగా ఆడతారని మంజ్రేకర్ తెలిపాడు. వీరిద్దరూ గతేడాది టీ20ఐల నుంచి నిష్క్రమించారని, దీంతో మరింతగా ఫియర్ లెస్ క్రికెట్ ఆడతారని విశ్లేషించాడు. ఇక ఐపీఎల్ లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుకు ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. 17 సీజన్లుగా ఆడుతున్న ఒక్క టైటిల్ గెలవకపోయినా, ప్రతి ఏడు ఫ్యాన్ బేస్ పెరుగుతుందే తప్ప తరగడం లేదు. ముఖ్యంగా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఆ జట్టు తరపున ఆడుతుండటంతో సీజన్ జరుగుతున్నప్పుడల్లా ఈ సాలా కప్ నమ్దే అనే స్లోగన్ వినిపించడం పరిపాటిగా మారిపోయింది. అందరూ ఊహించినట్లుగా కాకుండా రజత్ ను కెప్టెన్ గా ఎన్నుకుని షాకిచ్చింది. నిజానికి కోహ్లీని ఈ సీజన్ కు కెప్టెన్ గా చేస్తారని అందరూ భావించగా, అందుకే మెగావేలంలో శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ లాంటి కెప్టెన్సీ మెటీరియల్ ప్లేయర్లు ఉన్నప్పటికీ వారిని కొనుగోలు చేయలేదని విశ్లేషించారు. తాజా నిర్ణయంతో ఆర్సీబీ కొత్త వ్యూహాన్ని రచించినట్లు తెలుస్తోంది. నిజానికి తమ టీమ్ విషయానికి వస్తే కెప్టెన్సీపై పెద్దగా ఆలోచించబోమని జట్టు డైరెక్టర్ మో బొబాట్ పేర్కొన్నాడు. తామంతా జట్టుగా విజయాలు సాధిస్తామని భావిస్తామని, అందులో ప్రత్యేకంగా కెప్టెన్ గా ఎవరుండాలనే విషయంలో అంతగా ఆలోచించబోమని, క్రికెట్ అనేది టీమ్ ప్లే అని, దానికి కట్టుబడే నిర్ణయాలు తీసుకుంటామని తెలిపాడు. మైదానంలో చురుకుగా కదిలి, యాక్టివ్ గా ఉండే కోహ్లీలాంటి ప్లేయర్ కు కెప్టెన్సీ అనే టైటిల్ అవసరం లేదని, నిత్యం జట్టును ముందుకు నడిపిస్తుంటాడని వ్యాఖ్యానించాడు. కోహ్లీలో నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని, దీంతో రజత్ కు వచ్చిన ఇబ్బందేమీ లేదని పేర్కొన్నాడు.

### గత ఛాంపియన్స్ ట్రోఫీలలో అదరగొట్టిన

## భారత బ్యాటర్లు

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. దాయాది దేశం పాకిస్థాన్ వేదికగా ఈ మెగా టోర్నీ జరుగుతుండగా, టీమ్ ఇండియా మాత్రం అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది. ఇప్పటివరకు టీమ్ ఇండియా రెండు సార్లు ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుంది. అలాగే భారత బ్యాటర్లు ఛాంపియన్స్ ట్రోఫీలో అదరగొట్టారు. ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో టీమ్‌ఇండియా తరఫున అత్యధిక పరుగులు చేసిన జాబితాలో టాప్‌లో భారత మాజీ ఆటగాడు శిఖర్ ధావన్ ఉన్నాడు. అతడు 10 ఇన్నింగ్స్ ల్లో 701 రన్స్ చేశాడు. టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీకి ఛాంపియన్స్ ట్రోఫీలో మంచి రికార్డు ఉంది. అతడు 11 ఇన్నింగ్స్ ల్లో 665 పరుగులు సాధించాడు. టీమ్ ఇండియా తరఫున ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో గంగూలీ రెండో స్థానంలో ఉన్నాడు. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ కూడా ఛాంపియన్స్ ట్రోఫీలో రాణించాడు. 15 ఇన్నింగ్స్ ల్లో 627 రన్స్ బాదాడు. ఈ క్రమంలో ఈ ఐసీసీ టోర్నీలో హయ్యెస్ట్ రన్స్ సాధించిన మూడో భారతీయుడిగా నిలిచాడు. అహ్మదాబాద్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో హాఫ్ సెంచరీతో టీమ్‌ఇండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లీ ఫామ్‌లోకి వచ్చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమ్‌ఇండియాకు ఇదొక శుభపరిణామం. ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన భారతీయుల్లో కోహ్లీ నాలుగో ప్లేస్ లో ఉన్నాడు. 13 ఇన్నింగ్స్ ల్లో 529 పరుగులు చేశాడు. గత కొన్నాళ్లుగా ఫామ్ లేమితో ఇబ్బందిపడ్డ రోహిత్ ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డేల్లో సెంచరీ బాది మళ్లీ లైన్‌లోకి వచ్చాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ శర్మ అదే జోరును కొనసాగించాలని చూస్తున్నాడు. గతంలోనూ ఛాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ మంచి పెర్ఫామెన్స్ చూపించాడు. 10 మ్యాచ్‌ల్లో 481 రన్స్ చేశాడు.



## స్మృతి సంచలన ఇన్నింగ్స్

### ఆర్సీబీ ఖాతాలో రెండో విజయం

డబ్ల్యూపీఎల్ తాజా సీజన్లో దూకుడు మీదున్న డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సత్తా చాటుతోంది. టోర్నీలో వరుసగా రెండో విజయాన్ని సాధించింది. సోమవారం వడొదర వేదికగా జరిగిన లీగ్ మ్యాచ్ లో ఎనిమిది వికెట్లతో ఢిల్లీ క్యాపిటల్స్ ను చిత్తు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ.. 19.3 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (22 బంతుల్లో 34, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్. అయితే మిగతా బ్యాటర్లు రాణించక పోవడంతో ఢిల్లీ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. బౌలర్లలో రేణుకా సింగ్, జార్జియా వారెహిమ్ లకు మూడేసి వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనను కేవలం 16.2 ఓవర్లలో 146 –2తో బెంగళూరు ఛేదించింది. కెప్టెన్ కమ్ ఓపెనర్ స్మృతి మంధాన విధ్వంసకర ఇన్నింగ్స్ (47 బంతుల్లో 81, 10 ఫోర్లు, 3 సిక్సర్లు)తో సత్తా చాటడంతో మరో 22 బంతులు మిగిలి ఉండగానే ఆర్సీబీ విజయం సాధించింది. శిఖా పాండే పొదుపుగాబౌలింగ్ చేసి, ఒక వికెట్ సాధించింది. ఈ విజయంతో వరుసగా రెండు విజయాలతో పట్టికలో అగ్రస్థానాన్ని మరింతగా ఆర్సీబీ పటిష్టం చేసుకుంది. రేణుక సింగ్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. బ్యాటింగ్ కు అనుకూలంగా ఉన్న పిచ్ పై ఢిల్లీ బ్యాటర్లు మెరవలేక పోయారు. ఆరంభంలోనే స్టార్ బ్యాటర్ షెఫాలీ వర్మ డకౌట్ అయ్యింది. కెప్టెన్ మెగ్ ల్యానింగ్ (17) నెమ్మదిగా ఆడింది. ఉన్నంతలో జెమీమా దూకుడుగా ఆడి ఆ తర్వాత పెవిలియన్ కు చేరింది. ఈ దశలో అన్నాబెల్ సదర్లాండ్ (19), వికెట్ కీపర్ బ్యాటర్ సారా బ్రైస్ (23) జట్టును ఆదుకునే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఈ మ్యాచ్ లో ఐదుగురు ఓవర్ సీస్ ప్లేయర్లతో ఢిల్లీ బరిలోకి దిగడం విశేషం. ఆస్ట్రేలియాకు చెందిన ల్యానింగ్, సదర్లాండ్, జెస్ జోనాసెన్ , దక్షిణాఫ్రికాకు చెందిన మారిజానే కాప్, స్కాంట్లాండ్ ప్లేయర్ సారా బ్రైస్ లకు తుదిజట్టులో చోటు కల్పించారు. బౌలర్లలో కిమ్ గార్త్, ఏక్తా బిస్త్ లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేజింగ్ లో ఆర్సీబీకి అదిరే ఆరంభం దొరికింది. స్మృతి దూకుడైన ఆటతీరు ప్రత్యర్థి బౌలర్లు బెంబేలెత్తారు. బౌండరీల వర్షం కురిపించి, కేవలం 27 బంతుల్లోనే స్మృతి ఫిఫ్టీ చేసుకుంది. స్మృతి జోరుకు పవర్ ప్లేలోనే 57



పరుగులను పిండుకున్న ఆర్సీబీ.. వంద పరుగులను కేవలం 10 ఓవర్లలోనే సాధించింది. మరో ఎండ్ లో ఓపెనర్ డేని వ్యాట్ హెడ్జ్ (42) యాంకర్ రోల్ పోషిస్తూ, స్మృతికి ఎక్కువగా స్ట్రైక్ ఇచ్చింది. దీంతో తొలి వికెట్ కు రికార్డు స్థాయిలో 107 పరుగులు జతయ్యింది. మరో ఎండ్ లో స్మృతి రెచ్చిపోవడంతో టార్గెట్ వేగంగా కరుగుతూ వచ్చింది. విజయానికి మరో 9 పరుగుల దూరంలో ఉండగా స్మృతి ఔటయ్యింది. స్కోరు వేగాన్ని పెంచే క్రమంలో ఆమె ఔటయ్యింది. ఎలీస్ పెర్రీ (7 నాటౌట్), రిచా ఘోష్ (11 నాటౌట్)) జట్టును వేగంగా విజయ తీరాలకు చేర్చారు. తెలుగు ప్లేయర్ అరుంధతి రెడ్డికి ఒక వికెట్ దక్కింది.



# 'మజాకా' సెన్సార్ పూర్తి

## యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చిన సెన్సార్ బోర్డ్

పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ మోస్ట్ ఎవైటెడ్ 30వ మూవీ 'మజాకా' హ్యూజ్ బజ్ ని క్రియేట్ చేస్తోంది. త్రినాధ రావు నక్కిన దర్శకత్వం వహించిన ఈ మూవీ టీజర్, సాంగ్స్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ ల కొలాబరేషన్ లో రాజేష్ దండా నిర్మిస్తున్నారు. సహ నిర్మాత బాలాజీ గుత్తా. రీతు వర్మ హీరోయిన్ గా నటిస్తున్న మజాకాలో రావు రమేష్,అన్షు కీలక పాత్రల్లో నటించారు.తాజాగా 'మజాకా' సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ సినిమాకి యూ /ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. సినిమా అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైన్మెంట్ వుంది, హెల్తీ కామెడీ, ఎంటర్టైన్మెంట్ చాలా బావుందని సెన్సార్ సభ్యులు మూవీ టీమ్ కి వారి రెస్పాన్స్ ని తెలియజేశారు. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా నుంచి 'పగిలి' సాంగ్ ని రిలీజ్ చేశారు. లియోన్ జేమ్స్ ఈ పాటని మాస్ డ్యాన్స్ నెంబర్ గా కంపోజ్ చేశారు. మహాలింగం, సాహితీ చాగంటి, ప్రభ పవర్ ఫుల్ వోకల్స్ పాడిన ఈ సాంగ్ కు కాసర్ల శ్యామ్, ప్రసన్న కుమార్ బెజవాడ అందించిన లిరిక్స్ మాస్ ని మరింత ఎలివేట్ చేశాయి. ఈ సాంగ్ లో సందీప్ కిషన్ ఎనర్జిటిక్ మాస్ డ్యాన్స్ మూమెంట్స్ అదిరిపోయాయి. సందీప్ కిషన్, రీతు వర్మ కెమిస్ట్రీ అద్భుతంగా వుంది. మ్యాసీవ్ అండ్ వైబ్రెంట్ సెట్స్ లో చిత్రీకరించిన ఈ సాంగ్ లో విజువల్స్ కలర్ ఫుల్ గా వున్నాయి. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ గ్రేస్ ఫుల్ గా వుంది. ఈ పాట థియేటర్స్ లో మాస్ ని మెస్మరైజ్ చేయడం ఖాయం. ఇప్పటికే రిలీజైన మజాకా టీజర్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైన్మెంట్ ని అందించి సినిమాపై అంచనాలని పెంచింది. ఫస్ట్ సింగిల్ బ్యాచులర్స్ ఆంథమ్, సెకండ్ సింగిల్ బేబీ మా చార్ట్ బస్టర్ హిట్స్ గా నిలిచాయి. త్రినాధ రావు నక్కినతో సక్సెస్ ఫుల్ ప్రాజెక్టులలో కొలబారేట్ అయిన రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ, మజాకాకు కథ, స్క్రీన్‌ప్లే డైలాగ్స్ రాస్తున్నారు. ఈ చిత్రానికి నిజార్ షఫీ అద్భుతమైన సినిమాటోగ్రఫీ అందించగా, బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్షన్ వహిస్తుండగా, పృథ్వీ స్టంట్స్‌ను పర్యవేక్షిస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26న మజాకా థియేటర్లలోకి రానుంది.

# త్వరలో రిలీజ్‌కు సిద్ధమవుతున్న "దీక్ష" మూవీ

ఆర్ కె ఫిలిమ్స్ పతాకంపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో కిరణ్, ఆలేఖ్యరెడ్డి హీరో హీరోయిన్స్ గా ఆక్స ఖాన్, తులసి, అనూష,ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం"దీక్ష". లవ్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని రిలీజ్ కు రెడి అయింది. ఈ సందర్భంగా దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్ ను ఇతివృత్తంగా తీసుకుని లవ్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ చిత్రాన్ని



తెరకెక్కిస్తున్నాము. చాలా అందమైన లొకేషన్స్ లో, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ పూర్తి చేసుకుంది. పాటలు అద్భుతంగా వచ్చాయి. మా బ్యానర్ కు మంచి పేరు తెచ్చే చిత్రం అవుతుంది. లవ్ యాక్షన్ తో పాటు మైథలాజికల్ ను జోడించి నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరో కిరణ్ భీముడు పాత్రలో అద్భుతమైన నటన కనపరచాడు. హీరో శ్రీహరిని గుర్తుచేసేలా కిరణ్ నటన ఉంటుంది. మా చిత్రం ద్వారా హీరో కిరణ్ కి మంచి పేరు, గుర్తింపు వస్తాయి. ఆక్స ఖాన్ స్పెషల్ సాంగ్ లో, తనదైన శైలిలో డాన్స్ ఆదరగొట్టింది. మా చిత్రానికి పనిచేసిన సాంకేతిక నిపుణులు అందరూ ఎంతో దీక్షతో పనిచేసారు. సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ అద్భుతమైన 5 పాటలు అందించారు. మధుప్రియ తదితర ముఖ్య గాయనీ గాయకులు తమ స్వరాన్ని అందించారు. ఆర్ ఆర్ ఈ చిత్రానికి హైలైట్ గా నిలుస్తుంది. ఈ చిత్రం లో 5ఫైట్స్ ఉన్నాయి. ఇప్పటి వరకు 40 చిత్రాలు మా బ్యానర్ లో నిర్మించాను. దీక్ష చిత్రం మా బ్యానర్ కు సూపర్ హిట్ అందించే చిత్రం అవుతుంది. త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రిలీజ్ చెయ్యడానికి ప్లాన్ చేస్తున్నాము అన్నారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ రిషి.



## అల్లుఅర్జున్‌తో రోమాన్స్ చేయనున్న

# జాన్వీకపూర్



ఐకాన్ స్టార్ అల్లుఅర్జున్ నటించిన పుష్ప-2 మూవీ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. పుష్ప తర్వాత బన్నీ ఏం సినిమా చేయబోతున్నాడనే చర్చ సాగుతున్నది. సమాచారం మేరకు అల్లు అర్జున్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో ఓ సినిమా చేయనున్నాడనే వార్త తెగ వైరల్‌గా మారింది. అయితే, ఈ ప్రాజెక్టు కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉందని.. ఈ మూవీని పక్కన పెట్టి బన్నీ తమిళ ప్రముఖ దర్శకుడు అట్లీతో సినిమా చేయనున్నాడని ప్రచారం జరుగుతున్నది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ, అలనాటి అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్‌ను హీరోయిన్‌గా తీసుకోనున్నట్లు తెలుస్తున్నది. చాలారోజులుగా బన్నీతో అట్లీ సినిమా చేయాలనుకుంటున్నాడు. ఇద్దరి కాంబోలో హై యాక్షన్ సినిమా తెరకెక్కించనున్నట్లు టాక్ నడుస్తున్నది. త్వరలోనే వివరాలను ప్రకటించనున్నారు. ఇక అల్లు అర్జున్‌తో జాన్వీ కపూర్ రొమాన్స్ చేయనున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంపై ఇప్పటి వరకు ఎవరూ అధికారిక ప్రకటన చేయలేదు. జాన్వీ కపూర్ తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' మూవీతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది.

## "తకిట తధిమి తందాన" టీజర్ ను విడుదల చేసిన

# కేంద్రమంత్రి బండి సంజయ్

తెలంగాణా రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ చేతుల మీదుగా "ఫస్ట్ లుక్ పోస్టర్" ఆవిష్కారం జరుపుకున్న వినూత్న యూత్ ఫుల్ ఎంటర్టైనర్ "తకిట తధిమి తందాన" చిత్రం తాజాగా భాజపా అగ్రనేత - కేంద్రమంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా టీజర్ విడుదల జరుపుకుంది. యూత్ తోపాటు, ఫ్యామిలీ ఆడియన్స్ ను అమితంగా ఆకట్టుకునేలా టీజర్ ఉందని ప్రశంసించిన బండి సంజయ్... "తకిట తధిమి తందాన" ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. "మర్డర్" ఫేమ్ ఘన ఆదిత్య - కొత్తమ్మాయి ప్రియ జంటగా.. యువ ప్రతిభాశాలి రాజ్ లోహిత్ దర్శకత్వంలో ఎల్లో మ్యాంగో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై.. చందన్ కుమార్ కొప్పుల నిర్మించిన "తకిట తదిమి తందాన" చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని, ఈనెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం సినెటేరియా మీడియా వర్క్స్ ఆధ్వర్యంలో విడుదల కానుంది. ఈ చిత్రానికి పి.ఆర్.ఓ: ధీరజ్-అప్పాజీ, సంగీతం: నరేన్ రెడ్డి, ఎడిటర్: హరి శంకర్, సినిమాటోగ్రఫీ: పి.ఎన్.అంజన్, లిరిక్స్: శ్రేష్ట, కో-రైటర్: దిలీప్ అరుకొండ!!

## కన్నడంలో భగీరథ 'నాగలాదేవి'

రచయిత , సీనియర్ జర్నలిస్ట్ , చారిత్రిక పరోశోధకుడు భగీరథ రచించిన 'నాగలాదేవి ' నవలను కన్నడంలోకి అనువదిస్తానని వీరశైవ కళాశాల తెలుగు అధ్యాపకులు ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ . దేవన్న ప్రకటించారు . శ్రీకృష్ణదేవరాయల అపురూప ప్రేమకథను భగీరథ నాగలాదేవి పేరుతో రచించిన గ్రంథాన్ని బళ్లారిలో రాఘవ కళామందిర్ లో తెలుగు సంస్కృతీ సమితి , బలిజ సంఘం సంయుక్తంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర మాజీ శాసన సభ్యులు నారా సూర్యనారాయణ రెడ్డి ఆవిష్కరించారు . ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ దేవన్న మాట్లాడుడూ .. మధ్యయుగాల నాడు శ్రీకృష్ణదేవరాయలు హిందూ జాతికోసం అలుపెరుగని పోరాటం చేసిన మహా యోధుడని , ఆయన మాట తప్పని , మడమ తిప్పని పాలకుడని , నాగలాదేవి అనే వేశ్య కుటుంబంలో జన్మించిన అమ్మాయిని ప్రేమించి పెళ్లిచేసుకున్న ఆదర్శప్రాయుడని దేవన్న కొనియాడారు . అలాంటి కృష్ణదేవరాయలు , నాగలాదేవి మధ్య వున్న సున్నితమైన ప్రేమ కథను రచయిత భగీరథ పరిశోధన చేసి రచించిన అద్భుతమైన కావ్యం నాగలాదేవి అని చెప్పారు . నాగలాదేవి తెలుగు పుస్తకాన్ని తానూ కన్నడంలోకి అనువదిస్తామని సభా ముఖంగా ప్రకటిచారు .



సభకు అధ్యక్షత వహించిన నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు బిక్కి కృష్ణ మాట్లాడుతూ .. రచయిత భగీరథ పదిహేను సంవత్సరాపాటు పరిశోధన చేసి రూపొందించిన అద్భుతమైన ప్రేమ కావ్యం నాగలాదేవి అని, ఈ పుస్తకాన్ని బళ్లారిలో ఇంతమంది సాహితీవేత్తల సమక్షంలో ఆవిష్కరింపచేయడం ఆనందంగా ఉందని చెప్పారు . డాక్టర్ బీరం సుందర్ రావు మాట్లాడుతూ . . భగీరథ గారు రచించిన నాగలాదేవి చారిత్రిక నవలల్లో అత్యుత్తమమైనది , ఈ దశాబ్దంలో నేను చదివిన గొప్పనవలని చెప్పారు . నాగలాదేవి నవలను దేవాంన్నగారు కన్నడంలోకి అనువదిస్తామని చెప్పడం చాలా సంతోషాన్ని కలిగించిందని అన్నారు .
సభలో డాక్టర్ జెల్ది విద్యాధర్ , న్యాయవాది రాఘవ కళామందిర్ అధ్యక్షులు కె . కోటేశ్వర రావు , డాక్టర్ గాదెమ్ గోపాలకృష్ణ , ఎస్. మురళీకృష్ణ , అమరేంద్రనాథ్ చౌదరి , జి . ప్రభాకర్ , కె .రమేష్ బుజ్జి తదితరులు మాట్లాడారు . రచయిత భగీరథ మాట్లాడుతూ .. 2007లో జగపతిబాబు , భూమిక , అనుష్క సినిమాకు తాను ప్రొజెక్టర్ గా పనిచేసినప్పుడు , ఆ సినిమాలో ఒక పాటను హంపి లో చిత్రీకరించాలని , అప్పుడు మొదటిసారి హంపిని సందర్శించాన్ని చెప్పారు . అప్పుడు శిథిలమైన హంపి మహానగరాన్ని చూసి చలించిపోయి పరిశోధన చేయడం మొదలు పెట్టానని చెప్పారు . కాకతీయ , విజయనగర సామ్రాజ్యాల మీద తన పరిశోధన సాగిందని , కృష్ణదేవరాల రెండవ భార్య నాగలాదేవి ప్రేమ కథ తనని బాగా ఆకట్టుకొంది అందుకే ఆమె మీద 15 సంవత్సరాల పాటు ఢిల్లీ , ముంబై , చెన్నై , గోవా , మైసూర్ , హంపి , వరంగల్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పరిశోధన చేశానని భగీరథ తెలిపారు . నాగలాదేవి నవలకు వస్తున్న స్పందన చూసిన తరువాత తన కష్టాన్ని మర్చిపోయానని , బళ్లారిలో 18 సంవత్సరాల తరువాత ఈ నవల ఆవిష్కరణ జరగడం యాదృచ్ఛికమైనా , ఎంతో అనుభూతిని కలిగించిందని భగీరథ చెప్పారు . ఈ సందర్భముగా డాక్టర్ ఆర్ . దేవన్నకు భగీరథ కృతజ్ఞతలు తెలిపారు .



మహా కుంభ మేళాలో పుణ్య స్నానం ఆచరించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు, సతీమణి శ్రీమతి అనా కొణిదెల గారు. ఈ పుణ్య స్నాన కార్యక్రమంలో శ్రీ పవన్ కళ్యాణ్ గారి తనయుడు శ్రీ అకీరా నందన్, ప్రముఖ దర్శకులు శ్రీ త్రివిక్రమ్ పాల్గొన్నారు.

# ఇంటెన్స్ మ్యూజికల్ లవ్ స్టోరీగా "దిల్ రూబా" ఆకట్టుకుంటుంది

## 'హే జింగిలి..' పాట రిలీజ్ ఈవెంట్ లో హీరో కిరణ్ అబ్బవరం

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "దిల్ రూబా". ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్ గా నటిస్తోంది. "దిల్ రూబా" చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. "దిల్ రూబా" సినిమా మార్చి 14న హోలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో జరిగిన ఈవెంట్ లో "దిల్ రూబా" సెకండ్ సింగిల్ 'హే జింగిలి..' రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ రవి మాట్లాడుతూ - మా "దిల్ రూబా" సినిమా సెకండ్ సింగిల్ 'హే జింగిలి..' రిలీజ్ ఈవెంట్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. సినిమాను అందరికీ నచ్చేలా చేసిన మా టీమ్ కు థ్యాంక్స్. నేను ప్రొడ్యూసర్ డిస్ట్రిబ్యూటర్ కాబట్టి సారెగమా వాళ్లు మాతో టైఅప్ అయ్యారు. మాది పాన్ ఇండియా రిలీజ్ మూవీ కాకపోయినా పాన్ ఇండియా ప్రొడక్షన్ తో కలిసి సినిమా చేశాం. మార్చి 14న మీ ముందుకు రిలీజ్ కు వస్తున్నాం. "దిల్ రూబా" తప్పకుండా మీ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాం. అన్నారు. కొరియోగ్రాఫర్ ఈశ్వర్ పెంటి మాట్లాడుతూ - "దిల్ రూబా" మూవీలో హే జింగిలీ పాటకు కొరియోగ్రాఫీ చేసే అవకాశం ఇచ్చిన దర్శకుడు విశ్వకరుణ్ కు థ్యాంక్స్. ఈ పాటలో కిరణ్ గారిని అర్బన్ లుక్ లో మంచి స్టెప్స్ చేయించామని కిరణ్ గారి ఫ్యాన్స్ నుంచి ప్రశంసలు వస్తున్నాయి. ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్ లోకి వెళ్తుందని ఆశిస్తున్నాం. భాస్కరభట్ల గారి లిరిక్స్ నేను కొరియోగ్రఫీ చేసేందుకు చాలా హెల్ప్ అయ్యాయి. రుక్సర్ తో వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. ఈ పాటను, సినిమాను మీరంతా సూపర్ హిట్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు. లిరిక్ రైటర్ భాస్కరభట్ల మాట్లాడుతూ - హే జింగిలి పాట మొదట్లో మేము అనుకున్నట్లు రాలేదు. సామ్ గారిని కలిసి మీ దగ్గరున్న ట్యూన్ ఏదైనా ఉంటే ఇవ్వండి అని అడిగాము. ఆయన మొహమాటపడుతూనే నచ్చుతుందో నచ్చదో అని ఒక ట్యూన్ ఇచ్చారు. వింటే అద్భుతంగా అనిపించింది. వెంటనే కిరణ్ గారికి, డైరెక్టర్ విశ్వ గారికి వినిపించి ఓకే



చేశాం. అలా హే జింగిలి పాట తయారైంది. "దిల్ రూబా" సినిమాకు ఆయువు పట్టులాంటి పాట ఇది. సినిమా సక్సెస్ లో ఈ పాటకు క్రెడిట్ దక్కుతుంది. నేను హీరో కిరణ్ అబ్బవరంను సోదరుడిలా భావిస్తా. ఎస్ ఆర్ కల్యాణమండపం సినిమా నుంచి మేము కలిసి ట్రావెల్ చేస్తున్నాం. అగ్నికి ఆజ్యంలా మా ఇద్దరికీ డైరెక్టర్ విశ్వకరుణ్ తోడయ్యారు. రుక్సర్ గ్లామర్ తో ఆకట్టుకుంటుంది. అలాగే ఈశ్వర్ మంచి కొరియోగ్రఫీ చేశారు. "దిల్ రూబా" సూపర్ హిట్ కావాలని కోరుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ విశ్వ కరుణ్ మాట్లాడుతూ - హే జింగిలి పాటను మీరంతా ఎంజాయ్ చేశారని నమ్ముతున్నాం. ఈ పాటలో కిరణ్ గారు, రుక్సర్ పెయిర్ చాలా బాగుంది. ఫస్ట్ టైమ్ లవ్ లో పడిన అబ్బాయి కింగ్ లా ఫీలవుతాడు. ఆ లవ్ ఫెయిలై సెకండ్ టైమ్ లవ్ లో పడినప్పుడు అతనిలో ఒక భయం మొదలవుతుంది. ఇలాంటి ఒక ఎక్స్ ప్రెషన్ చెప్పగానే భాస్కరభట్ల గారు సూపర్బ్ లిరిక్స్ ఇచ్చారు. సామ్ సీఎస్ గారు సూపర్ హిట్ ట్యూన్ ఇచ్చారు. గంటలో ఈ పాట రెడీ అయ్యింది. దిల్ రూబాలో హే జింగిలి సాంగ్ కు మంచి పేరొస్తుంది. మీరంతా మా మూవీకి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం. అన్నారు. హీరోయిన్ రుక్సర్ థిల్లాన్ మాట్లాడుతూ - "దిల్ రూబా" మూవీ ప్యూర్ లవ్ ఎమోషన్, ఫీలింగ్ తో ఉంటుంది. నా క్యారెక్టర్ ద్వారా ఫుల్ లవ్ అండ్ ఎమోషన్ చూపించాను. మా మూవీ రిలీజ్ కొంచెం ఆలస్యమైంది. రంగుల పండుగ హోలీ సందర్భంగా ఈ కలర్ ఫుల్ లవ్ స్టోరీతో మార్చి 14న రిలీజ్ కు వస్తున్నాం. ఈ మూవీలో నా క్యారెక్టర్ కు ప్రాధాన్యత ఉంటుంది. నా క్యారెక్టర్ ద్వారా మంచి ఎమోషన్ చూపించే అవకాశం దక్కింది. నాకు, కిరణ్ కు మధ్య వచ్చే సీన్స్ ఆకట్టుకుంటాయి. మీరంతా థియేటర్ లో మూవీ చూసి ఇచ్చే రెస్పాన్స్ కోసం వేచి చూస్తున్నా. మీతో కలిసి మా టీమ్ అంతా మూవీ చూడాలనుకుంటున్నాను. నాతో వస్తావా అని హే జింగిలి పాటలో ఒక లైన్ ఉంది. అలా మీరంతా మార్చి 14న థియేటర్స్ లోకి "దిల్ రూబా" చూసేందుకు మాతో వస్తారా. మా టీమ్ అంతా వెయిట్ చేస్తున్నాం. అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ - "దిల్ రూబా" మూవీ చేసినందుకు చాలా గర్వంగా హ్యాపీగా ఫీలవుతున్నాను. ఇంటెన్స్ మ్యూజికల్ లవ్ స్టోరీగా "దిల్ రూబా" మీ అందరినీ ఆకట్టుకుంటుంది. సారెగమా వాళ్లు ఫస్ట్ టైమ్ ఈ మూవీతో టాలీవుడ్ లోకి వస్తున్నారు. ప్రొడ్యూసర్ రవి గారు, డైరెక్టర్ విశ్వకరుణ్ మూడేళ్లుగా ఈ ప్రాజెక్ట్ కోసం కష్టపడ్డారు. వాళ్ల కోసమైనా ఈ మూవీ తప్పకుండా సక్సెస్ కావాలి. వాలెంటైన్స్ డే సందర్భంగా "దిల్ రూబా" రిలీజ్ చేయాలని అనుకున్నాం. అయితే కంగారుగా మూవీని రిలీజ్ చేయడం ఎందుకని ఆగాం. సంక్రాంతి సినిమాలు కంప్లీట్ అయ్యాక, కంటెంట్ ను ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని, ప్రమోషన్ ప్లాన్ చేసుకుని మార్చి 14న హోలీ పండుగ రోజు రిలీజ్ చేయాలని ఫిక్స్ అయ్యాం. హోలీ మంచి డేట్. ప్రొడ్యూసర్స్ సపోర్ట్ వల్ల ఎలాంటి తొందరపాటు లేకుండా మూవీని రిలీజ్ చేయగలుగుతున్నాం. రుక్సర్ ఈ రోజు ఈవెంట్ కు వచ్చింది. తనతో వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. హే జింగిలి పాటలో మా పెయిర్ బాగుంటుంది. భాస్కరభట్ల నన్ను బ్రదర్ లా చూసుకుంటారు. ఎస్ఆర్ కల్యాణమండపం సినిమా నుంచి మేము కలిసి ట్రావెల్ చేస్తున్నాం. నా మూవీకి పాట రాసేప్పుడు ఎంతో శ్రద్ధ తీసుకుంటారు. ఆయనకు పాట వెళ్తుందంటే నేను నిశ్చింతగా ఉంటాను. సామ్ సీఎస్ గారు "దిల్ రూబా"కు బ్యూటిఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. అగ్గిపుల్లె ఛాట్ బస్టర్ అయ్యింది. హే జింగిలి పాటకు కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది. త్వరలోనే థర్డ్ సింగిల్ రిలీజ్ చేయబోతున్నాం. సామ్ సీఎస్ గారి బీజీఎం చూశాక ఈ సినిమాను మీరు థియేటర్స్ లో మరింతగా ఎంజాయ్ చేస్తారనే నమ్మకం కుదిరింది. నా సినిమాలన్నింటిలో "దిల్ రూబా"లో ఇంటెన్స్ క్యారెక్టర్ చేశాను. నా క్యారెక్టర్ లాగే యాక్షన్ ఎపిసోడ్స్ ఇంటెన్స్ గా ఉంటాయి. "దిల్ రూబా" యాక్షన్ ఎపిసోడ్స్ స్క్రీన్ మీద కొత్తగా ఉండి ఎంజాయ్ చేస్తారు. పృథ్వీ మాస్టర్ చాలా బాగా ఈ ఫైట్స్ డిజైన్ చేశారు. టీజర్ ట్రైలర్ లో ఏది చూపించామో అదే సినిమాలో ఉంటుంది ఎక్కడా అనవసరపు కంటెంట్ పెట్టలేదు. మూవీని మ్యూజికల్ ఆకట్టుకునేలా చూపించబోతున్నాం. మా కంటెంట్ మీకు నచ్చితే మార్చి 14న థియేటర్స్ లో "దిల్ రూబా" చూసి సపోర్ట్ చేయండి. అన్నారు.హే జింగిలి పాటను టాలెంటెడ్ మ్యుజీషియన్ సామ్ సీఎస్ కంపోజ్ చేసి బ్యూటిఫుల్ గా పాడారు. ఈ పాటకు భాస్కరభట్ల క్యాచీ లిరిక్స్ అందించారు. హే జింగిలి పాట ఎలా ఉందో చూస్తే - హే జింగిలి, హే జింగిలి నా జిందగీ నిండుగా జల్లావు రంగులే, హే జింగిలి, హే జింగిలి నా సింగిలు లైఫ్ నే తిప్పావే రింగులే..లబ్ డబ్ లబ్ డబ్ హార్ట్ బీటు ఆగిపోయే, లవ్ లవ్ లవ్ లవ్ పాటలాగ మారిపోయే..అంటూ రొమాంటిక్ లవ్ ఫీల్ తో ఆకట్టుకుంటోంది.

Editor, Printed, Published and Owned by Sudheer Kumar, Printed at Ratna Graphics , # 2-3-703/7, Thirumala Nagar Colony, Opposite : Police Line , Amberpet, Hyderabad-500013, Published At H.NO. 6-3-553/G2, ClassicCourt Anexa, opp: NKM Grand, Erramanzil Colony, Somajiguda, Hyderabad-500038, T.S. E-Mail: info.southindiatimes@gmail.com. ,Contact :9000657700. RNI NO. APTEL/2012/46756